

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

తాడేపల్లిగూడెం

: fb.com/vaartha Digital

Published from Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

28-3-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 56 పేజీలు: 8+4 వెల: 6.50


**పెట్రోలు, డిజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీ తగ్గింపు**

5లో

**ప్రజాదరణలో ప్రధాని మోడీ ప్రపంచంలోనే టాప్**

## నేడు ప్రత్యేక అసెంబ్లీ

### రాజధానిగా అమరావతికి పూర్తిస్థాయి చట్టబద్ధత కల్పించే దిశగా కార్యాచరణ

### ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే బిల్లుకు ఆమోదం

**విజయవాడ, మార్చి 27 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి పూర్తి స్థాయి చట్టబద్ధత కల్పించే దిశగా కీలక కార్యచరణ చేపట్టామని ఎపిసిఎం చంద్రబాబు తెలిపారు. ఈ నెల 28వ తేదీన (శనివారం) ఉదయం 11 గంటలకు అసెంబ్లీ ప్రత్యేక సమావేశం జరుగుతుందని వివరించారు. పార్లమెంట్‌లో ఇందుకు సంబంధించి కేంద్రం బిల్లు ప్రవేశపెట్టే క్రమంలో మన అసెంబ్లీ కుడా కీలక తీర్మానం చేస్తోందన్నారు. అమరావతిని రాజధానిగా గుర్తించాలనే అంశంపై ఇప్పటివరకు చట్టపరమైన స్పష్టత లేదని, ఈ లోటును భర్తీ చేసేందుకే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. విజయవాడ, అమరావతి ప్రాంతమే రాష్ట్ర రాజధానిగా ఉండాలని అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి, వెంటనే కేంద్ర ప్రభుత్వానికి పంపనున్నట్లు వివరించారు. కేంద్ర ప్రభుత్వం కూడా అమరావతిని రాజధానిగా ఆమోదించిందని, అయితే పార్లమెంటులో బిల్లు పాస్ కావాల్సి ఉందని పేర్కొన్నారు. ఈ నెల 4వ తేదీ వరకు పార్లమెంటు సమావేశాలు ఉన్నందున, రాష్ట్ర అసెంబ్లీ చేసే తీర్మానాన్ని వెంటనే పార్లమెంటులో ప్రవేశపెట్టి చట్టం చేయించేలా నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ చట్టం పూర్తయితే రాజధాని విషయంలో కొందరు చేస్తున్న విమర్శలకు శాశ్వతంగా తెరపడుతుందని స్పీకర్ స్పష్టం చేశారు. ఏపీ రాష్ట్ర విభజన చట్టంలోని 5(2)కి సవరణ చేసేందుకు కేంద్రం కొద్దిరోజుల కిందటే చర్యలు ప్రారంభించిందని తెలిపారు. దీనికి ఇప్పటికే న్యాయశాఖ ఆమోదముద్ర లభించింది. రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి పంపిన తర్వాత కేంద్ర మంత్రివర్గం ఆమోదించనుంది. ఆ తర్వాత పార్లమెంటులో

>>2



శుక్రవారం న్యూఢిల్లీ నుంచి సిఎంలతో వర్చువల్‌గా మాట్లాడుతున్న ప్రధాని మోడీ

# ఇది సంక్షోభమే.. గట్టెక్కుదాం

### సమష్టి కృషితో టీమిండియా ఈ సమస్యను అధిగమించాలి

### బ్లాక్ మార్కెటీర్లపై కొరడా ఝుళిపించండి

### ఆర్థిక స్థిరత్వం, ఇంధన భద్రతకు ప్రాధాన్యం

### సంక్షోభ పరిష్కారానికి ఐఎంజి ఏర్పాటు

### సిఎంలతో వర్చువల్‌గా చర్చించిన ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ,మార్చి 27:** ఆర్థికస్థిరత్వం, ఇంధనభద్రత ప్రధాన లక్ష్యాలుగా పరిగణించాలని ప్రధాని నరేంద్రమోడీ రాష్ట్రాలసీఎంలకు సూచించారు. పశ్చిమాసియా సంక్షోభంనుంచి టీమిండియా తక్షణమే అధిగమిస్తుందని ఆయన ఆకాంక్షించారు. శుక్రవారం ఎన్నికలు జరిగే రాష్ట్రాలుమినహా ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులతో వర్చువల్‌గా భేటీ అయిన ప్రధాని నరేంద్రమోడీ

>>2

## పెట్రోలు, డీజిల్‌పై ఎక్సైజ్ తగ్గింపు మంచిదే: సిఎం

**విజయవాడ, మార్చి27 ప్రభాతవార్త ప్రతినిధి:** పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదిక ట్వీట్ చేసారు. ప్రజాహితాన్ని దృష్టిలో పెట్టుకుని తీసుకున్న కీలక చర్య తీసుకోవటం పట్ల సంతోషంగా ఉందన్నారు. ఈ నిర్ణయాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వాగతిస్తోందన్నారు.




ప్రధానితో వర్చువల్‌గా మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు





ఒంటిమిట్ట కోదండ రామాలయంలో ధ్వజపటాన్ని ఎగుర వేస్తున్న అర్చకులు (ఇన్‌సెట్) ఏకశిలా నగరికి బ్రహ్మోత్సవ శోభ

శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

శేష వాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చిన సీతా రామలక్ష్మణులు

## ఒంటిమిట్టలో వైభవంగా ధ్వజారోహణం

**రాజంపేట, మార్చి27 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీరామనవమి వేడుకలు ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం ధ్వజారోహణంతో శ్రీరామ బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున 3 గంటలకు కోవెల తెరిచి స్వామికి సుప్రభాత సేవ నిర్వహించారు. సుప్రభాత సేవతో స్వామిని మేల్కొల్పి శాస్త్రోక్తంగా పూజలు

>>2



అయోధ్యలో బాలరాముడి నుదుట సూర్యతిలకం

## బాలరాముని నుదుట 'సూర్య తిలకం'

అపురూప దృశ్యాన్ని తిలకించేందుకు లక్షలాదిగా అయోధ్యకు తరలి వచ్చిన భక్తులు

2లో

### ఉగ్ర లింక్‌ల కేసు

## మరో ఆరుగురు అరెస్ట్

**విజయవాడ, మార్చి 26 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ ఉగ్ర లింకుల కేసులో మరో ముగ్గుర్ని పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు అజ్మతుల్లా ఖాన్, జిషాన్ అబ్దుల్, షేక్ ఫైజ్‌ని అరెస్టు చేసిన పోలీసులు విజయవాడ తీసుకొచ్చారు. వీరితో పాటు మరో ముగ్గురు నిందితులను పోలీసులు కోర్టులో హాజరుపరచనున్నారు. ఈ కేసులో మొత్తం 13 మంది నిందితులుగా ఉండగా వారిలో తాజా అరెస్ట్‌లతో కలిపి 12 మంది అరెస్ట్ అయ్యారు. బెజవాడ యువకులతో కలిసి సామాజిక మాధ్యమాల్లో తీవ్రవాద భావజాలాన్ని వ్యాప్తి చేస్తున్న కేసులో బిహార్‌కు చెందిన షాద్‌మాన్ దిల్‌కష్‌ను ఇప్పటికే పోలీసులు అరెస్ట్ చేశారు. ఇతని రిమాండ్ రిపోర్టును గమనిస్తే షాద్‌మాన్ తల్లిదండ్రులిద్దరూ ఉపాధ్యాయులు. పేద పిల్లలకు వీరు ఉచితంగా చదువు చెబుతుంటారు. డాక్టర్ కావాలనే లక్ష్యంతో నీట్ పరీక్షకు సిద్ధమవుతున్న షాద్‌మాన్ ఉగ్రవాద భావజాలం వైపు ఆకర్షితుడయ్యాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో

>>2



## ఎండలు మండుతున్నాయ్..

### వారం రోజుల్లో 38°లకు పెరిగిన ఉష్ణోగ్రతలు

### 9 మండలాల్లో తీవ్ర వడగాడ్పులకు అవకాశం

**విజయవాడ, మార్చి 27 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో ఎండల భగ్గుమంటున్నాయి, భారీ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. తీవ్రత ఒక్కసారిగా పెరుగుతోంది. గత వారం రోజుల్లో పలు ప్రాంతాల్లో సగటు ఉష్ణోగ్రతలు 36 నుంచి 38 డిగ్రీలువరకు ఉన్నాయి. సాధారణం వేసవి ఎండలు మార్చి మూడవ వారంలో క్రమంగా పెరుగుతుంటాయి. గతంలో ఉన్న పరిస్థితులను గమనిస్తే మార్చి మాసాంతంలో సగటు ఉష్ణోగ్రతలు 32 డిగ్రీల నుంచి 33వరకు ఉంటాయి, అయితే ఇందుకు భిన్నంగా ఈ ఏడాదిమార్చి నెల ముగియకముందే భానుడు భగభగమంటున్నాడు. ఈ నేపథ్యంలో రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) పలు ప్రాంతాలకు వడగాలుల హెచ్చరిక జారీ చేసింది. రాష్ట్రంలోని 9 మండలాల్లో తీవ్ర వడగాలులు, మరో 32 మండలాల్లో సాధారణ వడగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. కొన్ని జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40 నుంచి 42 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేసింది. విపత్తుల శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. పార్వతీపురం మన్యం జిల్లాలోని గుమ్మలక్ష్మీపురం, కురుపాం, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని చింతూరు, కూనవరం, వి.ఆర్.పురం, కాకినాడ జిల్లాలోని జగ్గంపేట, తూర్పుగోదావరి జిల్లాలోని కోరుకొండ, ఎన్టీఆర్ జిల్లాలోని జి. కొండూరు, ఇబ్రహీంపట్నం మండలాల్లో తీవ్ర వడగాలులు నమోదయ్యే అవకాశం ఉంది. వీటితో పాటు ఎన్టీఆర్ జిల్లాలో 7, విజయనగరంలో 4, ఏలూరులో 4, పార్వతీపురం మన్యంలో 3, అల్లూరి జిల్లాలో 3, తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాల్లో రెండేసి చొప్పున, కాకినాడ, గుంటూరు జిల్లాల్లో ఒక్కో మండలం చొప్పున మొత్తం 32 మండలాల్లో వడగాలులు వీస్తాయని పేర్కొంది. శనివారం (మార్చి 28) పరిస్థితి మరింత తీవ్రంగా ఉండవచ్చని, ఏకంగా 90 మండలాల్లో వడగాలులు నమోదయ్యే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ప్రజలు మధ్యాహ్నం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వీలైనంత వరకు ఇళ్లకే పరిమితం కావాలని, బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ వంటివి వాడాలని సూచించారు. వృద్ధులు, గర్భిణులు, బాలింతలు మరింత జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. రాష్ట్రంలో ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. ఇంకా ఏప్రిల్ రాకముందే వడగాలులు వీచే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ

>>2

## రఘురామ కృష్ణరాజుపై దాడికి యత్నం

### ఆకివీడులో ఉద్రిక్తత

**ఆకివీడు, మార్చి 27 ప్రభాత వార్త:** పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులో శ్రీరామనవమి పర్వదినాన చోటుచేసుకున్న ఉద్రిక్తతలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామ కృష్ణరాజు లక్ష్యంగా జరిగిన ఈ దాడి స్థానికంగా కలకలం రేపుతోంది. రాజకీయ విభేదాలకు తోడు ఆలయ భూవివాదం తోడవడంతో ఈ ఘటన ఒక్కసారిగా హింసాత్మక రూపం దాల్చింది. ఆకివీడు పట్టణంలోని స్థానిక రామాలయానికి చెందిన భూమి విషయంలో గత కొంతకాలంగా రెండు వర్గాల మధ్య తీవ్ర స్థాయిలో వివాదం నడుస్తోంది. ఈ భూమిపై యాజమాన్య హక్కులు, వినియోగం విషయంలో ఇరు వర్గాలు పట్టుదలతో ఉన్నాయి. ఈ క్రమంలోనే శ్రీరామనవమి వేడుకల సందర్భంగా ఆలయాన్ని సందర్శించి, స్వామివారిని దర్శించుకోవాలని స్థానికులు ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజును ఆహ్వానించారు. ఈ ఆహ్వానం మేరకు ఆయన ఆకివీడు పర్యటనకు సిద్ధమయ్యారు. అయితే, ఆయన రాకను వ్యతిరేకిస్తున్న ఒక వర్గం ముందుగానే నిరసనకు ప్రణాళికలు రచించినట్లు తెలుస్తోంది. రఘురామకృష్ణరాజు ఆలయ పరిసరాలకు చేరుకోగానే పరిస్థితి ఒక్కసారిగా అదుపు తప్పింది. ఆయన రాకను నిరసిస్తూ ఒక వర్గానికి చెందిన వ్యక్తులు పెద్ద పెట్టున నినాదాలు చేయడం ప్రారంభించారు. నిరసన కాస్తా హింసకు దారితీసింది. ఆందోళనకారులు ఒక్కసారిగా ఎమ్మెల్యే కాన్వాయ్‌పైకి రాళ్లు రువ్వారు. కేవలం రాళ్లతోనే ఆగకుండా, పక్కా ప్రణాళికతో మేకులతో దాడి చేశారు. దీంతో అక్కడ ఉన్న కూటమి నేతలు, కార్యకర్తలు రఘురామరాజుకు

>>2

**దాడిని ఖండించిన డి.సిఎం పవన్ కళ్యాణ్**

2లో



### అనకాపల్లి-దివాన్ చెరువు

## ఆరు లేన్లతో మరో జాతీయ రహదారి

**విజయవాడ,మార్చి 27 ప్రభాతవార్త ప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వం ఆరు లైన్ల నేషనల్ హైవేకు లైన్ క్లియర్ ఏపీలో జాతీయ రహదారుల అభివృద్ధిపై దృష్టి పెట్టింది. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏ) పరిధిలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులతో పాటు కొత్త పనులపై కూడా ముందడుగు వేస్తోంది. ఏపీలో వాహనదారుల అవసరాలకు అనుగుణంగా పలు జాతీయ రహదారులను విస్తరిస్తున్నారు. అందులో భాగంగా మరో నేషనల్ హైవేను కూడా మరింతగా విస్తరించేందుకు ఎన్‌హెచ్‌ఏఐ సిద్దమైంది. అనకాపల్లి నుంచి తూర్పుగోదావరి వరకు ఉన్న 16వ జాతీయ రహదారి ప్రస్తుతం నాలుగు లైన్లుగా ఉంది. అయితే దీనిని ఆరు లైన్ల రహదారిగా

>>2

# భారీ జిఎస్టీ స్కామ్

### రూ.217 కోట్ల మేర తెలంగాణ, ఎపిలో వెలుగుచూసిన వైనం




### హైదరాబాద్ కేంద్రంగా నకిలీ లావాదేవీలు

### షెల్ కంపెనీలతో రూ.1,472 కోట్ల మేర ఇన్వాయిస్‌లు

### పలుచోట్ల ఇంటెలిజెన్స్ దాడులు

**హైదరాబాద్, మార్చి 27, ప్రభాతవార్త:** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో భారీ జీఎస్టీ స్కామ్ వెలుగుచూసింది. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్స్ (డీజీజీఐ) అధికారులు ఈ కుంభకోణాన్ని బయటపెట్టారు. హైదరాబాద్ కేంద్రంగా సాగుతున్న ఈ దందాపై పక్కా సమాచారంతో శుక్రవారం దాడులు నిర్వహించిన అధికారులు, ఏకంగా రూ.217కోట్ల మేర పన్ను ఎగవేసినట్లుగా జరిగినట్లు గుర్తించారు. నకిలీ లావాదేవీలతో ప్రభుత్వానికి చెల్లించాల్సిన జీఎస్టీని ఎగ్గొట్టడమే కాకుండా, తప్పుడు పద్ధతిలో రూ.217 కోట్ల మేర ఐటీసీని క్లెయిమ్ చేసినట్లుగా దర్యాప్తులో తేలింది. ఈ మేరకు హైదరాబాద్లోని ప్రధాన కార్యాలయాలతో పాటు ఏపీలోని పలు ప్రాంతాల్లో డీజీజీఐ అధికారులు ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న సుమారు 72 షెల్ కంపెనీల నెట్‌వర్క్ విచారణలో బట్టబయలైంది. ఎలాంటి ఎటువంటి వస్తువుల సరఫరా, సర్వీసు లేకుండా కేవలం ఫేక్ డాక్యుమెంట్లతో రూ.1,472 కోట్ల విలువైన కృత్రిమ లావాదేవీలను సృష్టించినట్లుగా తెలుస్తోంది. ఇద్దరు కీలక వ్యక్తులు సిద్దగోని ప్రభాకర్, రమావత్ నాగరాజు నాయక్‌లను అధికారులు అరెస్టు చేశారు. పరారీలో ఉన్న దంట్ల ఆదిరెడ్డి అలియాస్ అంజిరెడ్డి ఈ నెట్‌వర్క్‌కు సూత్రధారిగా ఉన్నట్లు విచారణలో తేలింది. డీజీజీఐ అధికారులు ప్రకారం, అసాధారణమైన జీఎస్టీ రిజిస్ట్రేషన్లు,

>>2

## తుంగభద్రలో నలుగురు మృతి

### పెళ్లికి వచ్చి విగతజీవులైన వైనం

### కందుకూరులో విషాదం

**కోసిగి, మార్చి 27, ప్రభాతవార్త:** బాజా భజంత్రాల మధ్య పెళ్లీలు జరుగుతాయి.. కానీ వారింట చావు బాజాలు మోగాయి.. స్నానాలకు తుంగభద్ర నదికి వెళ్లి గల్లంతై నలుగురు వ్యక్తులు మృతి చెందారు. కర్నూలు జిల్లా కోసిగి మండలం కందుకూరు గ్రామంలో జరిగే పెళ్లికి వచ్చిన కర్ణాటక లోని కురిడి గ్రామానికి చెందిన దాసరి ఉమావతి(28), దాసరి రత్నమ్మ(28), దాసరి శివానంద(20), దాసరి మహంతేష్ (20)లు ఒకే కుటుంబానికి చెందిన వారు గ్రామ సమీపంలో ఉన్న తుంగభద్ర నదికి స్నానాలకు వెళ్లారు. తుంగభద్ర నదిపై ఉన్న ఆర్డీయస్ ఆనకట్ట దిగువ భాగంలో నీరు ప్రవాహం తక్కువగా ఉన్న ప్రాంతానికి వెళ్లారు. అయితే అక్కడ లోతు ఎక్కువగా ఉన్న విషయం

>>2



శుక్రవారం భద్రాచలంలో సీతారాముల కల్యాణోత్సవ ఘట్టం

# కమనీయం.. కల్యాణం

## భద్రాచలంలో వైభవంగా సీతారాముల కల్యాణం

## పట్టు వస్త్రాలు సమర్పించిన తెలంగాణ సిఎం రేంవత్ రెడ్డి దంపతులు

**భద్రాచలం, ప్రభాతవార్త:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాభద్రాచలంలో శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయం శుక్రవారం భూలోక వైకుంఠంగా మారింది. ఆకాశమంత పందిరి, భూమంత మండపం, వేదఘోషల పరిమళాలు, 'శ్రీరామ జయరామ' నినాదాలతో మార్మోగిన ఈ క్షేత్రం యథార్థంగా దక్షిణ అయోధ్యను తలపించింది. జగదభిరాముడైన శ్రీరాముడు, జనకనందిని సీతమ్మవారిని అభిజిత్ లగ్నంలో పరిణయం చేసుకున్న ఈ దివ్య ఘట్టం భక్తుల హృదయాలను పరవశింపజేసింది. ఈనెల 19వ తేదీ నుండి ప్రారంభమైన బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘటమైన శ్రీరామనవమి వేడు కలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేకువ జాము నుండి శాస్త్రోక్తంగా సాగిన దివ్య తంతు ఆలయంలో ఆధ్యాత్మిక కార్యక్ర మాలు ప్రారంభమయ్యాయి. సుప్రభాత సేవలతో ప్రారంభమైన కార్యక్రమం, అభిషేకాలు, నివేదనలు, ధృవమూర్తుల ఏకాంత కళ్యాణంతో ఆరంభమైంది. అనంతరం ఉత్సవమూర్తులను అలంకరించి పల్లకి ఊరేగింపుగా మిథిలా ప్రాంగణానికి తీసుకు వచ్చారు. వేదమంత్రాల నడుమ తిరుకళ్యాణ సంకల్పం, విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం ఘనంగా నిర్వహించబడింది. సీతమ్మవారి నడుముకు దర్భతాడు బిగించడం, రక్షాసూత్రాలు ధరింపజేయడం, సువర్ణ యజ్ఞోప వీతం సమర్పించడం వంటి ప్రతి తంతు భక్తుల ను మంత్రముగ్ధులను చేసింది. మధ్యాహ్నం 12 గంటలకు అభిజిత్ లగ్నంలో జీలకర్ర బెల్లం తంతు అనంతరం మూడు మంగళసూత్రాలతో మాంగల్యధారణ జరగడం ఈ వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తి పరవశంలో భద్రగిరికి దేశ నలుమూలల నుండి తరలివచ్చిన భక్తజనం భద్రగిరిని నిండుగా కమ్మేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసింది. తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి దంపతులు ఈ మహోత్సవంలో పాల్గొనడం వేడుకకు మరింత ప్రాధాన్యత తీసుకొచ్చింది. స్వామివారికి పట్టు వస్త్రాలు, ము త్యాల తలంబ్రాలు సమర్పిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ తరఫున భక్తి చాటారు. అంతేకాకుండా రూ.351 కోట్లతో చేపట్టిన ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి భద్రాద్రి అభివృద్ధికి నూతన దిశను సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



శుక్రవారం భద్రాచలంలో సీతారాముల కల్యాణానికి పట్టువస్త్రాలు తీసుకెళుతున్న తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి దంపతులు. చిత్రంలో మంత్రులు డి.సిఎం భట్టి, తుమ్మల , సురేఖ తదితరులు

# బాలరాముడి నుదుట 'సూర్య తిలకం'

**అయోధ్య, మార్చి 27:** అయోధ్య రామమందిరంలో శ్రీరామనవమి వేడుకలు వైభవోపేతంగా జరిగాయి. నూతన ఆలయ ప్రతిష్ఠాపన తర్వాత ఇది రెండవ శ్రీరామనవమి కాగా, ఈ ఉత్సవాల్లో ప్రధాన ఆకర్షణగా సూర్య తిలకమ్ నిలిచింది. సరిగ్గా మధ్యాహ్నం 12 గంటలకు బాలరాముడి విగ్రహం నుదుటిపై సూర్యకిరణాలు నేరుగా ప్రసరించి, అద్భుతమైన తిలకంగా మారాయి. దాదాపు 4 నిమిషాల పాటు ఈ దివ్యమైన దృశ్యం ఆవిష్కృతమవ్వడంతో గర్భగుడి మొత్తం దేదీప్యమానంగా వెలిగిపోయింది. ఈ అద్భుత ఘట్టం వెనుక ఆధునిక విజ్ఞానశాస్త్రం ఉంది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ (ఐఐఏ) శాస్త్రవేత్తలు రూపొందించిన ప్రత్యేకమైన అద్దాలు, కటకాల వ్యవస్థ ద్వారా సూర్యకిరణాలను ఆలయం పై అంతస్తు నుంచి నేరుగా గర్భగుడిలోని విగ్రహంపైకి మళ్లించారు. శ్రీరాముడు సూర్య వంశస్థుడు కావడంతో, ఆయన జన్మదినాన సాక్షాత్తు సూర్యభగవానుడే తిలకం దిద్దినట్లుగా భక్తులు ఈ ఘట్టాన్ని భావిస్తారు. ఈ అద్భుతాన్ని కనులారా వీక్షించేందుకు లక్షలాది మంది భక్తులు అయోధ్యకు తరలివచ్చారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, ఆలయ అధికారులు నగరం అంతటా పెద్ద ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేసి ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఈ సందర్భంగా బాలరాముడికి 56 రకాల నైవేద్యాలు సమర్పించారు. ఈ ఏడాది వీఐపీ దర్శనాలను రద్దు చేసి, సామాన్య భక్తులకే ప్రాధాన్యం ఇవ్వడం విశేషం. ఈ సూర్య తిలకం వేడుక కేవలం ఆధ్యాత్మిక ఘట్టంగానే కాకుండా, భారత శాస్త్రవేత్తల సాంకేతిక ప్రతిభకు నిదర్శనంగా నిలిచింది.

# ఉగ్ర లింక్‌ల కేసు మరో ఆరుగురు అరెస్ట్

>> షాద్‌మాన్ రైట్స్ ఐడీతో పాటు మరికొన్ని ఎకౌంట్ల ద్వారా తీవ్రవాద భావజాలాన్ని పోస్టు చేయడంతో పాటు షేర్ చేసేవాడు. ఇన్‌స్టాగ్రామ్ లోని బెనెక్స్ గ్రూప్‌లో సభ్యుడిగా ఉంటూ దేశ వ్యాప్తంగా ఉన్న సభ్యులతో సంబంధాలు నెరిపే వాడు. దేశంలో ఖిలాఫత్ స్థాపన, ఫిదాయిన్ దాడులకు ప్రణాళికలు రచించేవాడు. పాట్నాలో షాద్‌మాన్ దిల్‌కష్‌ను అరెస్టు చేసింది. నిందితు డి నివాసంలో జరిపిన సోదాల్లో ల్యాప్‌టాప్, మొబైల్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పోలీసు లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని పాట్నాలోని చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు లో పోలీసులు హాజరుపరచగా ట్రాన్సిట్ వారెంట్ జారీ అయ్యింది. దిల్‌కష్‌ను విజయవాడ తీసుకొచ్చిన పోలీసులు వైద్య పరీక్షల అనంతరం సీఎంఎం కోర్టులో న్యాయాధికారి ఎదుట ప్రవేశపెట్టారు. నిందితుడికి ఏప్రిల్ 6వ తేదీ వరకు రిమాండ్ విధించారు. అనంతరం కేంద్ర కారాగారానికి తరలించేందుకు పోలీసులు అతడిని కోర్టు బైటకు తీసుకు వచ్చారు. అదే సమయంలో న్యాయవాది సలీమ్ కేసు గురించి బిహార్ లోని నిందితుడు దిల్‌కష్ పిన్నితో మాట్లా తున్న సందర్భంలో ఫోన్ ను దిల్‌కష్‌కు ఇవ్వగా అతడు భావావేగానికి గురై ఏడ్చినట్లు సమాచా రం. తాను ఏ తప్పూ చేయలేదని బిగ్గరగా అరిచినట్లు చెబుతున్నారు. నిందితుడిని పోలీసు లు రాజమహేంద్రవరం జైలుకు తరలించారు. ఈ కేసులో ఇప్పటి వరకు అరెస్టైన వారి సంఖ్య 12కి చేరింది. ఈ నిందితులను వివిధ ప్రాంతా ల్లో అదుపు లోకి తీసుకున్న పోలీసులు వారందరి నీ విజయవాడకు తీసుకుని వచ్చారు. అరెస్టయిన నిందితులు అజ్మతుల్లా ఖాన్, జిషాన్ అబ్దుల్, షేక్ ఫైజ్‌లు విచారణలోను వింత సమాధానాలు ఇచ్చారంటున్నారు. వీరంతా ఇస్లా మిక్ భావజాలంతోనే ఉగ్రవాద మూకాలతో లింకులు ఏర్పాటు చేసుకున్నట్లు తెలుస్తోంది. కేసులో 13వ నిందితున్ని పోలీసు లు అదుపు లోకి తీసుకున్నా, అతను మైనరు కావడంతో జువైనల్ కోర్టుకు హాజరు పర్చాలని కోర్టు ఆదేశించింది. మిగిలిన వారికి రెండు వారాలు రిమాండ్ విధించింది.

## మాజీ మంత్రి జోగి రమేశ్‌కు

# పోలీసులు నోటీసులు జారీ

**విజయవాడ,మార్చి 27 ప్రభాతవార్త ప్రతినిధి:** వైసీపీ నేత, మాజీ మంత్రి జోగి రమేశ్‌కు పోలీసులు నోటీసులు జారీ చేశారు. సిఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో బాపట్ల జిల్లా భట్టిప్రోలు పోలీస్ స్టేషన్‌లో పోలీసులు కేసు ఇప్పటికే కేసున మోదు చేసారు. ఈ మేరకు ఆయనకు నోటీసు లు జారీ చేసి, వారం రోజుల్లోగా విచారణకు హాజరు కావాలని ఆదేశించారు. ఫిబ్రవరి 2వ తేదీన ముఖ్యమంత్రి చంద్రబాబును ఉద్దేశించి జోగి రమేశ్ చేసిన వ్యాఖ్యలపై ఈ కేసు నమోదైంది. ఈ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన భట్టిప్రోలు పోలీసులు, తాజాగా విచారణ ప్రక్రియను వేగవంతం చేశారు. ఇందులో భాగంగానే ఆయనకు నోటీసులు పంపారు.

# ఇది సంక్షోభమే.. గట్టెక్కుదాం

>> బ్లాక్‌మార్కెటింగ్‌పైనా, ధరలను పెంచేందుకు నిల్వలను బ్లాక్‌చేయడం వంటి వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్థిక పటిష్టతతోపాటు వాణిజ్యస్థిరత్వం, ఇంధన భద్రత, పౌరుల సంక్షేమమే ముఖ్యంగా ముందుకుపోదామని ప్రధాని దిశా నిర్దేశం చేసారు. సంక్షోభపరిష్కారంకోసం అంతర్ మంత్రిత్వశాఖల గ్రూప్ ఐఎంజిని ఏర్పాటుచేసామని, ఈనెల 3వ తేదీ నుంచి ఈ మంత్రుల బృందం పర్యవేక్షణ సాగుతోందని చెప్పారు. రాజ్‌నాథ్‌సింగ్ అధ్యక్షతన అంతర్ మంత్రిత్వశా ఖల గ్రూప్‌పని చేస్తోంది. రాష్ట్ర స్థాయిలోను, జిల్లా స్థాయిల్లోను కంట్రోల్ రూమ్‌లు మరిన్ని ఏర్పాటుచేయాలని ఎలాటి అడ్డంకులు, అంతరా యం లేకుండా నిరంతర సరఫరా అయ్యేట్లు అధికారులను అప్రమత్తం చేయాలని సూచిం చారు. అలాగే ప్రస్తుత సమస్యలను ఎదుర్కొ నేందుకు సంబంధిత శాఖల సరఫరాచెయిన్‌లు మరింత పటిష్టంచేయాల న్నారు. వ్యవసాయ రంగంలో ముందస్తు ప్రణాళి కలతో ముందుకు పోవాలని ఎరువుల కొరతను నివారించేవిధంగా సరఫరా, పంపిణీ చెయిన్‌ను తరచూ పర్యవేక్షించాలనికోరారు. సమన్వయంతో ముందుకు వెళ్లాల్సిన తరుణం ఇదేనని, అన్ని స్థాయిల్లోను ప్రభుత్వ యంత్రాంగాన్ని యాక్టివేట్ చేయాలన్నారు. సరిహద్దు, తీరప్రాంత వచ్చే ఖరీ ఫ్ సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా ఇప్పటినుంచే ఎరువుల నిల్వలు, పంపిణీ వ్యవస్థలను పర్యవేక్షించాలని సూచించారు. రాష్ట్రాలు సవాళ్లకు అనుగుణంగా మరింత అప్రమత్తంగా ఉండాలని, ఇక షిప్పింగ్ ఫరంగాను, అత్యవసరాల సరఫరా, మారిటైమ్ కార్యకలాపాల్లో మరింత చురుకుగా వ్యవహరించాలని కోరారు. ప్రజల్లో అపోహలను తొలగించాలని, కొంతమేర అవాస్తవాలు ప్రచారం ఎక్కువయిందని, సహేతుకమైన సమాచారం అందించి ప్రజల్లో నెలకొన్న అపోహలు, ఆందోళనను తగ్గించాలని ప్రధాని సూచించారు. సమావేశంలో కొందరు సిఎంలు తమ రాష్ట్రాల్లోని పరిస్థితిని వివరించారు. మొత్తంగా పరిస్థితులు అన్నీ అదుపులోనే ఉన్నాయని, పెట్రోలు, డీజిల్, ఎల్పీజీ తగినంత నిల్వలు కొనసాగిస్తున్నామన్నారు. ఎక్కడికక్కడ తనిఖీలు జరుగుతున్నాయని, బ్లాక్‌మార్కెటీర్లు, ధరలు పెంచేందుకు నిల్వలను దాచిపెట్టడం వంటి వాటిని సమూలంగా అరికట్టామని కొందరు ముఖ్యమంత్రులు తెలిపారు. అలాగే పెట్రోలు, డీజిల్‌పై కస్టమ్స్ సుం కాన్ని తగ్గిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయం పట్ల ప్రధానిని అభినందించారు. పశ్చిమాసియా సంక్షోభం అధిగమించడంలోప్రధానిమోడీ నాయకత్వంలో సమిష్టి కృషితో ముందుకు పోదామని సూచించారు. రాష్ట్రాలు మధ్యప్రాచ్యంలో ఉన్న భారతీయులకోసం హెల్ప్‌లైన్‌లు ప్రారంభించాలని, నోడల్ అధికారులను ఏర్పాటుచేసి జిల్లా స్థాయిల్లో సహాయ వ్యవస్థలు మరిన్ని పెంచాలని కోరారు. సమయానుకూలంగా బాధిత కుటుంబాలకు సరయిన వాస్తవ సమాచారం అందించేలా చూడాలని సిఎంలను ప్రధాని కోరారు.

# నేడు 'ప్రత్యేక' అసెంబ్లీ

>> ప్రవేశపెట్టనున్నారు. అక్కడ ఆమోదం తర్వాత ఆంధ్రప్రదేశ్ నూతన రాజధానిగా అమరావతిని ప్రకటిస్తూ రాజపత్రం విడుదల చేస్తారు. విభజన తర్వాత ఏపీ రాజధానిగా అమరావతిని టిడిపి ఎంపిక చేసింది. 29 గ్రామాల రైతులు ముందుకొచ్చి 34 వేల ఎకరాలు స్వచ్ఛందంగా ఇచ్చారు. సింగపూర్ ప్రభుత్వ సహకారంతో మాస్టర్‌ప్లాన్ రూపొందించారు. 2019లో వైఎస్సార్సీపీ అధికారంలోకి రావడంతో అమరావతి పనులు నిలిచిపోయాయి. నాటి సీఎం జగన్ మూడు రాజధానుల ప్రతిపాదన తెచ్చారు. అమరావతిపై వైఎస్సార్సీపీ నేతలు తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. రైతులను ఇబ్బంది పెట్టారు. అసలు అమరావతి అభివృద్ధి దిశగా ఎలాంటి చర్యలు అప్పటి ప్రభుత్వం తీసుకోలేదు. దీంతో అమరావతి రైతులు ఉద్యమించారు. భిన్న రూపాల్లో పోరాటం చేసి అంతిమంగా గెలుపు సాధించారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అమరావతికి కొత్త ఊపిరిపోసినట్లయింది. రూ. వేల కోట్లతో పనులు ప్రారంభించారు. ఏపీ రాజధానిగా అమరావతిని నోటిఫై చేస్తూ పార్లమెంటు ద్వారా విభజన చట్టంలో సవరణ చేయాలని కేంద్రాన్ని కోరారు. ఆ దిశగా ప్రస్తుతం అడుగులు పడుతున్నాయి. పార్ట్2 కింద 5(1) నిర్ణయించిన తేదీ నుంచి పదేళ్లకు మించకుండా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ ఉంటుంది. పార్ట్2 కింద 5(2) కింద సబ్ సెక్షన్ 5(1)లో పేర్కొన్న గడువు ముగిసిన తర్వాత తెలంగాణ రాజధానిగా హైదరాబాద్ కొనసాగుతుంది. ఆంధ్రప్రదేశ్‌కు నూతన రాజధాని ఏర్పాటవుతుంది.అయితే అనుకున్న కాల పరిమితి దాటినందున ఏపీ రాజధానికి కేంద్రం చట్టబద్ధతను కల్పించాల్సి ఉంది.



శుక్రవారం అయోధ్య బాల రాముడి నుదుట సూర్యకిరణాలు తాకిన సందర్భాన్ని టీవీలో చూసి అభివాదం చేస్తున్న ప్రధాని మోడీ

# భారీ జిఎస్టీ స్కామ్

>> రుణాలకు సంబంధించిన సమాచారం ఆధారంగా ఈ కేసు వెలుగులోకి వచ్చింది. డేటా విశ్లేషణ, రిస్క్ ప్రొఫైలింగ్, క్షేత్రస్థాయి పరిశీలనను ఉపయోగించారు. వాస్తవానికి వ్యాపార కార్యకలాపాలు లేకపోయినా తతభారీ స్థాయిలో ఇన్‌వాయిస్‌లను జారీ చేస్తూ, ఏటీసీ క్లెయిమ్‌లు చేస్తున్న అనేక సంస్థలను గుర్తించారు. నకిలీ ఐటీసీని సృష్టించి, పంపిణీ చేయడం కోసమే షెల్ సంస్థలను ఏర్పాటు చేసిన ఒక సిండికేట్‌ను అధికారులు గుర్తించారు. అమా యక వ్యక్తుల ఆధార్, పాన్ వివరాలను యజమానులుగా చూపి 72 షెల్ కంపెనీల ద్వారా ఈ దందా చేశారు. ఈ నకిలీ కంపెనీలు ఎలాంటి వస్తువులూ సరఫరా చేయకుండానే కాగితాలపై రూ.1,472 కోట్ల విలువైన లావాదేవీలు సృష్టించారు. సామాన్యుల ఆధార్, పాన్ కార్డులను ఉపయోగించి తప్పుడు పత్రాలతో ఫోర్జరీ రిజిస్ట్రేషన్లు చేసి నకిలీ సంస్థలను నడిపారు. ఈ కేసులో సిద్ధగోని ప్రభాకర్ టెక్నికల్ పనులు చూస్తుండగా, నాగరాజు నాయక్ తప్పుడు పత్రాలను తయారుచేసేవాడని అధికారులు తెలిపారు. ఈ భారీ జీఎస్టీ కుంభకోణానికి మెయిన్ వ్యక్తి ఆదిరెడ్డి డీజీజీఐ అధికారులు ముమ్మరంగా గాలిస్తున్నారు. నిందితులపై సీజీఎస్టీ చట్టం 2017 ప్రకారం నాన్‌బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు నమోదు అయ్యాయి. అత్యాధునిక డేటా అనలిటిక్స్ సాయంతో ఏటీసీ స్కామ్‌ను అధికారులు బయటపెట్టారు.

## లిక్కర్ స్కాం కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కేసిరెడ్డి

# ఆస్తుల జప్తుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

**విజయవాడ, మార్చి27 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలో సంచలనం సృష్టించిన లిక్కర్ స్కాం కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కేసిరెడ్డి చుట్టూ ఉచ్చు మరింత బిగుస్తోంది. మద్యం స్కామ్ ద్వారా వచ్చిన ముడుపులతో రాజ్ కేసిరెడ్డి తన తల్లిదండ్రుల పేరిట తెలంగాణలోని జనగామ, షాబాద్ ప్రాంతాల్లో భారీగా భూములు కొనుగోలు చేసినట్లు సిట్ గుర్తించింది. ముఖ్యంగా షాబాద్‌లో తన తల్లి కేసిరెడ్డి సుభాషిణి పేరుతో కొన్న 17.60 ఎకరాల భూమి అసలు మార్కెట్ విలువ దాదాపు రూ. 70 కోట్లు కాగా, రిజిస్ట్రేషన్ సమయంలో కేవలం రూ. 2.69 కోట్లుగా చూపించారు. జనగామలో తండ్రి ఉపేంద్ర రెడ్డి పేరుతో లక్షల విలువైన ప్లాట్లు ఉన్నట్టు గుర్తించారు. ఈ బినామీ ఆస్తులన్నింటినీ జప్తు చేసేందుకు విజయవాడలోని ఏసీబీ కోర్టులో పిటిషన్ దాఖలు చేసేందుకు సిట్ సిద్ధమైంది. ఇప్పటికే ఈ కేసులో రాజ్ కేసిరెడ్డికి సంబంధించి వందల కోట్ల విలువైన ఆస్తులను ఈడీ, సిట్ అటాచ్ చేసింది.ఇప్పుడు కొత్తగా గుర్తించిన రూ. 70 కోట్లకు పైగా విలువైన ఆస్తులను జప్తు చేసేందుకు విజయవాడలోని ఏసీబీ కోర్టులో పిటిషన్ వేయాలని సిట్ నిర్ణయించింది. దీనికోసం అనుమతిని కోరగా... ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.



# దాడిని ఖండించిన

## డి.సిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ, మార్చి27 ప్రభాతవార్త ప్రతినిధి:** హిందువులు అత్యంత పవిత్రంగా జరుపుకొనే శ్రీరామ నవమి రోజున, ఆకివీడులో రామాలయానికి పూజలో పాల్గొనేందుకు వెళ్లిన రఘురామకృష్ణరాజుపై, ఆయన అనుచరులపై, జనసేన నాయకులపై కొంతమంది వ్యక్తులు ఆయుధాలతో దాడి చేయడాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్ తీవ్రంగా ఖండించారు. పండుగ రోజు, ఆలయం దగ్గర ఈ దాడి జరగడం వెనుక కుట్ర కోణం ఉన్నట్లుగా అనిపిస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ దాడి వెనుక ఎవరున్నారో విచారణ జరిపి చట్ట పరంగా కఠినంగా శిక్షించాలని పోలీస్ శాఖకు సూచించారు. ఈ దాడిలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# రఘురామ కృష్ణరాజుపై దాడికి యత్నం

>> రక్షణ కవచంలా నిలిచారు. ఆందోళనకారులు విచక్షణారహితంగా దాడి చేయడంతో, రక్షణగా నిలిచిన పలువురు కూటమి నాయకులకు గాయాలయ్యాయి. మేకులు తగలడం, రాళ్ల దెబ్బల కారణంగా కొందరు కార్యకర్తలు తీవ్రంగా గాయపడ్డారు. పరిస్థితి విషమిస్తోందని గమనించిన ఎమ్మెల్యే భద్రతా సిబ్బంది, స్థానిక పోలీసులు తక్షణమే రఘురామరాజును అక్కడి నుండి తరలించారు. ఈ ఘటన తర్వాత ఆకివీడు పట్టణం యుద్ధభూమిని తలపించింది. ఇరు వర్గాల మధ్య ఘర్షణ మరింత పెరగకుండా ఉండేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం అదనపు బలగాలను రంగంలోకి దించింది. దాడికి పాల్పడిన వారిని గుర్తించేందుకు పోలీసులు సీసీటీవీ ఫుటేజీలను, స్థానికులు తీసిన వీడియోలను పరిశీలిస్తున్నారు. పట్టణంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆంక్షలను అమలు చేస్తున్నారు. ప్రజలు గుంపులుగా చేరకుండా హెచ్చరికలు జారీ చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే, ఎంతటి వారైనా సరే ఉపేక్షించేది లేదని, కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. డిప్యూటీ స్పీకర్ హోదాలో ఉన్న వ్యక్తిపై, అది కూడా పవిత్రమైన పండుగ రోజున దాడి జరగడాన్ని కూటమి ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. ఇది ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా నేతలు అభివర్ణిస్తున్నారు. ఆలయ భూవివాదాన్ని అడ్డం పెట్టుకుని రాజకీయ ప్రత్యర్థులు కావాలనే ఈ కుట్రకు పాల్పడ్డారని కూటమి నాయకులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతానికి ఆకివీడులో పరిస్థితి అదుపులోనే ఉన్నప్పటికీ, నివురుగప్పిన నిప్పులా ఉంది. గాయపడిన నేతలకు స్థానిక ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. పోలీసుల విచారణ వేగవంతమైంది.

# తుంగభద్రలో నలుగురు మృతి

>> తెలియని వారు అందులో దిగాలని ప్రయత్నం చేసి నలుగురు అందులో దిగారు వెంటనే లోపలికి వెళ్లి ఊపిరి ఆడక మృతి చెందారు. కాగా ఇటీవల నాలుగు రోజుల క్రితం హోస్పెట డ్యాం నుండి తుంగభద్ర నదికి నీరు వదలడంతో నీరు ఆర్డీయస్ కట్ట కింద భాగంలో ఉధృతంగా ప్రవహిస్తోంది..కానీ ఈ విషయం తెలియక ఆ నలుగురు అందులో పడిపోయారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు వెంటనే అక్కడకి చేరుకుని పుట్టి (చిన్నబోటు) ద్వారా గాలింపు చర్యలు చేపట్టి ఎట్టకేలకు నాలుగు శవాలను బయటికి తీసారు. దీంతో సమాచారం అందుకున్న ఎస్ఐ రమేష్‌రెడ్డి తన సిబ్బందితో సంఘటన స్థలం చేరుకుని పరిస్థితిని సమీక్షించి వివరాలను సేకరించి మృతి చెందిన వారిని పోస్టుమార్టం నిమిత్తం ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పెళ్లికి వచ్చి ఇలా విగతజీవులుగా మారడంతో వారి గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. పెళ్లింట సంతోష బాజాలు మోగాల్సిన చోట చావు బాజాలు మోగడంతో అంతా విషాదంలో మునిగిపోయారు.

# ఒంటిమిట్టలో వైభవంగా ధ్వజారోహణం

>> నిర్వహించారు. ఉదయం ఏడు గంటల నుండి భక్తులకు సర్వదర్శనం ఏర్పాటు చేశారు. అనంతరం ఉదయం 9.30 నుండి 10.15 గంటల మధ్య వృషభ లగ్నంలో పాంచరాత్ర ఆగమశాస్త్రబద్ధంగా గరుడపటాన్ని ప్రతిష్ఠించి శాస్త్రోక్తంగా ధ్వజారోహణ ఘట్టం నిర్వహించారు. కంకణబట్టర్ రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముందుగా గరుడ ధ్వజపటాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి గరుడ ప్రతిష్ట, ప్రాణప్రతిష్ట, నేత్రోన్మీలనం నిర్వహించారు. ధ్వజస్తంభానికి నవకలశ పంచామృతాభిషేకం చేశారు. రాగతాళ నివేదన ద్వారా ఇంద్రాది సకలదేవతలను, నవగ్రహాలను, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించి ధ్వజారోహణం నిర్వహించారు.ఈ సందర్భంగా వేదపండితులు చతుర్వేద పారాయణం చేశారు. ధ్వజారోహణం సందర్భంగా ధ్వజస్తంభం చుట్టూ వివిధ రకాల పుష్పాలతో చూడ ముచ్చటగా అలంకరించారు. తెల్లవారుజామున తెలుగుదేశం పార్టీ రాజంపేట అసెంబ్లీ ఇన్చార్జి చమర్తి జగన్ మోహన్ రాజు దంపతులు శ్రీరామచంద్రమూర్తికి శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం పురస్కరించుకుని పట్టువస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రాజుకు వేద ఆశీర్వచనం చేశారు. రాత్రి శ్రీరామచంద్రమూర్తి శేష వాహనంపై పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు.



శ్రీరామచంద్రమూర్తికి పట్టువస్త్రాలు సమర్పించేందుకు వెళుతున్న జగన్మోహన్ రాజు

# ఎండలు మండుతున్నాయ్..

>> అంచనా వేస్తోంది. ఇక వేసవి నుంచి ఉపశమనం కోసం బాటసారులు, వాహనదారులు, ఇతరులు చలి వేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. కొందరు కొబ్బరి బోండాలు, శీతల పానీయాల బళ్ల వద్దకు చేరుతున్నారు. భూతాపంతో ఎండలు ఎక్కువగా ఉండే విజయవాడ వంటి ప్రాంతంలో అధిక ఉష్ణోగ్రతలు నగరవాసుల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అవేర్ ప్లాట్ ఫారం ద్వారా 4, 5 రోజుల్లో వేసవి తీవ్రత ఎలా ఉంటుందన్న సమాచారం ముందే తెలుసుకునే విధంగా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుంది. వాతావరణ కేంద్రాల ద్వారా అందే సమాచారం ఆధారంగా ఏ ప్రాంతాల్లో వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్నదో గుర్తిస్తారు. ఈ సమాచ్నార జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులకు అందుబాటులో ఉంటుంది. దీనికి అనుగుణంగా చర్యలు తీసుకుంటారు. 27 డిగ్రీల సెంటిగ్రేడ్ నుంచి 32 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు ఉష్ణోగ్రత నమోదు జరిగితే దానిని హెచ్చరిక గుర్తిస్తున్నారు. 33 డిగ్రీల సెంటిగ్రేడ్ నుంచి 41 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు ఉష్ణోగ్రత నమోదైతే దానిని అపాయం జోన్‌లో ఉన్నట్లు 42 నుంచి 54 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు ఉష్ణోగ్రత నమోదైతే దానిని ఖీమరింత అపాయంగా అవేర్ డిజిటల్ ప్లాటు ఫాంలో గుర్తిస్తారు. ప్రస్తుతానికి వడగాడ్పులు లేకపోయినా ముందు తీవ్రంగా వీచే అవకాశం ఉంది. దీనివల్ల వడదెబ్బలు తగిలే ప్రమాదం లేకపోలేదు. రాష్ట్రంలో 2023లో 833, 2024లో 4 వేల 444, 2025లో 5 వేల 154 చొప్పున వడదెబ్బ కేసులు నమోదయ్యాయి. 2025లో అత్యధికంగా ఏలూరు జిల్లాలో 1,284, కృష్ణా జిల్లాలో 1,214, విశాఖలో 1,089, కడప325, పల్నాడు జిల్లాలో 268 చొప్పున వడదెబ్బ కేసుల నమోదయ్యాయి. వేసవిని దృష్టిలో ఉంచుకుని మరోవైపు ప్రభుత్వం వేసవి కార్యా చరణను సిద్ధం చేసింది. ఇప్పటికే వైద్యారోగ్య శాఖ అప్రమత్తమైంది. ఆస్పత్రుల వారీగా ఓఆర్ ఎస్ ప్యాకెట్లు, మందులను సిద్ధంగా ఉంచింది.

# ఆరు లేన్లతో మరో జాతీయ రహదారి

>> మార్చేందుకు రెడీ అయింది. అనకాపల్లిలోని దైట్ ఇంజినీరింగ్ కాలేజీ నుంచి తూర్పుగోదావరి జిల్లా దివాన్ చెరువు వరకు హైవేను ఆరు లైన్లుగా విస్తరించనున్నారు. 160 కిలోమీటర్ల మేరు విస్తరణ చేపట్టనుండగా.. ఇందుకోసం రూ.3800 కోట్ల వ్యయం కానుంది. విస్తరణలో భాగంగా బైపాస్, అండర్ పాస్, ఫ్లైఓవర్లు నిర్మించనున్నారు.

**ఆరు లైన్ల రహదారిగా విస్తరణ**

విస్తరణ పనుల్లో భాగంగా హైవేను ఆరు లైన్ల రహదారిగా మార్చుతారు. ఇక 11 చోట్ల కొత్త ఫ్లైఓవర్లు, మూడు చోట్ల బైపాస్‌లు, ఐదు చోట్ల అండర్‌పాస్‌ల నిర్మాణం చేపడతారు. ప్రస్తుతం ఈహైవేలో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంటుంది. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు హైవే విస్తరణకు ఎన్‌హెచ్ఏఐ ముందడుగు వేసింది. అనకాపల్లి జిల్లా వడ్డిమెట్ల నుంచి చేపూరు వరకు 7.7 కిలోమీటర్ల బైపాస్ ఈ ప్రాజెక్టులో భాగంగా నిర్మించనున్నారు. ఇక ఎర్రవరం వద్ద 3 కిలోమీటర్ల మేర మరో బైపాస్‌తో పాటు జగ్గంపేట దగ్గర 10 కిలోమీటర్ల మేర మరో బైపాస్ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ హైవేను విస్తరించాలని ఎన్‌హెచ్ఏఐకు స్థానిక ఎమ్మెల్యేల నుంచి వినతులు పలుమార్లు వెళ్లాయి. దీంతో అధికారులు స్పందించి ఆరు లైన్లుగా మార్చాలని నిర్ణయం తీసుకున్నారు.

**విశాఖ, విజయవాడ వెళ్లేవారికి బెనిఫిట్**

ఈ నేషనల్ హైవే విస్తరణతో విజయవాడ, విశాఖపట్నం వెళ్లేవారికి ట్రాఫిక్ రద్దీ తగ్గనుంది. దీని వల్ల వేగవంతం, సౌకర్యవంమైన ప్రయాణం అందుబాటులోకి రానుంది. హైవే పనుల్లో భాగంగా తేటగుంట క్రాస్ రోడ్డు, అన్నవరంలో ఇరువైపులా సర్వీస్ రోడ్డు ఉండనున్నాయి. ఇకప్రతిపాడు అండస్ పాస్ విస్తరించనున్నారు. అలాగే జెడ్ రంగంపేట దగ్గర అండర్ పాస్ నిర్మించనున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో వాహనదారుల కోసం సర్వీస్ రోడ్లు కూడా ఉండనున్నాయి.

## వారం - వర్జ్యం

28-03-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, శుక్లపక్షం, ఉత్తరాభాద్ర కార్తె
దశమి ఉ.8.47
పుష్యమి మ.2.52
వర్జ్యం : రా.3.34-తె.5.09
దు.ఉ.6.05-ఉ.7.42
శుభసమయం : ఉ.8.00-ఉ.8.30
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** జీవిత భాగస్వామితో విభేదాలు రావచ్చు. తగు జాగ్రత్తలు పాటించండి. ఆర్థికంగా అనుకూలంగా వుంటుంది.

**వృషభం:** స్నేహితుల సహకారం వలన కార్యలాభం కలుగుతుంది. ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తిచేస్తారు.

**మిథునం:** మీకు అత్యంత సన్నిహితులకు సమయానికి సహాయం చేయలేని పరిస్థితి ఏర్పడుతుంది.ఆరోగ్య మెళకువలుఅవసరం.

**కర్కాటకం:** మధ్యలో ముఖ్యమైన వ్యవహారాలను వాయిదా వేయక తప్పదు. ఇతరుల విషయంలో జోక్యం తగదు.

**సింహం:** విలువైన పత్రములు, డాక్యుమెంట్స్ మొదలగు వాటి విషయములలో జాగ్రత్తలను వహించండి

**కన్య :** మాట్లాడే ధోరణిలో జాగ్రత్త వహించవలసి ఉంటుంది. సంతాన విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తారు.

**తుల :** దూర ప్రాంతాలకు సంబంధించి, విదేశీయానానికి సంబంధించి మీరు చేసే ప్రయత్నాలు సానుకూలమవుతాయి.

**వృశ్చికం:** వినూత్నమైన కార్యక్రమాలు, సరికొత్త వ్యాపారాలు చేసేవారు మీకు సన్నిహితం అవుతారు. వస్త్రలాభం కలదు.

**ధనుస్సు:** రాజకీయ నాయకులతో సంబంధాలు బలపడతాయి. ఉద్యోగంలో స్థాన మార్పునకు అవకాశం ఉంది.

**మకరం :** వర్గ సమీకరణకు పూను కుంటారు. మీ జీవిత భాగస్వామి ఆరోగ్య విషయమై శ్రద్ధ వహించవలసి వస్తుంది.

**కుంభం:** కోర్టు తీర్పులు మీకు అనుకూలంగా వస్తాయి. మధ్యవర్తి పరిష్కారాల వలన లాభపడతారు.

**మీనం:** ఆర్థికపరమైన వాయిదాలు చెల్లించడంలో కొంత జాప్యం చేస్తారు. స్పెక్యులేషన్‌కు దూరంగా వుండండి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## మంత్రి అచ్చెన్నాయుడు విజ్ఞప్తితో కేంద్రానికి సిఎం చంద్రబాబు లేఖ

**- మొక్కజొన్న రైతులకు భారీ ఊరట దిశగా కీలక ప్రయత్నం**

**సచివాలయం,మార్చి 27,ప్రభాతవార్త :** రాష్ట్రంలో మొక్కజొన్న రైతులు ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితులను గమనించిన రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి కింజారపు అచ్చెన్నాయుడు, రైతులు అభ్యున్నతే లక్ష్యంగా వేంటనే చర్యలు చేపట్టారు. 2025-26రబీ సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 4.83లక్షల హెక్టార్లలో సాగు జరిగి 37లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న ఉత్పత్తి నమోదైనప్పటికీ, మార్కెట్ ధరలు కనీస మద్దతు ధరకంటే తక్కువగా ఉండడంతో రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని మంత్రి, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికీ తీసుకెళ్ళారు. అత్యవసర అవసరాల నిమిత్తం రైతులు తక్కువ ధరలకు పంటను అమ్ముకోవాల్సి వస్తుందని వివరించిన మంత్రి, ఈ పరిస్థితుల్లో తక్షణమే కేంద్రం జోక్యం అవసరమని ముఖ్యమంత్రి కి స్పష్టం చేశారు. రైతులకు న్యాయమైన ధర కల్పించాలనే లక్ష్యంతో ధర లోపం చెల్లింపు (పిడిపిఎస్ స్కీమ్)ను మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ (ఎంఐఎస్)ద్వారా అమలు చేయాలని, ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ 100శాతాన్ని నష్టాన్ని కేంద్ర ప్రభుత్వం భరించేలా చేయాలని, అలాగే ప్రస్తుత 25శాతం పరిమితిని 100శాతం ఉత్పత్తికి విస్తరించి, జూన్ 2026వరకు పథకాన్ని కొనసాగించాలని మంత్రి అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు. సీఎం చంద్రబాబు వెంటనే స్పందించి, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు లేఖ రాసి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

## గ్రామీణ ఆరోగ్య సిబ్బంది కొరతపై లోక్ సభలో ఎంపి బైరెడ్డి శబరి



**విజయవాడ,మార్చి 27,ప్రభాతవార్తప్రతినిధి:** భారతదేశంలోని గ్రామీణ ఆరోగ్య రంగ సిబ్బంది కొరత ఆందోళన కలిగిస్తుందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి శుక్రవారం లోక్ సభలో ప్రస్తావించారు. గ్రామీణ ఆరోగ్య సమస్యపై ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి లోక్ సభలో మాట్లాడుతూ దేశంలో బీస్సీ నర్సింగ్ కాలేజీలు 2014లో సుమారు 1,641 నుండి ప్రస్తుతం 2,500కి పైగా పెరిగిన, ప్రతి సంవత్సరం దాదాపు 2 లక్షల నర్సులు తయారవుతున్నప్పటికీ, తక్కువ వేతనాలు, ప్రోత్సాహకాల లేని కారణంగా నర్సులు విదేశాలకు వెళ్లిపోవడం జరుగుతుందని, దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలు ప్రభావితమవుతున్నాయన్నారు.



# తెలుగు నాటక రంగానికి పూర్వవైభవం తెస్తాం

**-తెలుగు నాటక రంగ వికాసానికి కూటమి ప్రభుత్వ కార్యాచరణ సిద్ధం చేస్తోంది: మంత్రి కందుల దుర్గేష్**
**- నాటకం సమాజానికి అద్దం పట్టే కళ**

**విజయవాడ,మార్చి 27,ప్రభాత వార్తప్రతినిధి:** ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర సినిమాటోగ్రఫీ, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రివర్యులు కందుల దుర్గేష్ తెలుగు నాటక రంగ లోకానికి, కళాకారులకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ నాటక రంగాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. తెలుగు నాటక రంగానికి పూర్వ వైభవం తీసుకువచ్చేలా కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో కసరత్తు చేస్తోందని, త్వరలోనే ఇందుకు సంబంధించిన విధివిధానాలను ప్రకటిస్తామని మంత్రి దుర్గేష్ తెలిపారు. గత ప్రభుత్వం విస్మరించిన ప్రతిష్టాత్మక కందుకూరి వీరేశలింగం పంతులుఖి పురస్కారాలను కూటమి ప్రభుత్వం పునరుద్ధరించిందని, ఏప్రిల్ 16న తెలుగు నాటక రంగ దినోత్సవం సందర్భంగా ఒక పర్యాయం అర్హులైన కళాకారులకు, రచయితలకు, సాంకేతిక నిపుణులకు అందజేసిందని ఆయన గుర్తుచేశారు. త్వరలోనే మరో దఫా కందుకూరి పురస్కారాలు అంది స్తామని స్పష్టం చేశారు. నంది అవార్డులు, నంది నాటకోత్సవాలను నిర్వహిస్తామన్నారు. ఆ దిశగా కసరత్తు వె ు ద ల ై ం ద న్నా ర ం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, స్వయంగా కళాకారుడైన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల నాయకత్వంలో కళలకు, కళాకారులకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. నాటకం అనేది కేవలం వినోదం మాత్రమే కాదని, అది సామాజిక మార్పుకు ఒక శక్తివంతమైన ఉత్ప్రేర కమని అభివర్ణించారు. భూత, భవిష్యత్, వర్తమానాలకు వారధిగా నిలిచే ఏకైక కళారూపం నాటకమని కొనియాడారు. రంగస్థల నటుడిగా ఇటీవల తాను ప్రదర్శించిన బాలచంద్రుడి, వీరపాండ్య కట్టబొమ్మన ఏకాపాత్రాభినయ పాత్రలను మంత్రి కందుల దుర్గేష్ ఈ సందర్భంగా గుర్తుచేసుకుంటూ, నవరసాలను పండించే నాటక కళ పట్ల తనకున్న మక్కువను చాటుకున్నారు. ప్రతిభ గల కళాకారులకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ తోడ్పాటునందిస్తుందని మంత్రి కందుల దుర్గేష్ పునరుద్ఘాటించారు. సాంప్రదాయ నాటక కళకు ఆధునిక సాంకేతికతను జోడించడం ద్వారా నేటి తరానికి నచ్చేలా నాటకాలను తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో ఉన్న కళాక్షేత్రాలను, ఆడిటోరియంలను అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునీకరించాలని భావిస్తున్నామని, తద్వారా కళాకారులకు మెరుగైన వేదికలు, ప్రేక్షకులకు ఆహ్లాదకరమైన వాతావరణం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నాటక పరిషత్తులను ప్రోత్సహించడం ద్వారా మరుగున పడిపోతున్న పౌరాణిక, చారిత్రక, జానపద నాటకాలను, కళారూపాలను పునరుద్ధరించేలా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. నాటకం అనేది సమాజానికి అద్దం పట్టే కళ అని పేర్కొంటూ వరల్డ్ థియేటర్ డే సందర్భంగా ఈ కళాకారుల ప్రతిభను గుర్తించి, వారిని ఆర్థికంగా నిలబెట్టడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం

# పిఎం సూర్యఘర్ కనెక్షన్లను వేగవంతం చేయాలి

**- ఇంధన ఉన్నతాధికారులతో మంత్రి గొట్టిపాటి రవికుమార్**



**విజయవాడ,మార్చి 27, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో విద్యుత్ శాఖ పరిధిలో అమలు అవుతున్న పనులను వేగవంతం చేయాలని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం అమరావతిలోని తన క్యాంప్ కార్యాలయం నుంచి డిస్కంల సీఎండీలు, ఉన్నతాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి పీఎం సూర్యఘర్, ఆర్డీఎస్ఎస్, పీఎం కుసుమ్ పథకాల పురోగతిని సమీక్షి ంచారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఉచితంగా అందిస్తున్న పీఎం సూర్యఘర్ సోలార్ కనెక్షన్లపై ప్రత్యేక దృష్టి సారించిన మంత్రి, బాబు జగజ్జీవన్ రామ్ జయంతి నుంచి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి వరకు ప్రతి నియోజకవర్గంలో కనీసం 2 వేల కనెక్షన్లు పూర్తిచేయాలని స్పష్టం చేశారు. నిర్దేశిత గడువులో లక్ష్య సాధనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వం, పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లన్నింటినీ వచ్చే సీజన్‌కు ముందే మంజూరు చేయాలని సూచించింది. రైతులకు ఎలాంటి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరాను బలోపేతం చేయాలని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు ప్రజలపై అదనపు భారం లేకుండా విద్యుత్ ఛార్జీలను ప్రభుత్వం భరిస్తుందని మంత్రి తెలిపారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది సమన్వయంతో పనిచేసి పథకాల అమలులో వేగం పెంచాలని, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు.

## బైక్ యాత్రికురాలు తాప్సీ ఉపాధ్యాయకు ఉపముఖ్యమంత్రి పవన్ అభినందన



**విజయవాడ,మార్చి27,ప్రభాతవార్తప్రతినిధి:** దేశవ్యాప్తంగా ప్రజారోగ్యంపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఒంటరిగా బైక్‌పై యాత్ర చేస్తున్న ఉత్తరప్రదేశ్‌కు చెందిన యువతి తాప్సీ ఉపాధ్యాయను ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అభినందించారు. "ఒబేసిటీ ముక్త్ భారత్ మిషన్ హెల్తీ భారత్" యాత్రలో భాగంగా ఆమె మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో పవన్ కల్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ విషయాన్ని డి సీఎం పవన్ కల్యాణ్ స్వయంగా తన "ఎక్స్" ఖాతాలో వెల్లడించారు. ఈ సందర్భంగా తన యాత్ర వివరాలను తాప్సీ పవన్‌కు వివరించారు. ఆరోగ్యంపై ప్రజల్లో చైతన్యం నింపేందుకు మార్చి 9న మీరట్‌లో ఈ సోలో బైక్ యాత్ర ప్రారంభించినట్లు తెలిపారు. బుల్లెట్‌పై ఒంటరిగా ప్రయాణిస్తూ ఇప్పటివరకు సుమారు 17,400 కిలోమీటర్లు పూర్తి చేశానని, 16 రాష్ట్రాల్లోని 500కు పైగా విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహించానని చెప్పారు. మిగిలిన 12 రాష్ట్రాల్లో కూడా తన యాత్రను కొనసాగిస్తానని ఆమె పేర్కొన్నారు. ఆమె అన్ని విధాలుగా అండగా ఉంటామని పవన్ స్పష్టం చేసారు.

## ఎపి ప్రకృతి వ్యవసాయ అధ్యయనానికి నేపాల్ బృందం

**గుంటూరు మార్చి 27 ప్రభాత వార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ రైతు సాధికార సంస్థ, వ్యవసాయ శాఖ ద్వారా నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయ పద్ధతులు నేడు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్నాయి. ఈ క్రమంలో రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రకృతి వ్యవసాయ విధానాలను లోతుగా అధ్యయనం చేసేందుకు నేపాల్ దేశానికి చెందిన ప్రభుత్వ ఉన్నతాధికారులు, అంతర్జాతీయ నిపుణుల బృందం రాష్ట్రానికి చేరుకుంది. శుక్రవారం గుంటూరులోని రైతు సాధికార సంస్థ రాష్ట్ర కార్యాలయంలో ఆ సంస్థ సి ఇ ఓ రామారావు ఈ ప్రతినిధి బృందంతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ టి. విజయ్ కుమార్ వర్చువల్ గా హాజరై ప్రకృతి వ్యవసాయంలో అనుసరిస్తున్న మెళకువలు, రైతులకు అందుతున్న ప్రోత్సాహం, పరస్పర సహకారం, భవిష్యత్తులో ఈ రంగంలో చేపట్టాల్సిన కార్యాచరణ వంటి కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం నేపాల్ బృందం కొల్లిపర మండలంలోని అత్తోట గ్రామంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. క్షేత్రస్థాయిలో సాగు పద్ధతులను ప్రత్యక్షంగా పరిశీలించింది. రైతు సాధికార సంస్థకు చెందిన కృష్ణారావు , ఎన్ఆర్ఓ యూనిట్ ఆధ్వర్యంలో ఈ ఎక్స్‌పోజర్ విజిట్ కొనసాగింది. ఈ క్షేత్ర పర్యటన అధ్యయన బృందంలో నేపాల్ ప్రభుత్వ వ్యవసాయ , పశుసంవర్ధక అభివృద్ధి మంత్రిత్వ శాఖ నుండి జాయింట్ సెక్రటరీలు గోకుల్ బోహరా, రాజేంద్ర కోయిరాలా, డాక్టర్ శాంత కార్కి పాల్గొన్నారు. అలాగే భూ నిర్వహణ, వ్యవసాయ మంత్రిత్వ శాఖ తరపున కర్నాలి ప్రావిన్స్ కార్యదర్శి సజీవ్ కుమార్ కర్ణ, సుదుర్పశ్చిమ్ ప్రావిన్స్ కార్యదర్శి శంకర్ షా ప్రతినిధులుగా ఉన్నారు. వీరితో పాటు అంతర్జాతీయ వ్యవసాయ అభివృద్ధి నిధి నిపుణులు క్యాలిమా ఖనాల్, సంజీవ్ శ్రేష్ఠ , క్లైమేట్ రెసిలెంట్ అగ్రికల్చర్ అనలిస్ట్ రాజేంద్ర ధకల్ ఏపీలోని సాగు పద్ధతులను అధ్యయనం చేస్తున్నారు.

## అర్హతలకు తగిన కారుణ్య నియామకం చేయాలి - హైకోర్టు ఆదేశం

**విజయవాడ,మార్చి 27,ప్రభాతవార్తప్రతినిధి:** కారుణ్య నియామకం కోరే వారికి నిర్ణయించిన అర్హతలు ఉంటే ఉద్యోగం ఇవ్వాల్సిందేనని హైకోర్టు తీర్పు చెప్పింది. ప్రమోషన్లకు చెందిన ఉత్తర్వులకు ఆధారంగా తగిన పోస్టు ఇవ్వకపోవడం అన్యాయమని పేర్కొంది. 1991లో ప్రభుత్వం జారీ చేసిన జీవో 162లోని గైడ్లెన్స్ మేరకు విద్యార్హతలు ఉన్న వ్యక్తికి కారుణ్య నియామకం కింద తగిన పోస్టు ఇవ్వాలని స్పష్టం చేసింది. విద్యార్హతలు ఉన్నప్పటికీ తనను జూనియర్ అసిస్టెంట్గా నియమించడం వల్ల నష్టపోయినట్లు కడప జిల్లా నందలూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో చేసే అటెండర్ పి.శ్రీకాంత్రెడ్డి చేసుకున్న దరఖాస్తును కడప జిల్లా జడ్జి తిరస్కరించడాన్ని తప్పుపట్టింది. జిల్లా జడ్జి జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేసింది. పిటిషనర్ సర్వీసును క్రమబద్ధీకరించాలని ఆదేశించింది. పదోన్నతులు, టైం స్కేల్ కల్పించాలని జిల్లా జడ్జిని ఆదేశించింది.

# ఎన్టీఆర్ ట్రస్ట్ సేవలు మరింత విస్తృతం

**- మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలనే తపన .. పారదర్శకంగా ట్రస్ట్ నిర్వహణ !! -విజయవాడలో తలసేమియా సెంటర్.. అనంతపురంలో బ్లడ్‌బ్యాంక్ ఏర్పాటు ! - సిఎం సతీమణి నారా భువనేశ్వరి**



కుప్పంలో మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న నారా భువనేశ్వరి

**కుప్పం, మార్చి 27 ప్రభాతవార్త** ఎన్టీఆర్ స్మారక ట్రస్ట్ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలు మరింత విస్తృతం చేస్తామని సిఎం చంద్రబాబుసతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. నాలుగు రోజుల కుప్పం పర్యటనలో భాగంగా శనివారం కుప్పం టిటిడి కళ్యాణ మండపంలో ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున నలభైమంది మహిళలకు కుట్టుమిషన్లు, ముప్పైమందికి తోపుడు బళ్లు, పలువురికి వినికిడియంత్రాలు, ఓ వ్యక్తికి కృత్రిమ చేయిని నారా భువనేశ్వరి పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్టీఆర్ స్ఫూర్తి తో సిఎం చంద్రబాబు సహకారంతో ట్రస్ట్ సేవలు కొనసాగుతున్నాయన్నారు. ట్రస్ట్ తరపున చేపడుతున్న కార్యక్రమాలతో సంతృప్తి చెందక మరిన్ని సేవా కార్యక్రమాలు చేయాలనేది తన తపన అని పేర్కొన్నారు. సిఎం చంద్రబాబు ట్రస్ట్ బాధ్యతలు తనకు అప్పగించారని 29 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. ఎన్టీఆర్ ట్రస్ట్‌ను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. ఖర్చు చేసే ప్రతి రూపాయికి ఆడిట్ జరుగుతుందని స్పష్టం చేశారు. ట్రస్ట్ ద్వారా ప్రజలకు అవసరమైన సేవలు : ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ప్రజలకు అవసరమైన సేవలు అందించడం జరుగుతుందని నారా భువనేశ్వరి పేర్కొన్నారు. త్వరలోనే విజయవాడలో తలసేమియా సెంటర్, అనంతపురంలో బ్లడ్‌బ్యాంక్, తలసేమియా కేంద్రాన్ని ప్రారంభిస్తామని ప్రకటించారు. అలాగే తలసేమియా బాధిత పిల్లల కోసం మే 10న హైదరాబాద్‌లో తలసేమియా రన్ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొని తలసేమియా బాధితులకు మేమున్నాం అనే ధైర్యం ఇవ్వాలని కోరారు. పజాసేవే పరమావధిగా ట్రస్ట్ సేవలు : ప్రజాసేవే పరమావధిగా ఎన్టీఆర్ ట్రస్ట్ సేవలు నిర్వహిస్తోందని నారా భువనేశ్వరి పేర్కొన్నారు. 237మంది తలసేమియా పిల్లలకు రక్తమార్పిడి చేయడం జరుగుతోందన్నారు. అలాగే ఇప్పటి వరకు 23లక్షల మందికి ట్రస్ట్ తరపున వైద్య సేవలు అందించి 23 కోట్ల విలువ చేసే మందులు, మాత్రలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఎనీ టీఆర్ సంజీవని ఆస్పత్రి, ఎన్టీఆర్ ఆరోగ్య రథాల ద్వారా ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించడం జరుగుతోందన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో సైతం ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఎన్టీఆర్ స్కూల్, డిగ్రీ కాలేజ్, చల్లపల్లి స్కూల్‌లో దాదాపు 2వేలమంది తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలను చదివిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సహకరిస్తున్న బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

# స్వర్ణ గ్రామ, వార్డుల పనితీరుపై ప్రజాభిప్రాయ సేకరణ

**విజయవాడ,మార్చి27,ప్రభాతవార్తప్రతినిధి:** స్వర్ణ గ్రామ, వార్డుల పనితీరును పరిశీలించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఆ శాఖ డైరెక్టర్ ఎం. శివప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. స్వర్ణ గ్రామం, వార్డు కార్యాలయాల సేవల నాణ్యతను మెరుగుపర్చేందుకు ఆర్గనైజేషన్ ఫెర్ఫార్మెన్స్ ట్రాకింగ్ సిస్టమ్ (ఒపిటిఎస్) అమల్లోకి తీసుకువస్తున్నట్లు ఈ ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ విధానంపై అమలుపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేకంగా దృష్టి సారించాలని కోరారు. ఈ కొత్త విధానంలో భాగంగా, ప్రతి స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాల్లో క్యూఆర్ కోడ్ ఆధారిత పబ్లిక్ ఫీడ్బ్యాక్ సిస్టమ్ ఏర్పాటు చేయనున్నారు. ప్రజలు కార్యాలయానికి వచ్చినప్పుడు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి, అందుతున్న సేవలపై తమ అభిప్రాయాన్ని సులభంగా తెలియజేసేందుకు అవకాశం ఈ విధానంతో లభిస్తుంది. ఇందుకు స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ఒపిటిఎస్ పోర్టల్‌లో తప్పనిసరిగా లాగిన్ అయ్యి, క్యూఆర్ కోడ్ పోస్టర్ను పిడిఎఫ్ ఫార్మేట్లో డౌన్లోడ్ చేసి కలర్ ప్రింట్ తీసుకోవాల్సి ఉంటుంది. ఆ కలర్ ప్రింట్ను కార్యాలయంలో ప్రజలకు స్వర్ణ గ్రామం కనిపించే ప్రదేశాల్లో ప్రవేశ మార్గంలో, వేచి ఉండే ప్రదేశంలో, సర్వీసు కౌంటర్ వద్ద, నోటీసు బోర్డు వంటి ప్రదేశాల్లో పోస్టర్లు ప్రదర్శించాలి. పెద్ద కార్యాలయాల్లో ఒకటి కంటే ఎక్కువ పోస్టర్లు ఏర్పాటు చేయాలని, ప్రజలను ఫీడ్బ్యాక్ ఇవ్వడానికి ప్రోత్సహించాలని ఆదేశించారు. లాగిన్ వివరాలు గోప్యంగా ఉంచాలని సూచించారు. ఫీడ్ బ్యాక్ ఇవ్వాలనుకున్న పౌరులు కార్యాలయంలోని క్యూఆర్ కోడ్ను తమ స్మార్ట్ ఫోన్తో స్కాన్ చేస్తే వెబ్ పేజ్ ఓపెన్ అవుతుంది. దీనిలో కార్యాలయ సిబ్బంది పనితీరు ఎలా ఉంది?, మీరు కార్యాలయానికి వచ్చిన పని సంతృప్తి కరంగా జరిగిందా?, కార్యాలయ సిబ్బంది అందుబాటులో ఉన్నారా? అనే 3 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఉంటాయి. కింద ఇచ్చిన సమాధానాలను పౌరులు ఎంపిక చేసుకున్న అనంతరం పేరు, మొబైల్ నెంబరు వివరాలు నమోదు చేసి సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. రాష్ట్రస్థాయిలో ఫీడ్ బ్యాక్ను సమీక్షి ంచి తీసుకోవాల్సిన చర్యలను 3 ఉన్నతాధికారులు చేపడతారు. సరైన విధానాలు పాటించని కార్యాలయాలపై కఠిన చర్యలు తీసుకోనున్నారు. ఇందుకు సంబంధించిన అంశాలను జిల్లా కలెక్టర్లు స్వయంగా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఈ చర్యతో ప్రభుత్వ సేవలలో పారదర్శకత పెరిగి, ప్రజలకు మరింత

# తిరుమల సమాచారం

## వేదోక్తంగా శ్రీరామనవమి ఆస్థానం



**తిరుమల,మార్చి 27ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి శ్రీరామనవమి ఆస్థానం వేదోక్తంగా నిర్వహించారు. త్రేతాయుగంలో శ్రీరామచంద్రమూర్తి కలియుగంలో శ్రీవేంకటేశ్వరస్వామిగా ఆవిర్భవించి విశేష పూజలందుకుంటున్నారు . ఇదే సంప్రదాయంతో తిరుమలలో శ్రీరామనవమి ఆస్థానం వేడుకగా జరిపించారు. ఆలయంలోపల బంగారువాకిలిలో రాత్రి 9 గంటల నుండి 10 గంటల వరకు ఆస్థానం నిర్వహించారు. ఆస్థానం సందర్భంగా వేదపండితులు శ్రీమద్రామాయణంలోని శ్రీరామ జనన ఘట్టాన్ని స్వామివారి సన్నిధిలో పఠించారు. శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా శుక్రవారం ఉదయం ఆలయంలోని రంగనాయకుల మండపంలో సీతా లక్ష్మణ ఆంజనేయ సమేత రామచంద్రస్వామి ఉత్సవ మూర్తులకు విశేష స్నపనం నిర్వహించారు.

రంగనాయకుల మండపంలోని ప్రత్యేక వేదికపై ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి కన్నుల పండుగగా స్నపన తిరుమంజనం జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్ద జీయర్ స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## కోదండరామునిగా కోనేటిరాయుడు హనుమంతవాహనంపై మలయప్ప



**తిరుమల,మార్చి 27 ప్రభాతవార్తప్రతినిధి:** ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడిగా, త్రేతాయుగంలో శ్రీరామచంద్రుడు, కలియుగంలో శ్రీవేంకటేశ్వరస్వామిగా భక్తులను రక్షిస్తున్న స్వామివారు శ్రీరామనవమి పండుగవేళ శుక్రవారం రాత్రి హనుమంతవాహనంపై అభయమిచ్చాడు. కోదండరాముడు అలంకారంలో కనువిందు చేయడం విశేషం. శ్రీరాముడికి హనుమంతుడు అత్యంత విశ్వాసపాత్రుడు. ప్రియదాసభక్తుడైన ఆంజనేయుడిపై వేంకటాద్రిరాముడుగా మలయప్ప ఊరేగి భక్తులకు దర్శనమిచ్చాడు. వాహనమండపం వద్ద వేదమంత్రోచ్చరణల నడుమ స్వామివారిని హనుమంతవాహనంపై అధిరోహింపజేశారు. కర్పూరహారతులిచ్చి రాత్రి 7గంటలకు వాహనం ఆలయ మాఢవీధుల్లో ప్రదక్షణగా బయలుదేరింది. స్వామివారి వాహనంముందు భక్తులు ఆదపమొక్కులవాడా....గోవిందా...శ్రీనివాసా గోవిందా జై శ్రీరామ్ అంటూ నామస్మరణలతో తన్మయత్వం పొందారు. ఈ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం , ఆలయ పేష్కార్ రామకృష్ణ, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

## తెలుగు ప్రజలకు శ్రీరామనవమి శుభాలు కలగాలి - శ్రీవారి సేవలో ప్రముఖులు



**తిరుమల,మార్చి 27ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో శ్రీరామనవమి పర్వదినాన తెలుగుప్రజలందరికీ శుభాలు కలగాలని ప్రముఖులు తెలిపారు. శుక్రవారం ఉదయం తిరుమల ఆలయంలోనికి సుప్రీంకోర్టు సోలిసియేట్ జనరల్ కనకడమేడల రవీంద్రకుమార్,.ఎమ్మెల్యే మాధవిరెడ్డి దంపతులు, ఎంఎల్‌సి హరిప్రసాద్ దంపతులు వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు . టిటిడి అధికారులు స్వామివారి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## బంగారు భక్తుడు



**తిరుమల,మార్చి 27ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చిన ఓ భక్తుడు ఒంటినిండా బంగారు ఆభరణాలు ధరించి ఆలయంలోకి వెళ్ళడం ఆశ్చర్యం కలిగించింది. తెలంగాణ హైదరాబాద్ ఓల్డ్‌సిటీకి చెందిన సూర్యభాయ్ వ్యాపారవేత్త. ఆయన ఒంటి నిండా 12కిలోల బంగారు నగలు, కడియం మాత్రమే 3కిలోలు ఉన్నవాటిని ధరించారు. ఒంటినిండా బంగారుతో రావడంతో ఆలయంలో భక్తులందరూ ఇతనినే చూశారు. సాక్షాత్తు బంగారుదేవుడిని అంతా భారీగా నగలు ధరించి దర్శనంచేసుకోవడం ఆనందంగా ఉందన్నారు .శ్రీరామనవమి పర్వదినాన తిరుమలకు వచ్చి శ్రీవారిని దర్శించుకున్నారు. స్వామివారి తీర్థప్రసాదాలు అందుకున్నారు.

## తిరుమల ఆర్టీసి బస్సుల్లో గోవింద నామం!

**తిరుమల,మార్చి 27 ప్రభాతవార్తప్రతినిధి:** పుణ్యక్షేత్రం తిరుమలకు నడిచే ఆర్టీసి బస్సుల్లో గోవిందనామం వినిపించడంలేదు. తిరుమల-తిరుపతి మధ్య ఆధ్యాత్మికభావం ఉట్టిపడేలా టిటిడి ఉన్నతాశయంతో పలురకాల ప్రణాళికలు అమలుచేస్తున్నా ఇవేమీ ఆర్టీసి అధికారులకు పట్టడం లేదు. తిరుమల నుండి తిరుపతికి, తిరుపతి నుండి తిరుమలకు నడిచే ఆర్టీసి బస్సుల్లో ,విద్యుత్‌తో నడిచే ఆర్టీసి బస్సుల్లోనూ కనీసం భక్తిపారవశ్యం "గోవింద"నామం వినిపించడంలేదు. ఎంతో భక్తిభావంతో ..ప్రశాంత మనస్సుతో తిరుమలకు వచ్చే భక్తులకు తిరుపతి ఆర్టీసి బస్టాండు, రైల్వే స్టేషన్, విష్ణునివాసం తదితర ప్రాంతాల నుండి ఆర్టీసిబస్సులు గమ్యస్థానం చేరుస్తాయి. భక్తులు వెళ్ళే బస్సుల్లో గోవింద నామం వినిపించడంలేదు. ఘాట్‌లో ప్రయాణం ఎంతో ప్రమాదభరితం. అడుగడుగునా ఆపదమొక్కులవాడు రక్షగా వుండాలని....తమతో రావాలని భక్తులు ప్రార్థిస్తుంటారు. ప్రయాణం సురక్షితంగా సాగి... నీ దర్శనం చేసుకోవాలని భక్తులు కోరుతుంటారు. ఇప్పటికీ కొంతమంది ఉత్తరాంధ్ర భక్తులు, మహారాష్ట్ర, తమిళనాడు భక్తులు బస్సుల్లో గోవింద నామాలు చేస్తుంటారు. అయితే పూర్తిస్థాయిలో ఇవి ఆచరణకు నోచుకోవడంలేదు. తిరుమల తిరుపతి మధ్య రోజూ 480వరకు బస్సులు నడుస్తున్నాయి. 2వేలవరకు ట్రిప్పులు తిరుగుతున్నాయి. ప్రతిరోజూ 60వేలమంది భక్తులను చేరవేస్తున్నాయి. ఈ బస్సుల్లో గోవిందనామం వినిపింప జేయాలని పలువురు భక్తులు కోరుతున్నా అటు టిటిడి అధికారులు ఇటు ఆర్టీసి అధికారులు పట్టించుకోవడంలేదు.

## తప్పిపోయిన బాలుడు గుర్తింపు

**తిరుమల,మార్చి 27ప్రభాతవార్తప్రతినిధి:** కర్ణాటక రాష్ట్రం, యాదగిరి జిల్లా, బిరనకల్ల తండాకు చెందిన కార్తీక్ (16) ని తిరుమల పోలీసులు తిరుమలలో ఫోటో ఆధారంగా గుర్తించారు.

తల్లిదండ్రులు మందలించడంతో ఇంటి నుండి అలిగి వచ్చేశాడు. యాడగిరి మహిళా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తులో భాగంగా తిరుమల 2 టౌన్ పోలీసులు వెంటనే స్పందించి తిరుమల పరిధిలో బాలుడిని గుర్తించారు. బాలుడిని తిరుపతి మంగళం లోని ప్రభుత్వ బాలుర గృహానికి అప్పగించారు. తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల. సుబ్బరాయుడు, మాట్లాడుతూ తిరుమల వంటి ప్రాధాన్యత గల క్షేత్రంలో ప్రతిరోజూ లక్షలాది మంది భక్తులు రాకపోకలు జరుగుతుంది. తప్పిపోయిన వారు ,ఇంటి నుండి అలిగి వచ్చిన వారిని. గుర్తించడం పోలీసులకు ఒక సవాల్ అయినప్పటికీ, తిరుమల పోలీసు సిబ్బంది అంకితభావంతో, సమన్వయంతో పని చేస్తూ అద్భుత ఫలితాలు సాధిస్తున్నారు అని అన్నారు. తిరుమలలో సేవలందిస్తున్న ఉన్నతాధికారులతో పాటు పోలీసు సిబ్బందిని కూడా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

వార్త

గొప్పవారి గొప్పతనం వారు తమకంటే తక్కువ వారితో వ్యవహరించే తీరును బట్టి తెలుస్తుంది.

- కార్లయిల్

# నిర్లక్ష్యానికి మూల్యం

మానవ హృదయాలను కదిలించే మరో హృదయ విదారక రోడ్డు ప్రమాదం 14 మందిని కబళించింది. ఈ మధ్యకాలంలో ఇలాంటి ప్రమాదం ఇది రెండోది. రాత్రిపూట ఎంతో సంతోషంగా గమ్యం చేరేందుకు వీలుగా బస్సెక్కి ప్రయాణించేవారు తెల్లారేసరికి విగత జీవులుగా మారిపోవడం ఎంతో విషాదాన్ని నింపుతోంది. మార్కాపురం జిల్లాలో రాయపూర్ పరిసరాల్లో టిప్పర్‌ను ప్రయివేటు బస్సొకటి ఢీకొనగా గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో 14 సజీవ దహనమవగా మరో 11 మంది చావు బతుకుల మధ్య ఆసుపత్రిలో కొట్టుమిట్టాడుతున్నారు. రోడ్డు ప్రమాదాలన్నీ డ్రైవర్ల నిర్లక్ష్యం, వాహనాలు కండిషన్‌లో లేకపోవడం వంటి కారణాలతోనే జరుగుతుంటాయని గత సంఘటనలు తేల్చిచెప్పాయి. మార్గమధ్యంలో ప్రయాణికులు బస్సు కండిషన్‌పై ఆందోళన వ్యక్తం చేసి డ్రైవర్‌ను అప్రమత్తం చేశారు. దీంతో బస్సు సిబ్బంది ఎర్రగొండ పాలెం వద్ద దాదాపు గంటసేపు బస్సును నిలిపి ఉంచి మరమ్మతులు చేశారు.రోడ్డుకు ఎడమ వైపుగా వెళ్లాల్సిన బస్ డ్రైవర్ మూలమలుపు దగ్గర ఎదురుగా వచ్చే టిప్పర్‌ను అంచనా వేసుకోలేక ఢీ కొనడంతో డీజిల్ ట్యాంక్ పగిలి మంటలు చెలరేగాయి. కొందరు అద్దాలు పగులగొట్టి బయటకురాగా మరికొంత మంది డ్రైవర్ సీట్లోంచి బయటకు వెళ్లబోయి మంటలకు ఆహుతయ్యారు. సజీవదహనమైన వారెవరి మృతదేహాలు గుర్తు పట్టేందుకు లేదు. వారి బంధువుల డిఎన్ఎ పరీక్షలతో పాటే అది సాధ్యమౌతుంది. తొలుత బస్ డ్రైవర్‌ను అధికారులు ప్రశ్నించినప్పుడు 'స్టీరింగ్ స్టక్' అయిందనే మాట వినవచ్చింది. కానీ ప్రమాదం జరిగినతర్వాత అధికారుల పరిశీలనలో తేలిందేమిటంటే డ్రైవర్ మానవ తప్పిదం వల్లనే ఇలా జరిగిందని స్పష్టం చేశారు. బస్సు కండిషన్ బాగుండకపోవడం, చాలా కాలంగా మరమ్మత్తులకు నోచుకోకపోవడం, డ్రైవర్ నిద్రమత్తులో ఉండడం, ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించలేకపోవడం వంటి ఎన్నో కారణాలను పరిశీలించి ప్రమాద కారణం విశ్లేషించే ప్రధాన బాధ్యత వాహన యాజమాన్యం, రవాణా అధికారులది. ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండడంతో కొందరు ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద సమయంలో రాజుకున్న మంటల్లో వారి ప్రాణాలు సజీవ దహనమయ్యాయి. వారి మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోయాయి. బస్సులో చెలరేగిన మంటల్లోంచి బయటికి వచ్చేందుకు ప్రయాణికులకు వేరే దారిలేకపోయింది. ప్రమాదానికి గురైన ట్రావెల్ బస్సులోని ప్రయాణికులంతా తెలంగాణలోని జగిత్యాల జిల్లా నుంచి సొంత ఊళ్లకు వస్తున్నారు.ముందు భాగంలో ఉన్న వారంతా వేముల, ఉదయగిరి ప్రాంతాలకు చెందిన వారే ఉన్నారు. ఒకే ఘటన ఒక్కసారిగా ఇంత మందిని పొట్టనపెట్టుకోవడం కలచివేస్తోంది. సంఘటనఅనంతరం బస్సులోని 41 మంది ప్రయాణికుల్లో 28 మంది తీవ్ర గాయాలతో వివిధ ఆసుపత్రులకు తరలించారు. సజీవ దహన మృతుల్లో మహిళలు,వృద్ధులు, చిన్నారులుఉన్నారు. రెండు నెలల క్రితం కర్నూలు జిల్లాలో ఇలాంటి ప్రమాదమే జరిగింది. ముందునున్న తలుపు తెరుచుకోగా బస్సంతా మంటలు దావానలంలో వ్యాపించాయి.వెనుక అద్దాల తలుపు బద్దలు కొట్టి బయటకు వచ్చినవారేబతికి బయటపడ్డారు. తాజా ప్రమాదంలో కంకర లోడ్‌తో వస్తున్న టిప్పర్ ఆయిల్ ట్యాంకర్‌ను బస్సు ముందు భాగం ఢీకొనగా ట్యాంకర్ పగిలి ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. ఆంధ్రప్రదేశ్‌లోని వింజమూరు ప్రాంతంలోని వారు కొద్ది రోజుల క్రితం ఉపాధి కోసం తెలంగాణలోని ప్రాంతానికి వలసవెళ్లారు. జగిత్యాలలో బుధవారం సాయంత్రం 5 గంటలకు బయలు దేరిన ఈ ప్రయివేటు బస్సు ఉదయానికి కలిగిరి చేరాలి. వాళ్లంతా శ్రీరామ నవమి వేడుకలకు తిరిగొస్తున్నారు. వీటికి కారకులెవరో కారణమెవరో విశ్లేషిస్తే చివరకు తేలేది మానవవ తప్పిదమే. కానీ సజీవ దహనానికి గురైన వారి కుటుంబాల వేదన తీర్చేదెవరు? 'స్టీరింగ్ స్టక్' అయినందునే అని సాంకేతికకారణం చూపినా దానికి బాధ్యత వహించాల్సింది. డ్రైవరు, అది బాగు చేయించి బయలుదేరాక మళ్లీ ఏమైందో ఏమోకానీ బస్సు వేగంగా వెళ్లి టిప్పర్‌ను ఢీకొంది. 'స్టీరింగ్ స్టక్' అనేది యాంత్రిక కారణమైనా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేసిన అధికారుల బాధ్యతారహితంగా వ్యవహరించాలనుకోవాలి.ఏతావాతా రవాణా శాఖ నిర్లక్ష్యమూ కన్పడ్తోంది. గత యేడాది అక్టోబరు నెలలో కర్నూలు జిల్లాలో ఓప్రైవేట్ బస్సు ఇలాంటిప్రమాదానికి గురైతే 19మంది దుర్మరణం చెందారు. భారీగా అధికార యంత్రాంగం ఎంతో హడావుడి చేసింది.ఇకపై ఇటువంటి ప్రమాదాలు జరగకుండా చూస్తామన్న నేతలు ఇప్పుడేం చెబుతారు. బస్సుల ఫిట్‌నెస్,కండక్టర్, బస్సు కండిషన్ వంటి అంశాలపై రవాణా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి ఉంటే మరో ప్రమాదం జరిగి ఉండేది కాదు. ప్రతిరోజూ అన్ని బస్సులూ తనిఖీ చేయాల్సిన బాధ్యత నుంచి రవాణా అధికారులు తప్పించుకో జాలరు.జాతీయ రహదారుల్లో జరిగేప్రమాదాలు మానవ తప్పిదంవైపేవేళ్ల చూపిస్తున్నాయి.అతిసాధారణ ప్రయాణం అదుపుతప్పితే సామూహిక మరణాల అగ్నిగుండంగా మారిపోవటాన్ని ఎవరూ జీర్ణించుకోలేకపోతున్నారు. డ్రైవర్లకు తగినశిక్షణ, విశ్రాంతి నియమాలు, ఎమెర్జెన్సీ భద్రతా ప్రమాణాలు, ప్రైవేట్ వాహనాల ప్రయాణాలపై నిరంతర తనిఖీలున్న నాడు ప్రమాదాల సంఖ్య తగ్గిపోయే అవకాశంఉంటుంది. ఇటీవల కర్నూలు బస్సు అగ్నికి ఆహుతైన సంఘటనలో 19 మంది చేవెళ్ల బస్సులారీ ప్రమాదం అనంతరం మరో ప్రమాదం ఆపలేకపోవడం విచారకరం.



తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించడం ఎలాగో తెలియచేసేదే నాగరికత.

మహాత్మాగాంధీ



ఎత్తైన పర్వతాలను ఎక్కేందుకు ఎలా వంగి నడుస్తామో ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు కొంత అణకువతో మెలగాలి.

ఎమర్సన్

# ప్రజావాక్కు

### ప్రకటనలు పేపర్లవరకే పరిమితమా!

**మొన్న** ముఖ్యమంత్రి గారు భూములు ఆక్రమిస్తే జైలు తప్పదు అన్నాడు.సంతోషమేకానీఆచరణలో అది కనిపించటం లేదు. దాదాపు 25సంవత్సరాల నుండి రాష్ట్రంలో దొంగబాబాలు చెరువు పొరంబోకు భూములు, అటవీ భూములనుఆక్రమించిఆశ్రమాలపేరుతో మోసం చేస్తుంటే ఏమి చేస్తుంది ప్రభుత్వం?ఒక పేదవాడు నివసించడానికి ప్రభుత్వ స్థలంలో చిన్నగుడిసె వేసుకుంటే మరుక్షణమే కూల్చివేసే అధికారులు దొంగస్వాములపట్ల ఆవిధంగా ఎందుకు ప్రవర్తించరు?జిల్లా అధికారులు దొంగస్వాముల ప్రలోభాలకు,వత్తిళ్లకు లోంగిమెతకవైఖరి అవలంభిస్తుంటే పైఅధికారులుఏమిచేస్తున్నారు? మంత్రులు ఏమిచేస్తున్నారు?ప్రజాప్రతినిధులు ఏమిచేస్తున్నారు? ఈమధ్య ముఖ్యమంత్రిగారు శాసనసభ్యుల పనితీరుపై ఆరాతీస్తున్నారు. ఈశాసనసభ్యులపని తీరుపైకూడా దృష్టిపెట్టండి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### వ్యర్థాల నిర్వహణ పెద్ద సవాల్

**ప్రపంచవ్యాప్తంగా** పట్టణీకరణ పెరుగుతున్నకొద్దీ వ్యర్థాల నిర్వహణ ఒక పెద్ద సవాలుగా మారింది. ఈ సమస్యకు పరిష్కారంగా వ్యర్థాల నుండి విద్యుత్ ఉత్పత్తి చేసే సాంకేతికత అందుబాటులోకి వచ్చింది. పునర్వినియోగానికి వీలుకాని వ్యర్థ పదార్థాలను ఉపయోగపడే ఇంధనంగా, ప్రధానంగా వేడి లేదా విద్యుత్తుగా మార్చే ప్రక్రియనే వ్యర్థాల నుండి విద్యుత్ ఉత్పత్తి అంటారు. ఇది కేవలం చెత్తను నిర్మూలించడమే కాకుండా, పెరుగుతున్న విద్యుత్ అవసరాలను తీర్చడానికి ఒక ప్రత్యామ్నాయ మార్గంగా ఉపయోగపడుతుంది. ఈ విద్యుత్తును ఉత్పత్తి చేయడానికి వివిధ పద్ధతులున్నాయి. అంతేకాకుండా చెత్త కుప్పల సమస్య తగ్గడమే జలాలు కలుషితం కావు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### తల్లిదండ్రులు - మన బాధ్యత

మన జీవితానికి మొదటి గురువులు తల్లిదండ్రులు.మన కోసం వారు తమ కష్టాలను మరిచి, నిద్రలేని రాత్రులు గడిపారు.ఈరోజు విద్య,ఉద్యోగాల పేరుతో అనేక మంది పిల్లలు ఇతరరాష్ట్రాలకు,విదేశాలకు వెళ్లి స్థిరపడుతున్నారు.అది తప్పుకాదు. కానీ ఆప్రయాణంలో మన జన్మ కు కారణమైన తల్లిదండ్రులను విస్మరించడం మాత్రం అన్యాయం. వృద్ధాప్యంలో తల్లిదండ్రులకు డబ్బు కన్నా ఎక్కువగా కావలసింది ప్రేమ, సంరక్షణ, మన ఉనికి.

- ఎన్. కృష్ణ, హైదరాబాద్

### అసత్య ప్రచారానికి అంతం లేదా?

**ఎందుకనో** ఈ మధ్య కాలంలో కొన్ని వార్త పత్రికలు, టీవీ ఛానళ్ళు, సోషల్ మీడియా సంస్థలు తమ రేటింగ్‌ను పెంచుకోవడమేలక్ష్యంగా తప్పుడు కథనలు ప్రచురిస్తూ,అసత్య ప్రచారానికి కేంద్రబిందువుగా నిలుస్తుండటం ఈ ప్రజాస్వామ్యానికి సంబంధించి అత్యంత దురదృష్టకరమైన విషయం. ఎందుకంటే ప్రజలకు మంచి ఏదో, చెడుఏదో తెలియజేసి,ఈ సమాజంలోనిత్యంజరిగే పలుఅవినీతి బాగోతాలను, ఆరాచకాలను, దౌర్జన్యాలను ఎప్పటికప్పుడు ప్రజలకుచేరవేసి వారిని చైతన్యపరచాల్సినకొన్నివార్తపత్రికలు,టీవీఛానళ్లు,మీడియా సంస్థలు వక్ర మార్గానపయనం సాగిస్తూవున్నది లేనట్టుగా,లేనిది ఉన్నట్టుగా చూపడమే కాదు ఒక్కొక్కసారి బతికున్న మనుషులను కూడా చనిపోయినట్లుగా చూపే అబద్దపు, దగా కోరు ప్రచారానికి నడుం బిగిస్తుండటం ఈదేశ ప్రజానీకాన్ని తీవ్ర గందరగోళానికి గురిచేయడమే కాదు వారిని అశాంతి పూరితమైన వాతావరణానికి తీసుకెళ్లే చర్యలకు తెగబడుతున్నారు.

- బుగ్గన మధుసూదనరెడ్డి, నంద్యాల జిల్లా

### ప్రజల సమస్యలు పట్టించుకోండి

**రాజకీయ** నాయకులకు ఓమంచిగుణం ఉంది.ఏది అడిగినానో అని చెప్పరు. కానీ ఆ అడిగినదాన్ని జన్మలో చేయరు. ఇది పెద్ద చెత్తప్రవృత్తి.గతదశాబ్దంపైగా ఇ.పి.ఎస్. ఫించను దారులకు వెయ్యి రూపాయల నుంచి కనీసం 7500కు పెంచమని అర్థిస్తున్నా ప్రభుత్వం అయ్యో అలాగా తప్పక చూస్తామని అంటున్నారు.బడ్జెట్‌కు ముందుగా కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌గారికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీగారికి మెయిల్స్,లేఖలు అనేకం పంపినా, ప్రభుత్వంలో చలనం శూన్యం. ఇంకెవరి కాళ్ళు, చేతులు పట్టుకోవాలి? వయసుడిగి ఇప్పటికే లక్షల మంది ఈ భూమిని వదలిపోయారు.

- ఆర్.మూర్తి, సికింద్రాబాద్

### దోమల బెడదను నివారించాలి

**రాష్ట్రంలో** దోమలు అధికంగా విహరిస్తూ ఉన్నాయి. దీంతో ప్రజలకు డెంగీ, మలేరియా, టైఫాడ్ వంటి జ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. సాయంత్రం వేళ బయట వాకింగ్ చేస్తున్న పెద్దలు, బయట ఆడుతున్న పిల్లలు విపరీతమైన దోమలతో ఇబ్బంది పడుతున్నారు. దోమల నివారణకు రాష్ట్ర ప్రభుత్వంచర్యలు తీసుకుని ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారించి సంబంధిత అధికారులను అప్రమత్తం చేయాలి. వేసవి కాలం వేడి నుండి ఉపశమనానికై ఆరు బయటకు వస్తారు కావునా దోమల భారి నుండి కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

-మిద్దె సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# 'మత్తు'ను ఉపేక్షిస్తే ఉపద్రవమే

**ఎన్నో దేశాలు రకరకాల వ్యూహాలతో ఈ మత్తుపై యుద్ధాన్నే ప్రకటిస్తుంటే మనదేశంలో ఏదో ప్రకటనలు, నామమాత్రపు కేసులతో చేతులు దులుపుకుంటున్నారు. ఉన్న చట్టాలను కూడా సమర్థవంతంగా అమలు చేయలేకపోతున్నారు. ఫలితంగా ఈ మత్తువ్యాపారం అంతకంతకు పెరిగిపోతున్నది. ఈ మత్తుమందుల మైకంలో యువత చేయరాని, చేయకూడని పనులకు కూడా ఎగబడుతున్నది. నేరాలు పెరిగిపోతున్నాయి. యువత భవిష్యత్‌ను తీవ్రంగా దెబ్బతీస్తున్న ఈ మాదకద్రవ్యాల సవాల్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవాల్సిన తరుణమిది. మాటలతోకాకుండా చేతలతో చూపించాల్సిన సమయమిది. ప్రభుత్వంపైనే పూర్తి బాధ్యత వదిలిపెట్టకుండా స్వచ్ఛంద సంస్థలు, పౌరులు, అందరూ కలిసికట్టుగా త్రికరణశుద్ధిగా మాదకద్రవ్యాల నిర్మూలన యజ్ఞంలో పాల్గొంటే తప్ప ఈ ముప్పుతప్పే అవకాశాలు లేవు.**

దామెర్ల సాయిబాబ

రాజకీయ నాయకులు వచ్చే ఎన్నికల గురించి ఆలోచిస్తుంటే రాజనీతిజ్ఞులు భావితరాల భవిష్యత్ గురించి మదన పడుతుంటారని పెద్దలు అంటారు. కాలానుగుణంగా చోటు చేసుకుంటున్న మార్పులు, అవసరాలను ఎదుర్కొని పరిష్కారంవైపు ఎలా అడుగులు వేయాలన్నది రాజనీతిజ్ఞులు ఆలోచిస్తుంటే పరిష్కారంవైపు చూస్తూనే రాజకీయంగా ప్రయోజనం ఎలా పొందాలనేదే రాజకీయ నాయకులు ఆరాటపడుతుంటారు. అందుకు అనుగుణంగానే చర్యలు చేపడుతుంటారు. ఇదేదో ఇప్పటికిప్పుడు ప్రారంభ మైందని చెప్పడం లేదు. ఏనాటి నుంచో ఉన్నా తమ వ్యూహాలు, అభిప్రాయాలను ఆనాటి రాజకీయ నాయకులు తమ అంతరంగాల్లోనే ఉంచుకొని విశాల హృదయంతో సమాజంలో సమస్యల పరిష్కారంవైపు అడుగులు వేస్తున్నట్లు కన్పించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఏ అవకాశం,సమస్యలు వచ్చినా అధికారంలో ఉన్నవారిని ఇరుకున పెట్టేందుకు ప్రతిపక్షం,వీరిని ఇబ్బందులపాలు చేసేందుకు అధికారపక్షం ఉపయోగించుకుంటూనే ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశవ్యాప్తంగా అంతకంతకు పెరిగి సమాజాన్ని పట్టిపీడిస్తున్న మత్తుపదార్థాల వాడకం, వినియోగం ఆందోళన కలిగిస్తున్న మాట వాస్తవమే. కానీ ఇదేదో తెలంగాణలో మొన్నటి టిఆర్ఎస్ ప్రభుత్వం, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అలాగే ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ ప్రభుత్వ హయాంలో కానీ, లేక ప్రస్తుత కూటమి ప్రభుత్వ కాలంలో కానీ ప్రారంభం కాలేదు. దశాబ్దాల తరబడి కొనసాగుతున్నది. మారిన పరిస్థితులు, అలవాట్లకు అనుగుణంగా కొందరు స్మగ్లర్లు సొమ్ము చేసుకునేందుకు ఈ వ్యాపారం విస్తరిస్తున్న మాట వాస్తవం. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాదకద్రవ్యాల వినియోగం, సరఫరాపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మాదకద్రవ్యాలరహిత రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని పదేపదే ప్రకటిస్తున్నారు. ప్రత్యేకంగా 'ఈగల్' విభాగాన్ని ఏర్పాటు చేశారు.ఇక ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ విషయంలో దృఢసంకల్పంతో ఉన్నారు. ఈ మహమ్మారిని తుదముట్టించేందుకు రాజీలేని పోరాటం చేస్తున్నామని ప్రకటిస్తూనే ఉన్నారు. అయినా ఈ మహమ్మారి తెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశవ్యాప్తంగా ఆ మాటకొస్తే ప్రపంచ వ్యాప్తంగా కూడా విస్తరిస్తూనే ఉన్నది. మెక్సికో కేంద్రంగా రకరకాల మార్గాల్లో అనేక దేశాల్లో ప్రవేశిస్తున్నది. యేటా కొకైన్, బ్రౌన్‌షుగర్ లాంటి మాదకద్రవ్యాలు దాదాపు వెయ్యి టన్నులకు పైగా ప్రపంచవ్యాప్తంగా సరఫరా అవుతున్నట్లు అనధికార అంచనాలను బట్టి తెలుస్తున్నది. లక్షలాది కోట్ల వ్యాపారం జరుగుతున్నది. తెలుగు రాష్ట్రాల్లోకూడా పరిస్థితి ఆందోళనకరంగానే ఉంది. తాజాగా గతవారంలో మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి సంబంధించిన మొయినాబాద్‌లో ఉన్నఫామ్‌హౌస్‌పై 'ఈగల్' టీమ్ జరిపిన దాడుల్లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. దర్యాప్తు లోతుకు వెళ్లేకొద్దీ రకరకాల మలుపులు తిరుగుతున్నాయి. తాజాగా ఈ కేసుకు సంబంధించి ఒక డాక్టరుతోపాటు మరో ముగ్గురిని దర్యాప్తు బృందాలు అదుపులోకి తీసుకున్నాయి. ఆ ఫామ్‌హౌస్‌లో గత నాలుగేళ్లగా ఈతంతు జరుగుతున్నదనే ప్రాథమిక సమాచారం మేరకు దర్యాప్తు అధికారులు చేస్తున్న విచారణలో ఆసక్తికర విషయాలు వెలుగుచూస్తున్నాయి. నిందితుల సంఖ్య ఇప్పటికే పదిహేనుకుపైగా చేరింది. నేరస్తులు ఏ పరిస్థితుల్లోనూ తప్పించుకోలేరని రుజువులతో సహా న్యాయస్థానం ముందు నిలబెట్టి శిక్ష వేయిస్తామని

## ఒక్క మాట

పాలక పెద్దలు చెబుతున్నారు. ఇలా పట్టుబడినప్పుడు గత పాలకులు కూడా ఇలాంటి ప్రకటనలే చేశారు. కానీ నిర్దిష్టమైన చర్యలుతీసుకున్న దాఖలాలు లేవనే చెప్పొచ్చు. గతంలో ఒకసారి హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ ఏకంగా విలేకరుల సమావేశం పెట్టి డ్రగ్స్ వినియోగం వ్యాపారానికి సంబంధించి కొందరినిఅరెస్టు చేశామని, మరికొందరిని అరెస్టుకు సిద్ధం చేసామని ప్రకటించారు. దర్యాప్తు కొనసాగుతున్నదికనుక వారి పేర్లువెల్లడించలేమని ఆధారాలు లభించగానే అన్ని వివరాలు ప్రకటిస్తామని ఎంతటి పెద్దవారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదనిప్రకటించారు.అప్పట్లో చాలా మంది రాజకీయ నాయకులు పుత్రరత్నాల పేర్లు ప్రచారంలోకి వచ్చాయి. ఆ తర్వాత ఆ కేసు ఏమైందో ఇప్పటికీ వెలుగు చూడలేదనే చెప్పొచ్చు. ఇకపోతే మొన్నటి టిఆర్ఎస్‌ప్రభుత్వ హయాంలో కూడా భారీ డ్రగ్స్‌కుంభకోణం వెలుగు చూసింది. పలువురు సినీప్రముఖుల పేర్లు మళ్లీ ప్రచారంలోకి వచ్చాయి. ఈ వ్యాపారం, వినియోగంలో ఊహించని పేర్లుకూడా తెరపైకి తెచ్చారు. విచారణ పేరుతో పెద్దఎత్తున ప్రచారం చేసి భారీ చర్యలు ఉండబోతున్నట్లుగా చెప్పుకున్నారు. కొండను తవ్వి ఎలుకను కూడా పట్టుకోలేకపోయినట్లు కొన్నేళ్ల తర్వాత దాదాపు అందరికీ క్లీన్ చిట్ ఇచ్చారు. ఇవేకాదు గత పదేళ్లగా దేశవ్యాప్తంగా లక్షలాదికోట్ల విలువైన హెరాయిన్, కొకైన్ లాంటి మాదకద్రవ్యాలు పట్టుబడ్డాయి. అందుకే ఎవరెన్ని చెప్పినా, ఎన్ని చట్టాలు తెచ్చినా, డ్రగ్స్ వినియోగం అంతకంతకు పెరిగిపోతున్నది. 2004-14 మధ్యకాలంలో దేశవ్యాప్తంగా మూడు లక్షల అరవైమూడు వేల కిలోల మత్తుమందుపట్టుకోగా 2014-24 మధ్య అది ఇరవైనాలుగు లక్షలకిలోలకు చేరిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా గత యేడాది ప్రకటించారు. కానీ అధికారుల కళ్లు గప్పి రకరకాల మార్గాల్లో పోతున్నవి ఇంతకు ఎన్నోరెట్లు ఎక్కువ ఉండవచ్చునని అనధికార అంచనా. హుక్కా కేంద్రాలు, మరిన్ని వ్యాయామశాలలు, ఇంకొన్నిరెస్టారెంట్లు, విద్యాలయాలు, ప్రయాణ ప్రాంగణాలు, నగరాల శివార్లలోనూ పారిశ్రామిక వాడలదాకా వ్యాపించిన ఈ దుసంస్కృతి జాతి భవితను ప్రశ్నార్థకం చేస్తున్నది. ఎవరెన్ని కేకలు వేసినా, హెచ్చరికలు జారీ చేసినా దీనిని నిరోధించేందుకు చేస్తున్న ప్రయత్నాలు అంతగా సఫలీకృతం కావడం లేదు. పట్టుబడిన కేసుల్లో కూడా తొంభైశాతానికి పైగా న్యాయస్థానాల్లో వీగిపోతున్నాయి. అందుకే పట్టుబడి జైళ్లకు వెళ్లి వచ్చినవారు సైతం మళ్లీ అదే వ్యాపారంలో కొనసాగుతున్నారు. పోలీసులన్నా, నార్కోటిక్ విభాగం అధికారులన్నా ఈ మత్తుమందు వ్యాపారుల్లో భయభక్తులు లేవు. తిరుగులేని సాక్ష్యాలతో న్యాయస్థానాల ముందు రుజువుచేసి నిందితులకు శిక్షలు వేయించడంలో అధికారగణం విఫలమవుతున్నారు. డ్రగ్స్‌కు సంబంధించిన కేసుల్లో నిందితులకు శిక్షలు పడాలంటే చార్జ్‌షీట్ పకడ్బందీగా ఉండాలి. న్యాయస్థానాల ఎదుట నిరూపించదగిన సాక్ష్యాలు సేకరించాలి. అందులో విఫలమవుతున్నారనేది రికార్డులే వెల్లడిస్తున్నాయి. యువతను నిర్వీర్యం చేసి జాతి ప్రయోజనాన్ని దెబ్బతీసి ఈ మత్తుమందును నిర్మూలించేందుకు ఎన్నో దేశాలు పకడ్బందీ వ్యూహాలతో పదునైన చట్టాలతో అడుగులు ముందుకు వేస్తున్నాయి. చైనా, వియత్నాం, ఇరాన్, థాయిలాండ్ సౌదీ అరేబియా, కాంబోడియా, ఇండోనేషియా, ఉత్తరకొరియా, కొలంబో తదితర దేశాలు మత్తుమందుల నేరాలలో మరణ శిక్షలు విధిస్తున్నాయి. ఫిలిప్పీన్స్‌లో అయితే ఆ పాలకులు మరో అడుగు ముందుకు వేసి ఈ మత్తుమందుల వ్యాపారంలో భాగస్వాములైన వందలాది మందిని గతంలో కాల్చి చంపింది. అమెరికా లాంటి దేశాలు మత్తుమందుల నియంత్రణ, నిరోధానికి యేటా వేలాదికోట్లు ఖర్చుపెడుతున్నాయి. ఇలా ఎన్నో దేశాలు రకరకాల వ్యూహాలతో ఈ మత్తుపై యుద్ధాన్నే ప్రకటిస్తుంటే మనదేశంలో ఏదో ప్రకటనలు, నామమాత్రపు కేసులతో చేతులు దులుపుకుంటున్నారు.ఉన్న చట్టాలను కూడా సమర్థవంతంగా అమలు చేయలేకపోతున్నారు. ఫలితంగా ఈ మత్తువ్యాపారం అంతకంతకు పెరిగిపోతున్నది. మొయినాబాద్ ఫామ్‌హౌస్,కాల్పులు, డ్రగ్స్ కేసును పాతవాటి మాదిరిగానే నీరుగార్చేందుకు కొందరు రాజకీయ నాయకులు పావులు కదుపుతున్నట్లు సమాచారం. యువత భవిష్యత్‌ను తీవ్రంగా దెబ్బతీస్తున్న ఈ మాదకద్రవ్యాల సవాల్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవాల్సిన తరుణమిది. మాటలతోకాకుండా చేతలతో చూపించాల్సిన సమయమిది. ప్రభుత్వంపైనే పూర్తిబాధ్యత వదిలిపెట్టకుండా స్వచ్ఛంద సంస్థలు, పౌరులు, అందరూ కలిసికట్టుగా త్రికరణశుద్ధిగా మాదకద్రవ్యాల నిర్మూలన యజ్ఞంలో పాల్గొంటే తప్ప ఈ ముప్పు తప్పే అవకాశాలు లేవు. ●

# ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ఇంధన పరీక్ష

ఈ. శ్రీనివాస్ రావు

పశ్చిమాసియాలో రగులుతున్న యుద్ధ జ్వాలలు కేవలం ఆ ప్రాంత సరిహద్దులకే పరిమితం కాకుండా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ గుండెకాయను తాకుతున్నాయి. ఫిబ్రవరి 28న మొదలైన ఈ ఘర్షణలు నేడు ప్రతి దేశపువంటింటి బడ్జెట్‌ను, పారిశ్రామిక రంగాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ముఖ్యంగా అంతర్జాతీయ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిలో నెలకొన్న అనిశ్చితి, ప్రపంచ దేశాల ఇంధన భద్రతను ప్రశ్నార్థకం చేస్తోంది. ప్రపంచ ముడి చమురు రవాణాలో సింహభాగం సాగే హర్మూజ్ మార్గం నేడు యుద్ధ నీడలో చిక్కుకుంది. ఒకప్పుడు రోజుకు వందకు పైగా నౌకలతో కళకళలాడే ఈ జలసంధిలో, ప్రస్తుతం ఆ సంఖ్య ఒక అంకెకు పడిపోవడం సరఫరా గొలుసు ఎంతలా దెబ్బతిన్నదో అద్దం పడుతోంది.నౌకల రాకపోకలు నిలిచిపోవడంతో సహజ వాయువు, చమురు ధరలు అంతర్జాతీయ మార్కెట్‌లోఒక్కసారిగా ఎగబాకాయి. బ్రెంట్ క్రూడ్ ధర 100 డాలర్ల మార్కును దాటడం భవిష్యత్తులో రాబోయే భారీ ద్రవ్యోల్బణానికి సంకేతంగా కనిపిస్తోంది. ఈసంక్షోభ ప్రభావం కేవలంపేద దేశాలకే పరిమితం కాలేదు. ఆస్ట్రేలియా, అమెరికా, సింగపూర్ వంటి సంపన్న దేశాల్లో సైతం పెట్రోల్, డీజిల్ ధరలు సామాన్యుడికి భారంగా మారాయి. డీజిల్ ధరలు పెరగడం అంటే అది కేవలం రవాణా ఖర్చు పెరగడం మాత్రమే కాదు, నిత్యావసర వస్తువులు, ఆహార పదార్థాల ధరలు ఆకాశాన్నంటడమే. గ్రీస్, ఇజ్రాయెల్ వంటి దేశాల్లో ఎల్పీజీ ధరల పెరుగుదల గ్లోబల్ మార్కెట్‌లోని అసమాన




తలను మరోసారి బయటపెట్టింది. విమాన ఇంధన ధరల పెరుగుదలతో ప్రయాణ రంగం కూడా అదనపు సర్చార్జీల భారంతో కునారిల్లుతోంది. భారతదేశం తన ఇంధన అవసరాల కోసం దిగుమతులపైనే అధికంగా ఆధారపడుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరల పెరుగుదల వల్ల కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలను పెంచాల్సి రావడం సామాన్య వినియోగదారునిపై భారం మోపింది. ప్రస్తుతానికి పరిస్థితి కొంత నియంత్రణలో ఉన్నట్లు కనిపిస్తున్నా, యుద్ధం సుదీర్ఘ కాలం కొనసాగితే అది దేశీయ ఆర్థిక స్థిరత్వాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉంది. ఈ సంక్షోభం ప్రపంచ దేశాలకు ఒక స్పష్టమైన హెచ్చరికను జారీ చేస్తోంది. ఇంధనం కోసం కేవలం శిలాజ ఇంధనాలపై, అది కూడా ఒకే ప్రాంతంపై ఆధారపడటం ఎంత ప్రమాదకరమో ఇప్పుడు అర్థమవుతోంది. సౌర,వాయు వంటి పునరుత్పాదక ఇంధన వనరుల వైపు మళ్లడం ఇక ఎంతమాత్రం ఆలస్యం చేయకూడదు. సంక్షోభ సమయాల్లో దేశ అవసరాలను కనీసం కొన్ని నెలల పాటు తీర్చగలిగేలా భారీ ఇంధన నిల్వలను ఏర్పాటు చేసుకోవడం ప్రతి దేశానికి రక్షణ కవచంవంటిది. పరిశ్రమలు, రవాణా రంగాల్లో ఇంధన పొదుపు చర్యలను ప్రోత్సహించడం, ప్రజల్లో అవగాహన పెంచడం తక్షణ అవసరం. ప్రపంచం ఒకే ఆర్థిక గ్రామంగా మారిన ఈ తరుణంలో, ఎక్కడో ఒక మూల తలెత్తే అశాంతి ప్రతి ఇంటి గడపనూ తాకుతుంది. దీనికి ఇంధనస్వయంసమృద్ధి సాధించడమే దీర్ఘకాలిక పరిష్కారం.దేశాలు కేవలం తాత్కాలిక ధరల నియంత్రణతో సరిపెట్టుకోకుండా, సమగ్రమైన ఇంధన భద్రతా వ్యూహాలను రూపొందించుకోవాలి. లేని పక్షంలో, ఇలాంటి ప్రాంతీయ ఘర్షణలు ప్రపంచ శాంతిని, స్థిరత్వాన్ని శాశ్వతంగా దెబ్బతీసే ప్రమాదం ఉంది. ●

# ఉగ్ర భావజాల విషకౌగిలిలో యువత

ముద్దం నరసింహ స్వామి

తెలుగు రాష్ట్రాల్లో ఇటీవల వెలుగు చూస్తున్న ఉగ్రవాద మూలాలు అంతర్గత భద్రతకు పొంచి ఉన్న ముప్పును మరోసారి చాటి చెబుతున్నాయి. విజయనగరం నుంచి విజయవాడ వరకు, సికింద్రాబాద్ నుంచి హైదరాబాద్ వరకు విస్తరిస్తున్న ఈ నెట్‌వర్క్ కేవలం భౌతిక దాడులకే పరిమితం కాలేదు. ఇది అంతకంటే ప్రమాదకరమైన 'భావజాల యుద్ధం'గా రూపాంతరం చెందుతోంది. సాంకేతికతను ఆయుధంగా చేసుకుని, సోషల్ మీడియా వేదికగా యువతను తప్పుదోవ పట్టిస్తున్న ఈ పరిణామాలు సమాజానికి తీవ్ర హెచ్చరికలు జారీ చేస్తున్నాయి.విజయవాడలోమహ్మద్ రహ్మతుల్లా షరీఫ్, మీర్జా సొహైల్ బేగ్, మహ్మద్ డానిష్‌ల అరెస్టు కేవలం ముగ్గురు వ్యక్తుల అరెస్టు మాత్రమే కాదు. ఇది అంతర్జాతీయ హ్యాండ్లర్లతో ముడిపడి ఉన్న ఒక లోతైన కుట్రలో భాగం. వీరికి పాకిస్థాన్ హ్యాండ్లర్లతో సంబంధాలు ఉండటం, విదేశీ నిధులు అందుతుండటం గమనార్హం. ఇక్కడ గమనించాల్సిన మరో కీలక అంశం 'రాడికలైజేషన్'. ఒక నిర్దిష్ట వర్గానికి చెందిన యువకులను లక్ష్యంగా చేసుకుని, వారిలో మత ఛాందసవాదాన్ని నూరిపోసి, వారిని జిహాద్ వైపు మళ్లించే ప్రయత్నం జరుగుతోంది. హైదరాబాద్‌కు చెందిన సయీదా బేగం అరెస్టుతో ఈ నెట్‌వర్క్‌లో మహిళల ప్రమేయం కూడా వెలుగులోకి వచ్చింది. గతంలో ఉగ్రవాదం అంటే సరిహద్దుల వద్ద చొరబాట్లు,బాంబు పేలుళ్లుగా మాత్రమే ఉండేది. కానీ ఇప్పుడు మన మధ్యేఉంటూ, మన భాషలోనే మాట్లాడుతూ, డిజిటల్ తెరల వెనుక ఉగ్రవాద బీజాలు నాటడం నిఘా వర్గాలకు పెద్ద సవాలుగా మారింది. ప్రపంచవ్యాప్తంగా పరిస్థితిని గమనిస్తే,ఉగ్రవాదం రూపం మారుస్తోందే తప్ప అంతమవ్వడం లేదు. 2026 గ్లోబల్ టెర్రరిజం ఇండెక్స్ ప్రకారం గత ఏడాది 3,000 దాడులు నమోదు కావడం ఆందోళనకరం. అయితే, భారతదేశం విషయంలో ఒక ఆశాజనకమైన మార్పు కనిపిస్తోంది. 2024తో పోలిస్తే ఉగ్రవాద ఘటనలు 43శాతం తగ్గడం మన భద్రతా దళాల అప్రమత్తతకు నిదర్శనం కానీ, ఘటనలు తగ్గడం అంటే ముప్పు తొలిగిపోయినట్లు కాదు. ఉగ్రవాదం ఇప్పుడు 'లోన్ ఉల్ఫ్' (ఒంటరిగా దాడి చేయడం) దాడులకు, ఆన్‌లైన్ ప్రచారానికి ప్రాధాన్యతనిస్తోం ది. క్షేత్రస్థాయిలో దాడులు చేసే సామర్థ్యం తగ్గడంతో, విదేశీ ముష్కర శక్తులు ఇప్పుడు యువత మెదళ్లను కలుషి తం చేయడంపై దృష్టి సారించాయి. నేటిఉగ్రవాదంతుపాకీల కంటే టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి ఎన్‌క్రిప్టెడ్ యాప్‌లను ఎక్కువగా వాడుతోంది. యువతలో అసహనం, నిరుద్యోగం, సామాజిక వివక్ష వంటి అంశాలను ఆసరాగా చేసుకుని వారిని బ్రెయిన్ వాష్ చేస్తున్నారు. నిధుల బదిలీ కోసం



క్రిప్టో కరెన్సీని, సమాచార మార్పిడికి డార్క్‌వెబ్‌ను వాడుతుండటం వల్ల వీరిని గుర్తించడం కష్టతరమవుతోంది. వైమానిక దళ ఉద్యోగి సమాచారాన్ని లీక్ చేసిన ఉదంతం చూస్తే, సోషల్ మీడియా ద్వారా వ్యక్తులను ఎలా బుట్టలో వేసుకుంటున్నారో అర్థమవుతుంది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రహార్ వ్యూహ పత్రం ఈ సమస్యకు సమగ్ర పరిష్కారాన్ని సూచిస్తోంది. కేవలం తుపాకీతో ఉగ్రవాదాన్ని అణచలేమని, దానికి సామాజిక విరుగుడు అవసరమని ఇది స్పష్టం చేస్తోంది. యువతలో విరక్తి కలగకుండా విద్య, ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలి. స్థానిక ప్రార్థనా మందిరాలు, విద్యాసంస్థల్లో అనుమానాస్పద కదలికలను గుర్తించడంలో ప్రజలను భాగస్వాములను చేయాలి. సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులను, అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలను గుర్తించడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ),మెషీన్ లెర్నింగ్ వంటి సాంకేతికతను నిఘా వ్యవస్థలు వాడాలి. ముఖ్యంగా, ఈ భావజాల వ్యాప్తిని అడ్డుకోవడంలో మీడియా,విద్యాసంస్థల పాత్ర వెలకట్టలేనిది. వార్తలను కేవలం సంచలనం కోసం కాకుండా, సమాజాన్ని చైతన్యపరిచే దిశగా ప్రసారం చేయాలి. ఉగ్రవాద మూలాలు బయటపడినప్పుడు ఆయా వర్గాలను కించపరచకుండా, తప్పు చేసిన వ్యక్తుల వెనుక ఉన్న కుట్రలను బట్టబయలు చేయాలి.తద్వారా సామాన్యుల్లో అపోహలు తొలగి,వ్యవస్థల పట్ల నమ్మకం పెరుగుతుంది. యువతలో దేశభక్తిని, సహనశీలతను పెంపొందించేలా పాఠ్యాంశాల్లో మార్పులు రావాలి. ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకున్న విద్యార్థి ఏనాటికీ ఇటువంటి మత ఛాందసవాద సిద్ధాంతాలకు బలికాడనే సత్యాన్ని మనం గుర్తించాలి. చివరగా, అంతర్గత భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదు. ప్రతి పౌరుడూ ఒక 'అదృశ్య సైనికుడిలా' వ్యవహరించాలి. పొరుగున జరుగుతున్న అనుమానాస్పద కార్యకలాపాలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా పెను ప్రమాదాలను ముందే నివారించవచ్చు. సాంకేతికత ఇస్తున్న సవాలును అదే సాంకేతికతతో ఎదుర్కొంటూ, పటిష్టమైన నిఘా వ్యవస్థలను నిర్మించుకోవాలి. తెలుగు రాష్ట్రాల ప్రశాం తతను దెబ్బతీయాలని చూస్తున్న ముష్కర శక్తులకు ప్రభు త్వాల దృఢ సంకల్పం, ప్రజల సమైక్యత మాత్రమే సరైన సమాధానం కాగలవు. అప్రమత్తతతో కూడిన ఐకమత్యమే మన దేశ రక్షణకు అసలైన పునాది. ఉగ్రవాదం ఏ మతా నికో, వర్గానికో చెందింది కాదు, అది మానవ త్వానికిశత్రువు. తల్లిదండ్రులు తమ పిల్లల సోషల్ మీడియా అలవాట్లపై నిఘా ఉంచాలి. విద్యాసంస్థలు కేవలం మార్కుల కోసం కాకుండా, విమర్శనాత్మక ఆలోచనా ధోరణిని పెంపొందించేలా బోధించాలి. భావజాల పరంగా జరుగుతున్న ఈ యుద్ధంలో గెలవాలంటే ప్రభుత్వం, మీడియా, పౌరసమాజం ఏకతాటిపైకి రావాలి. అప్రమత్తతే మన దేశానికి అసలైన కవచం. ●

## హెచ్-1బిలో కొత్త నిబంధనలు..

# కనీస వేతనం 14 వేల డాలర్లు పెంపునకు యుఎస్ యోచన




**వాషింగ్టన్, మార్చి 27:** టెక్ కంపెనీల్లో విదేశీయులను తగ్గించి అమెరికన్లకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా అగ్రరాజ్యం మరో కీలక చర్యకు సిద్ధమైంది. ఇందులో భాగంగానే హెచ్-1బి వీసాదారుల వేతనాలను పెంచేలా అమెరికా కార్మిక శాఖ కీలక ప్రతిపాదనలు చేసింది. ఇవి అమలులోకి వస్తే విదేశీ ఉద్యోగుల వార్షిక వేతనం 14 వేల డాలర్ల మేర పెరిగే అవకాశం ఉంది. అమెరికన్లతో పోలిస్తే విదేశీ ఉద్యోగులకు వేతనం విషయంలో భారీ వ్యత్యాసం ఉంటోందని, దీనివల్ల చౌకగా లభించే ఉద్యోగులకు కంపెనీలు మొగ్గు చూపుతున్నాయని సుదీర్ఘంగా ఆందోళనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే అగ్రరాజ్యం అధికారులు తాజా ప్రతిపాదనలు తీసుకొచ్చారు. ప్రస్తుతం అమెరికాలో స్థానిక ఉద్యోగులతో పోలిస్తే హెచ్-1బి వీసాదారులు సగటున 10,191 డాలర్ల తక్కువగా వార్షిక వేతనం అందుకుంటున్నారు. కంప్యూటర్ ఆధారిత వృత్తుల్లో ఈ వ్యత్యాసం మరింత ఎక్కువగా ఉంటోంది. వాస్తవానికి ప్రత్యేక నైపుణ్యాలు కలిగిన ప్రతిభావంతుల కోసం హెచ్-1బి వీసా ప్రోగ్రామ్‌ను తీసుకొచ్చారు. కానీ, అందుకు భిన్నంగా కొన్ని కంపెనీలు ఈ వీసాను దుర్వినియోగం చేసి తక్కువ వేతనం తీసుకునే ఉద్యోగులను విదేశాల నుంచి నియమించుకుంటున్నాయనే ఆరోపణలున్నాయి. 2024 ఆర్థిక సంవత్సరంలో జారీ అయిన హెచ్-1బిల్లో 63 శాతం ఎంట్రీ లెవల్ ఉద్యోగస్థులే ఉన్నట్లు కార్మిక శాఖ గణాంకాలు తెలిపాయి. ఈ నేపథ్యంలోనే వేతన పెంపు ప్రతిపాదనలు చేసినట్లు అమెరికా అధికారులు వెల్లడించారు. అధ్యక్షుడి సంతకం తర్వాత ఈ ప్రతిపాదనలు అమల్లోకి వచ్చే అవకాశాలున్నాయి. కార్మిక శాఖ ప్రతిపాదనల ప్రకారం.. నాలుగంచెల వేతన వ్యవస్థలో మార్పులు చోటుచేసుకోనున్నాయి. ఎంట్రీ లెవల్ ఉద్యోగాలకు కనీస వేతనం 34 శాతం, లెవల్ 2 వారికి 52 శాతం, లెవల్ 3 ఉద్యోగులకు 70 శాతం, లెవల్ 4 ఉద్యోగులకు 88 శాతం మేర పెంచాలని అగ్రరాజ్యం భావిస్తోంది. ఈ ప్రతిపాదనలతో హెచ్-1బి వీసాదారుల సగటు వార్షిక వేతనం 14 వేల డాలర్ల మేర పెరిగే అవకాశం ఉంది. దీంతో విదేశీ ఉద్యోగులను నియించే కంపెనీలు యేటా 6.56 బిలియన్ డాలర్ల వేతనాలు చెల్లించాల్సి ఉంటుంది.



# పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీ తగ్గింపు

### వినియోగదారులకు కాదు, కంపెనీలకే: కేంద్రం స్పష్టీకరణ

### ఇంధన ఎగుమతులపై కేంద్రం పన్ను విధింపు: కేంద్ర మంత్రులు హార్దీప్ సింగ్ పూరి, నిర్మలా సీతారామన్

### ఎటువంటి ఉపయోగంలేదు: కాంగ్రెస్ పెదవి విరుపు

**న్యూఢిల్లీ, మార్చి 27:** పెట్రోల్, డీజెల్‌పై అదనపు ఎక్సైజ్ డ్యూటీని రూ.10 చొప్పున తగ్గించినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. పెట్రోల్‌పై గతంలో రూ.13 ఉన్న ఎక్సైజ్ డ్యూటీ రూ.3కు చేరింది. డీజెల్‌పై రూ.10 ఉంటే, ఇప్పుడు సున్నాకు తగ్గించినట్లు వెల్లడించింది. అయితే, ఎక్సైజ్ డ్యూటీ తగ్గింపు ప్రయోజనం వినియోగదారులకు చేరదని, రిటైల్ ధరలు యథాతథంగా కొనసాగుతాయని స్పష్టం చేసింది. ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలు ఎదుర్కొంటున్న భారీ నష్టాలను భర్తీ చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పెట్రోలియం మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. సామాన్యుల కోసమే: పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా గత నెల రోజుల్లోనే అంతర్జాతీయంగా ముడి చమురు ధర బ్యారెల్‌కు 70 డాలర్ల నుంచి 122 డాలర్లకు (దాదాపు 75 శాతం పెరుగుదల) పెరిగిందని ప్రభుత్వం తెలిపింది. ప్రపంచంలోని అనేక దేశాల్లో ఇంధన ధరలు 20 శాతం నుంచి 50 శాతం వరకు పెరిగినా, భారత్‌లో మాత్రం ధరలను స్థిరంగా ఉంచామని పేర్కొంది. సామాన్య పౌరులను కాపాడేందుకే ప్రధాని మోడీ ప్రభుత్వ ఆదాయాన్ని వదులుకుని ఈ నిర్ణయం తీసుకున్నారని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హార్దీప్ సింగ్ పూరి అన్నారు. ఇదే సమయంలో, డీజెల్ ఎగుమతులపై ప్రభుత్వం కొత్తగా సుంకాన్ని విధించింది. డీజెల్‌పై లీటర్‌కు రూ.21.5, విమాన ఇంధనం ఎటిఎఫ్‌పై లీటర్‌కు రూ.29.5కు ట్యాక్స్ పెరిగింది. అంతర్జాతీయంగా ధరలు పెరిగిన నేపథ్యంలో, ఎగుమతులను నిరుత్సాహపరిచి, దేశీయ అవసరాలకు ప్రాధాన్యత ఇచ్చేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. ప్రపంచ ఇంధన పరిస్థితిని నిశితంగా గమనిస్తూ, వినియోగదారులకు సరఫరా, ధరల స్థిరత్వాన్ని కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని కేంద్రం హామీ ఇచ్చింది. అందుకే ఎక్సైజ్ డ్యూటీ తగ్గించాం: ధరల పెరుగుదల నుంచి వినియోగదారులకు ఉపశమనం కలిగించేందుకు పెట్రోల్, డీజెల్‌పై ఎక్సైజ్ డ్యూటీ తగ్గించామని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. అలాగే డీజెల్ ఎగుమతులపై లీటర్‌కు రూ.21.5, జెట్ ఫ్యూయల్ ఎగుమతులపై లీటర్‌కు రూ.29.5 చొప్పున సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించారు. దీని వల్ల చమురు కంపెనీలు తమ ఉత్పత్తిని అంతర్జాతీయ మార్కెట్‌కు అమ్ముకోకుండా దేశీయ అవసరాలకు ప్రాధాన్యం ఇస్తాయని ఆమె పేర్కొన్నారు. కాంగ్రెస్ పెదవి విరుపు: చమురు సంస్థల నష్టాలను మాత్రమే ప్రభుత్వం చూస్తోంది తప్ప, సామాన్య ప్రజలు పడే ఇబ్బందులను మోడీ సర్కార్ పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ మండిపడింది.

కాంగ్రెస్ సీనియర్ నాయకులు పవన్ ఖేరా, మాణిక్కం ఠాగూర్ వేర్వేరుగా మీడియాతో మాట్లాడుతూ, పెట్రోల్, డీజెల్‌పై ఎక్సైజ్ డ్యూటీ తగ్గించడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. కేంద్ర ప్రభుత్వం చర్య సంక్షోభ సమయంలోనూ చమురు సంస్థలకు లాభాలు చేకూర్చేలా చర్యలు చేపట్టిందని దుయ్యబట్టారు.

ఆ ఎక్సైజ్ డ్యూటీ తగ్గింపు ప్రయోజనం వినియోగదారులకు కల్గిస్తే, సామాన్యులకు కొంతలో కొంత ఉపశమనం లభించేదని అభిప్రాయపడ్డారు.

# వాణిజ్య సిలిండర్లు 70శాతం పెంపు

### - గ్యాస్ సరఫరాపై కేంద్రం శుభవార్త - విదేశాల నుంచి గ్యాస్ నౌకలు రాక - ఇంధన కొరత నుంచి కాస్త ఉపశమనం



**న్యూఢిల్లీ, మార్చి 27:** పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో దిగుమతులకు అంతరాయం కలగడంతో ఏర్పడిన గ్యాస్ కొరత నేపథ్యంలో, పారిశ్రామిక, వాణిజ్య వినియోగదారులకు కేంద్రం ఉపశమనం కల్పించింది. వాణిజ్య ఎల్‌పిజి సిలిండర్ల కేటాయింపును అవసరమైన డిమాండ్‌లో ఇంతకుముందున్న 50శాతం నుంచి 70శాతానికి పెంచుతూ కేంద్రం ఉత్తర్వులిచ్చింది. ఉక్కు, ఆటోమొబైల్స్, వస్త్రాలు, రంగులు, రసాయనాలు, ప్లాస్టిక్స్ వంటి కార్మిక ఆధారిత రంగాలకు ప్రాధాన్యత ఇవ్వబడుతుంది, ఎందుకంటే అవి ఇతర అవసరమైన పరిశ్రమలకు కూడా మద్దతు ఇస్తాయి. ఈ రంగాలలో, ప్రాసెస్ పరిశ్రమలకు లేదా సహజ వాయువుతో ప్రత్యామ్నాయం లేని ప్రత్యేక తాపన ప్రయోజనాల కోసం ఎల్‌పిజి అవసరమయ్యే వాటికి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. ప్రస్తుతం చేస్తున్న 50 శాతం కేటాయింపునకు అదనంగా, మరో 20 శాతాన్ని ప్రతిపాదించినట్లు, దీనితో మొత్తం వాణిజ్య ఎల్‌పిజి కేటాయింపు సంక్షోభానికి ముందున్న ప్యాక్డ్ నాన్‌డొమెస్టిక్ ఎల్‌పిజి స్థాయిలో 70 శాతానికి చేరుకుంటుందని ప్రభుత్వ ఉత్తర్వులో పేర్కొంది. అయితే, అదనపు 20 శాతం కేటాయింపును పొందాలంటే, వాణిజ్య, పారిశ్రామిక ఎల్‌పిజి వినియోగదారు లందరూ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలలో నమోదు చేసుకోవాలని, అలాగే తమ నగరాల్లోని సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ ఎంటిటీ వద్ద పిఎన్‌జి కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలకు కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ లేఖలు రాసింది. "పరిశ్రమలలో (ఉక్కు, ఆటోమొబైల్, వస్త్ర, రంగుల, రసాయనాలు, ప్లాస్టిక్‌లు), ప్రక్రియలో సహజ వాయువుతో ప్రత్యామ్నాయం చేయలేని ప్రత్యేక ప్రయోజనాల కోసం ఎల్‌పిజిని ఉపయోగిస్తే, అటువంటి అవసరం నుండి మినహాయింపు ఉంటుంది," అని ఉత్తర్వులో పేర్కొన్నారు. ఇప్పటికే వినియో గించుకోని పక్షంలో, 10 శాతం సంస్కరణల ఆధారిత కేటాయింపును వెంటనే వినియోగించుకోవాలని ప్రభుత్వం అన్ని రాష్ట్రాలను కోరింది. "దీనితో, వాణిజ్య/ పారిశ్రామిక ఎల్‌పిజి కేటాయింపు 70 శాతానికి (10 శాతం సంస్కరణల ఆధారిత కేటాయింపుతో) పెరుగుతుంది. రాష్ట్రంలోని పారిశ్రామిక కార్యకలాపాలకు ఉపశమనం కలిగిస్తుంది," అని ఉత్తర్వు వివరిస్తుంది. మార్చి 21న జారీ చేసిన మునుపటి అదనపు 20 శాతం కేటాయింపులో, రెస్టారెంట్లు, ధాబాలు, హోటళ్లు, పారిశ్రామిక క్యాంటీన్లు, ఆహార ప్రాసెసింగ్/ పాడి పరిశ్రమ, రాష్ట్ర ప్రభుత్వం లేదా స్థానిక సంస్థలచే నడపబడే రాయితీ క్యాంటీన్లు/ అవుట్‌లెట్లు, కమ్యూనిటీ కిచెన్‌లు, అలాగే వలస కార్మికుల కోసం 5 కేజీల (ఫ్రీ ట్రేడ్ ఎల్‌పిజి) ఎఫ్‌టిఎల్ వంటి రంగాలకు ప్రాధాన్యత ఇచ్చింది. పెట్రోలియం మంత్రిత్వ శాఖ తాజా సమాచారం ప్రకారం, మార్చి 25 నాటికి, 37,000కు పైగా 5 కేజీల ఎఫ్‌టిఎల్ సిలిండర్లను వలస కార్మికులకు విక్రయించారు. ఈ ఎల్‌పిజి సిలిండర్లను రాష్ట్ర ప్రభుత్వాలు, జిల్లా అధికారులు, ప్రాధాన్యతా రంగాలు లేదా వినియోగదారులను బట్టి వారి అంచనా ఆధారంగా పంపిణీ చేస్తారు. ఇదిలా ఉండగా, ఎల్‌పిజిని తీసుకువెళ్లే మరిన్ని భారతీయ నౌకలను హోర్ముజ్ జలసంధి గుండా ప్రయాణిం చడానికి అనుమతిస్తామని ఇరాన్ సూచించింది. ఈ విషయంపై భారత ప్రభుత్వం ఇరాన్ అధికారులతో చర్చలు జరిపిందిజ

## ప్రజాదరణలో ప్రధాని మోడీ

# ప్రపంచంలోనే టాప్



### 68 శాతం ఆమోద రేటింగ్

### ట్రంప్‌కు 39 శాతం మాత్రమే

**న్యూఢిల్లీ, మార్చి 27:** ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ పొందిన నాయకుడిగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మరోసారి రికార్డులకెక్కారు. విశ్వ గురువుగా పేరు నరేంద్రమోడీ రికార్డు సాధించారు. అమెరికన్ డేటా అనలిటిక్స్ సంస్థ మార్నింగ్ కన్సల్ట్ నిర్వహించిన తాజా సర్వే ప్రకారం, ప్రధానమంత్రి మోడీ 68 శాతం అద్భుతమైన ఆమోద రేటింగ్ ను పొందారు. ఈ అఖండ మద్దతుతో ఆయన ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ నాయకులను అధిగమించి ప్రపంచ నాయకుల జాబితాలో అగ్రస్థానంలో తన ఆధిపత్యాన్ని కొనసాగించారు. వరుసగా మూడోసారి అధికారంలో ఉన్నప్పటికీ ఈ అప్రూవల్ రేటింగ్ వెనక్కి తగ్గలేదు. ఇది బలమైన నాయకత్వం, ప్రపంచవ్యాప్తంగా ఆయనకున్న విస్తృత ఆమోదాన్ని స్పష్టంగా ప్రతిబింబిస్తుంది. సర్వే డేటా ప్రకారం కేవలం 26 శాతం మంది మాత్రమే మోడీకు వ్యతిరేకంగా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేయగా, 6 శాతం మందికి ఎటువంటి అభిప్రాయాన్ని తెలుపలేదు. మార్చి 2 నుంచి 8 మధ్య మార్నింగ్ కన్సల్ట్ నిర్వహించిన ఈ సర్వే, ఇతర ప్రపంచ నాయకుల స్థానాన్ని సైతం వెల్లడించింది. స్విట్జర్లాండ్‌కు చెందిన గై పార్మెలిన్, దక్షిణ కొరియాకు చెందిన లీ జేమ్యుంగ్ చెరో 62 శాతం ఆమోద రేటింగ్‌లతో రెండవ స్థానంలో నిలిచారు. వారి తర్వాత చెక్ రిపబ్లిక్‌కు చెందిన ఆండ్రెజ్ బాబిస్ 57 శాతం మద్దతుతో, అర్జెంటీనాకు చెందిన జేవియర్ మెల్లి 56 శాతం మద్దతుతో నిలిచారు. అలాగే జపాన్‌కు చెందిన సనాయ్ టకైచి, కెనడాకు చెందిన మార్క్ కార్నీ చెరో 56 శాతం ఆమోద రేటింగ్‌లను పొందారు. మరోవైపు, పాశ్చాత్య దేశాలలోని అనేక ప్రముఖ నాయకులు చాలా బలహీనమైన స్థితిలో ఉన్నారని ఈ సర్వే చూపిస్తుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ జాబితాలోని టాప్ 10లో కూడా చోటు సంపాదించలేకపోయారు. ట్రంప్‌కు కేవలం 39 శాతం ఆమోదం లభించగా, 55 శాతం మంది ఆయనను వ్యతిరేకించారు. అదే సమయంలో బ్రిటన్ ప్రధాన మంత్రి కీర్ స్టార్మర్‌కు కేవలం 24 శాతం మద్దతు లభించగా, జర్మనీకి చెందిన ఫ్రెడ్రిక్ మెర్జ్‌కు 20 శాతం మద్దతు లభించింది. ఈ జాబితాలో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ అత్యంత పేలవమైన ప్రదర్శన కనబరిచారు. ఆయనకు కేవలం 17 శాతం ఆమోదం, 75 శాతం వ్యతిరేకత నమోదైంది. పూర్తి లిస్ట్ ఈ కింద ఇవ్వబడింది.

# ట్రంప్ సంతకంతో డాలర్ కరెన్సీ నోట్లు!

### అమెరికా కరెన్సీ చరిత్రలోనే తొలిసారి అధ్యక్షుడి సంతకం

**వాషింగ్టన్, మార్చి 27:** అమెరికా చరిత్రలో మునుపెన్నడూ లేని రికార్డుకు అధ్యక్షుడు ట్రంప్ బీజం వేస్తున్నారు. ట్రంప్ సంతకం ఉన్న డాలర్ నోట్లను విడుదల చేస్తామని అమెరికా ట్రెజరీ సెక్రెటరీ స్కాట్ బెసెంట్ తెలిపారు. అధ్యక్ష పదవిలో కొనసాగుతున్న వ్యక్తి సంతకంతో కరెన్సీ నోట్లను ముద్రించడం అమెరికా చరిత్రలో ఇదే తొలిసారి. కొత్తగా ముంద్రించే అమెరికా కరెన్సీ నోట్లపై ట్రంప్ సంతకంతోపాటు ఆ దేశ ట్రెజరీ సెక్రెటరీ స్కాట్ బెసెంట్ సంతకం కూడా ఉండనుంది. ఈ మార్పులతో వచ్చే జూన్‌లో మొదటగా 100 డాలర్ల నోటును విడుదల చేయనున్నట్టు బెసెంట్ తెలిపారు. అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆయన తెలిపారు. ట్రంప్ సంతకంతో డాలర్ నోట్లను విడుదల చేస్తాం. ఈ ఏడాది అమెరికా జరుపుకోనున్న 250వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశ చరిత్రాత్మక విజయాలను స్మరించుకునేందుకు ఇదో అద్భుత మార్గం అని బెసెంట్ చెప్పారు. అమెరికా ట్రెజరర్ బ్రాండెన్ బీచ్ కూడా ఈ కొత్త విధానానికి మద్దతు పలికారు. ట్రంప్ ఈ గౌరవానికి పూర్తిగా అర్హులని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం అమెరికా ట్రెజరర్, ట్రెజరీ సెక్రెటరీల సంతకాలతో కరెన్సీ నోట్లను ముద్రిస్తున్నారు. 1861 నుంచి ఈ విధానం కొనసాగుతోంది. ఇక ఈ ఏడాది జూలై 4న అమెరికా 250వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ట్రంప్ చిత్రం ఉన్న 24 క్యారెట్ల బంగారు నాణేన్ని కూడా విడుదల చేయనున్నారు. ఈ ప్రతిపాదనకు గత నెలలోనే ఫెడరల్ ఆర్ట్స్ కమిషన్ ఆమోదం తెలిపింది.

# మంటల్లో పశ్చిమాసియా

## ఇరాన్ మిసైల్ మ్యాన్ హసన్ తెహ్రానీ మొఘద్దం!



**టెహ్రాన్, మార్చి 27:** శక్తివంతమైన అమెరికాతో గత నాలుగు వారాలుగా ఇరాన్ సాగిస్తున్న పోరు ప్రపంచాన్ని విస్మయానికి గురిచేస్తోంది. తాము యుద్ధాన్ని ప్రారంభించలేదని, కానీ ఆపే ప్రసక్తే లేదని ఇరాన్ తేల్చి చెబుతోంది. అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ క్షిపణులు అత్యంత కచ్చితత్వంతో విరుచుకుపడుతున్నాయి. అసలు అంతర్జాతీయ ఆంక్షలు, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇరాన్ ఇంతటి క్షిపణి వ్యవస్థను ఎలా నిర్మించగలిగిందనేది ఆసక్తిగా మారింది. ఇరాన్ క్షిపణి పితామహుడు హసన్ తెహ్రానీ మొఘద్దం భారతదేశానికి అబ్దుల్ కలాం ఎలాగో, ఇరాన్‌కు హసన్ తెహ్రానీ మొఘద్దం అలా కొనసాగాడు. ఆయన్ను ఇరాన్ ప్రజలు ˘మిస్సైల్ మ్యాన్ అని పిలుస్తారు. 1959లో జన్మించిన మొఘద్దం, 20 ఏళ్ల వయసులో ఇరాన్ ఇస్లామిక్ విప్లవం తర్వాత రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ లో చేరారు. 1980లో ఇరాక్ దాడులు చేసినప్పుడు ఇరాన్ వద్ద సుదూర లక్ష్యాలను ఛేదించే క్షిపణులు లేవు. ఆ లోటును భర్తీ చేయడమే లక్ష్యంగా మొఘద్దం తన ప్రయాణాన్ని ప్రారంభించారు. అంతర్జాతీయ ఆంక్షల వల్ల బయట దేశాల నుంచి టెక్నాలజీ రావడం కష్టమని గ్రహించిన మొఘద్దం, స్వదేశీ మంత్రాన్ని జపించారు. స్థానిక ఇంజినీర్లు, శాస్త్రవేత్తలతో ఒక బలమైన బృందాన్ని ఏర్పాటు చేశారు. ఇరాన్ రక్షణ కవచంగా మారిన షాహాబ్ క్షిపణి శ్రేణిని ఆయన నాయకత్వంలోనే అభివృద్ధి చేశారు. సాధారణంగా ఇరాన్ వద్ద 2వేల కి.మీ పరిధి గల క్షిపణులు ఉన్నాయని ప్రపంచం భావిస్తుంది.




## సోషల్ మీడియాలో కెవైసి తప్పనిసరి చేస్తున్న కేంద్రం

**న్యూఢిల్లీ,మార్చి 27:** ఆన్‌లైన్ హాని నుంచి మహిళలు, పిల్లల్ని రక్షించే ఉద్దేశంతో, సోషల్ మీడియాకు కేవైసీ తప్పనిసరి చేయాలని కేంద్రం యోచనచేస్తోంది. మైనర్లపై సోషల్ మీడియా ప్రభావం ఎక్కువ ఉన్నందున బానిసలుగా మారుతున్నవారు ఎక్కువ ఉన్నారు. అందుకే భారతదేశంలోని సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల వినియోగదారులకు నో యువర్ కస్టమర్ ధృవీకరణను తప్పనిసరి చేయాలని ఒక పార్లమెంటరీ ప్యానెల్ సిఫార్సు చేసింది. సైబర్ భద్రతపై మహిళా సాధికారత పార్లమెంటరీ కమిటీ నివేదికలో భాగంగా హోం మంత్రిత్వ శాఖ, సమాచార మరియు ప్రసార మంత్రిత్వ శాఖలకు ఈ ప్రతిపాదనల్ని సమర్పించింది. సోషల్ మీడియా, డేటింగ్ యాప్, గేమింగ్ ప్లాట్‌ఫారమ్స్ లలో కేవైసీ ఆధారిత గుర్తింపు, వయసు ధ్రువీకరణ వ్యవస్థ ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చింది. వినియోగదారుల్ని గుర్తింపు వ్యవస్థలను ఏర్పాటు చేయాలని కమిటీ పిలుపునిచ్చింది. వినియోగదారులను గుర్తించగలగడం,మైనర్లను ఆన్‌లైన్‌లో సురక్షితంగా ఉంచడం ద్వారా దుర్వినియోగాన్ని అరికట్టడమే దీని లక్ష్యం. కేవైసీ తప్పనిసరి చేయడం వల్ల నకిలీ ప్రొఫైల్స్, వేధింపులు, సైబర్ స్టాకింగ్ ఎదుర్కోవడంలో సహాయపడుతుంది. డేటింగ్, గేమింగ్ యాప్‌ల కోసం కఠినమైన లైసెన్సింగ్ నిబంధనల్ని, వయసు నిర్ధారణ ప్రక్రియ చేపట్టాలని ప్యానెల్ సూచించింది. నిబంధనలు పాటించని ప్లాట్‌ఫారమ్స్‌పై చర్యలు, భారీగా జరిమానా విధించాలని ప్రతిపాదించింది. ఈ సిఫారసుల ద్వారా డిజిటల్ ప్లాట్‌ఫారమ్స్‌ను సురక్షితంగా మార్చడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే యూజర్స్ డేటా, గోప్యతను దెబ్బతీసే అవకాశం ఉందనే ఆందోళనలు ఉన్నాయి.

# నేపాల్ ప్రధానిగా బాలేన్‌షా ప్రమాణం



**ఖాట్మండు, మార్చి 27:** నేపాల్ నూతన ప్రధానిగా రాష్ట్రీయ స్వతంత్ర పార్టీ (ఆర్‌ఎస్‌పీ) పార్లమెంటరీ పార్టీ నేత బాలెన్ షా శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 76(1) ప్రకారం బాలెన్ షాను ఆ పదవిలో నియమించినట్లు నేపాల్ అధ్యక్షుడు రామ్ చంద్ర పౌడెల్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఆర్‌ఎస్‌పీ దాదాపు మూడింట రెండొంతుల మెజారిటీతో ప్రభంజనం సృష్టించిన విషయం తెలిసిందే. పార్లమెంటరీ పార్టీ సమావేశంలో బాలెన్ షాను తమ పార్లమెంటరీ పార్టీ నేతగా ఆర్‌ఎస్‌పీ ఎన్నుకుంది. దీంతో ఆయన దేశ 47వ ప్రధాని అయ్యేందుకు మార్గం సుగమమైంది. కేవలం 35 ఏళ్ల వయసున్న బాలెన్, నేపాల్ చరిత్రలోనే అత్యంత పిన్న వయస్కులైన ప్రధానులలో ఒకరిగా నిలిచారు. ఈ ఎన్నికల్లో గెలిచిన అధిక శాతం చట్టసభ సభ్యులు యువతరం వారే కావడం నేపాల్ రాజకీయాల్లో తరాల మార్పునకు సంకేతంగా నిలుస్తోంది. గత ఏడాది డిసెంబర్ 28న జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించిన బాలెన్, యువతలో విపరీతమైన ఆదరణ పొందారు. మార్చి 5న జరిగిన ఎన్నికల్లో, ఆర్‌ఎస్‌పీ ఆయనను ప్రధాని అభ్యర్థిగా ప్రకటించి ప్రచారం చేయగా, 275 స్థానాలున్న ప్రతినిధుల సభలో 182 సీట్లు గెలుచుకుని సంచలనం సృష్టించింది. తూర్పు నేపాల్‌లోని ఝాపా5 నియోజకవర్గంలో మాజీ ప్రధాని కేపీ శర్మ ఓలీపై బాలెన్ షా భారీ మెజారిటీతో గెలు పొందారు. ఓలీకి 18, 734 ఓట్లు రాగా, షాకు 68, 348 ఓట్లు లభించాయి. 1991 తర్వాత నేపాల్ పార్లమెంట్ ఎన్నికల చరిత్రలో ఒక అభ్యర్థికి లభించిన అత్యధిక ఓట్లు ఇవే కావడం విశేషం. బాలెన్ షా 2022లో ఖాట్మండు మేయర్ పదవికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొంది రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. 1990 ఏప్రిల్ 27న ఖాట్మండులో జన్మించిన ఆయన, భారత్‌లోని విశ్వేశ్వరయ్య టెక్నలాజికల్ యూనివర్సిటీ నుంచి స్ట్రక్చరల్ ఇంజినీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ పొందారు. తన హుషారైన ర్యాప్ గీతాలతో యువతలో పాప్యులారిటీ సంపాదించు కున్నారు. ప్రధానిమోడీ అభినందనలు.. నేపాల్ నూతన ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ప్రముఖ ర్యాప్ గాయకుడు బాలెన్ షాకు (బాలేంద్ర షా) భారత ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఇరు దేశాల మధ్య స్నేహబంధాన్ని మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లేందుకు ఆయనతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. ఈ మేరకు మోదీ తన సందేశాన్ని పంచుకున్నారు. నేపాల్ ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన బాలెన్ షాకు హృదయపూర్వక అభినందనలు. మీ నాయకత్వంపై నేపాల్ ప్రజలు ఉంచిన నమ్మకానికి ఈ నియామకం నిదర్శనం. ఇరు దేశాల ప్రజల ప్రయోజనాల కోసం భారత్, నేపాల్ స్నేహాన్ని, మరింత ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లేందుకు ఎదురుచూస్తున్నానని మోదీ పేర్కొన్నారు.

# ఇరాన్‌లో 1,900 దాటిన మృతులు

**టెహ్రాన్, మార్చి 27:** పశ్చిమసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో మృతుల సంఖ్య పెరుగుతోంది. ఇజ్రాయెల్-అమెరికా దాడుల్లో ఇప్పటివరకు 1,900 మందికిపైగా ప్రజలు మరణించినట్లు ఆ దేశ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇరాన్ చేసిన ప్రతీకార దాడుల్లో ఇజ్రాయెల్‌లో 18 మంది, గల్ఫ్‌లో 20 మంది మృతి చెందారు. 13 మంది అమెరికన్ సైనికులు కూడా మృతి చెందినట్లు తెలుస్తోంది. మరోవైపు లెబనాన్‌పై ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో 1,100 మందికిపైగా మరణించారని అక్కడి అధికారులు తెలిపారు. ఇరాక్‌లో మరో 80 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇజ్రాయెల్-అమెరికా దాడులను ఖండిస్తూ.. టెహ్రాన్‌కు సంఘీభావం తెలిపిన దేశాలకు ఇరాన్ వినూత్నంగా కృతజ్ఞతలు చెప్పింది. క్షిపణిపై 'భారత ప్రజలకు కృతజ్ఞతలు' అనే సందేశాన్ని రాసి ఇజ్రాయెల్‌పై ప్రయోగించింది. స్పెయిన్, జర్మనీ వంటి ఇతర దేశాలకు కూడా టెహ్రాన్ కృతజ్ఞతలు చెప్పింది. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో షేర్ చేయడంతో వైరల్‌గా మారాయి. గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు: ఇజ్రాయెల్ సహా గల్ఫ్ దేశాలలోని అమెరికా స్థావరాలను లక్ష్యంగా చేసుకొని.. దీర్ఘ, మధ్యశ్రేణి క్షిపణుల దాడుల చేసినట్లు ఐఆర్‌జిసి వెల్లడించింది. ఈ దాడుల్లో బహ్రెయిన్‌లోని అమెరికా పేట్రియాట్ వైమానిక రక్షణ వ్యవస్థ నిర్వహణ కేంద్రం ధ్వంసమైనట్లు తెలిపింది. యుద్ధం మొదటి రోజు మినాబ్‌లోని ఓ పాఠశాలపై జరిగిన దాడి అమెరికా ప్రణాళిక ప్రకారమే చేసిందని ఇరాన్ విదేశాంగ మంత్రి ఆరోపించారు. ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల మండలికి పంపిన విడియో ప్రసంగంలో ఆయన మాట్లాడుతూ.. ఈ ఘటనలో 160 మందికిపైగా చిన్నారులు, 14 మంది టీచర్లు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

# నాడు కెబిసిలో రూ.50 లక్షల విజేత

### రూ.2.5కోట్ల కుంభకోణంలో అరెస్టు అయిన తహసీల్దార్!



**భోపాల్, మార్చి 27:** కౌన్‌బనేగా కరోడ్‌పతిలో రూ.50 లక్షలు గెలుచుకున్న మధ్యప్రదేశ్ మహిళా తహసీల్దార్ రూ.2.5 కోట్ల వరద సహాయ నిధుల స్కామ్‌లో అరెస్ట్ అయ్యింది. బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో ఈ సంఘటన జరిగింది. 2021లో షియోపూర్ జిల్లాలోని బరోడా తహసీల్దార్‌గా అమితా సింగ్ తోమర్ పని చేశారు. ఈ సమయంలో కొంత మంది రెవెన్యూ అధికారులతో కలిసి భారీ స్కామ్‌కు ఆమెకు పాల్పడింది. సుమారు రూ.2.5 కోట్ల వరద సహాయ నిధులను నకిలీ బ్యాంకు ఖాతాలకు బదిలీ చేసి కొల్లగొట్టినట్లు ఆరోపణలు వచ్చాయి. ఉన్నతాధికారుల ఫిర్యాదుతో బరోడా సబ్ డివిజనల్ పోలీస్ అధికారి (ఎస్‌డీవోపీ) అవనీత్ శర్మ నేతృత్వంలోని బృందం ఈ కుంభకోణంపై దర్యాప్తు చేసింది. ప్రస్తుతం విజయపూర్ తహసీల్దార్‌గా ఉన్న అమితా సింగ్ తోమర్, 22 మంది రెవెన్యూ అధికారులతో సహా మొత్తం 110 మందిపై కేసు నమోదు చేశారు. మరోవైపు కేసు నమోదు నేపథ్యంలో అమితా సింగ్ తోమర్ గత కొన్ని రోజులుగా విధులకు హాజరుకావడం లేదు. ముందస్తు బెయిల్ కోసం హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించగా ఆమె పిటిషన్లను న్యాయస్థానాలు తిరస్కరించాయి. బుధవారం ఆమెపై కలెక్టర్ చర్యలు చేపట్టారు. తహసీల్దార్ పదవి నుంచి తొలగించారు. అదృశ్యమైన అమితా సింగ్ కోసం పోలీస్ బృందాలు గాలింపు ముమ్మరంచేసాయి. మొబైల్ సిగ్నల్స్ ద్వారా గ్వాలియర్‌లోని నివాసంలో ఆమె ఉన్నట్లు తెలుసుకుని గురువారం అరెస్ట్ చేశారు. కోర్టులో హాజరుపరిచిన తర్వాత పొరుగున ఉన్న శివపురి జైలుకు అమితా సింగ్‌ను తరలించినట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

# అమెరికా సైనికులకు ఆశ్రయం ఇస్తున్న హోటళ్లపైనా దాడులుచేస్తాం

### హెచ్చరికలు జారీ చేసిన ఇరాన్

**టెహ్రాన్, మార్చి 27:** అమెరికా యుద్ధానికి విరామం ఇస్తున్నట్లు ప్రకటించి, ఇరాన్ మాత్రం తగ్గడం లేదు. పశ్చిమాసియా దేశాలకు ఇరాన్ గట్టి అల్టిమేటం ఇచ్చింది. అమెరికా సైనికులు బస చేస్తున్న హోటళ్లను లక్ష్యంగా చేసుకుంటూ దాడులు చేస్తామని హెచ్చరించింది. గల్ఫ్ ప్రాంతంలో ఉన్న యూఎస్ సైనికులు తమ స్థావరాలను వదిలేసి హోటళ్లలో ఆశ్రయం తీసుకుంటున్నారని, అమెరికన్లకు ఆశ్రయం ఇచ్చే హోటళ్లను అమెరికా ఆస్తులుగానే పరిగణిస్తామని హెచ్చరించింది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి, గల్ఫ్ దేశాల ప్రజలను అమెరికా సైనికులు మానవ కవచాలుగా వాడుకుంటున్నారని ఆరోపించారు. యూఎస్ సైనికులకు బుకింగ్స్ ఇవ్వొద్దని యూఏఈ, బహ్రెయిన్ హోటళ్లకు ఇరాన్ తీవ్ర హెచ్చరిక చేసింది. మేం చేతులు కట్టుకుని కూర్చోలేమని ఇరాన్ సాయుధ దళాల ప్రతినిధి అబోల్ఫజల్ షెకార్చి అన్నారు. మేం ఊరికే కూర్చుని, అమెరికన్లు మాపై దాడి చేయడానికి అనుమతించాలా అని ప్రశ్నించారు. అమెరికా దళాలు ఉన్న హోటళ్లను, కార్యాలయాలను టార్గెట్ చేస్తామని స్పష్టం చేశారు. సిరియా, లెబనాన్, డిజిబౌటీ దేశాలకు కూడా ఇరాన్ హెచ్చరికలు జారీ చేసింది.

# అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణోత్సవం



## శ్రీకాళహస్తిలో...

శ్రీకాళహస్తి, మార్చి 27 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న పట్టాబి రామమందిరంలో శ్రీరామనవమి సందర్భంగా శుక్రవారం 'సీతారాముల కళ్యాణం' అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ హాజరై సంకల్పం చేసుకున్నారు. ట్రస్టుబోర్డు సభ్యులు, భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. వచ్చిన భక్తులు ఇబ్బందులు పడకుండా ఇఓ వెంకటేశులు, ఇఇ శ్రీనివాసులురెడ్డి, ఎఇఓ మోహన్, విద్యాసాగర్‌రెడ్డి, హేమామాలిని పర్యవేక్షించారు. ఆలయ అర్చకులు శ్రీనివాసమూర్తి పర్యవేక్షణలో పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. దూరంగా కూర్చొన్న జనం వీక్షించుటకు ప్రత్యేక టివిలు ఏర్పాటు చేసారు. ఎండలు మండుతుండగా హాజరైన భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చలువ పందిళ్ళతో పాటు మంచినీటి సదుపాయం, గాలివీచే లా ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. వేద పండితులు వేద మంత్రాల్ని పఠిస్తుండగా ప్రత్యేక వ్యాఖ్యాత సీతారాముల కళ్యాణానికి సంబంధించి భక్తులకు వివరిస్తుండగా భక్తులు తన్మయత్వంలో మునిగిపోయారు. కల్యాణ వేదికపై ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి దంపతులు, ఇఓ బికె వెంకటేశు దంపతులు ఆశీనులు కాగా సంప్రదాయబద్ధంగా జరిగిన వివాహానికి విశేషంగా భక్తులు హాజరయ్యారు. అనంతరం స్వామి అమ్మవార్ల తలంబ్రాలు, తీర్థ ప్రసాదాలు భక్తులకు వితరణ గావించారు. ఈ కార్యక్రమాల్లో ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయాధికారులు పాల్గొన్నారు.

## రామతీర్థంలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు





నెల్లిమర్ల (విజయనగరం జిల్లా), మార్చి 27 ప్రభాతవార్త: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం రామస్వామి వారి దేవస్థానం వద్ద శుక్రవారం శ్రీరామ నవమి వేడుకలను పురస్కరించుకొని సీతారాముల కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. దేవస్థానం వెలుపల నిర్మించిన ప్రత్యేక వేదికపై అర్చకులు, వేద పండితులు వేలాది మంది భక్తుల సాక్షిగా సీతారాముల కల్యాణం ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీరామ నామస్మరణతో ఆ ప్రాంతం మారుమ్రోగింది. అర్చకుల వేద మంత్రాల మధ్య జరిగిన ఈ కల్యాణోత్సవాన్ని ప్రముఖులతో పాటు వేలాది భక్తులు తిలకించి తరించి తన్మయత్వం చెందారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సాంప్రదాయంగా తీసుకువచ్చి అర్చకులకు అందజేశారు. అలాగే నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, ప్రసాద్ దంపతులు కూడా పట్టు వస్త్రాలను, మంచి ముత్యాలను వేదిక వద్ద అర్చకులకు అందజేశారు. శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ దంపతులు, ఎమ్మెల్సీ డాక్టర్ పి.వి.సూర్యనారాయణ రాజు (సురేష్ బాబు) కూడా స్వామివారికి పట్టువస్త్రాలను, ముత్యాలను సమర్పించారు. సింహాచలం దేవస్థానం నుంచి ఆ దేవస్థానం ఈవో డి.వెంకటరావు పట్టు వస్త్రాలను సమర్పించారు. సుమారు మూడున్నర గంటలసేపు జరిగిన కల్యాణోత్సవంలో పలు ఘట్టాలు భక్తులను కనువిందు చేసాయి. మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో పాటు, ఎమ్మెల్యే లోకో నాగ మాధవి, ఎపి మార్కెట్ చైర్మన్ కర్రోతు బంగార్రాజుతో పాటు పలువురు కూటమి పార్టీల నాయకులు, అధికారులు, భక్తులు కల్యాణోత్సవ వేదిక ఎదురుగా కూర్చుని ఆద్యంతం తిలకించారు. కల్యాణోత్సవాన్ని దేవస్థానం ప్రధాన అర్చకులు ఖండవిల్లి సాయి రామాచార్యులు, గొడవర్తి నరసింహాచార్యులు, పానంగపల్లి ప్రసాద్, సుదర్శనం పవన్ కుమార్ తదితరులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణోత్సవం అనంతరం ప్రముఖులు వేదిక వద్దే సీతారాములను దర్శించుకుని అర్చకుల నుంచి



ఆశీర్వాదం పొందారు. అలాగే ముత్యాల తలంబ్రాలను అందుకున్నారు. దేవస్థానం ఇఓ వై.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కళ్యాణోత్సవం విజయవంతంగా ముగిసింది. కల్యాణోత్సవం అనంతరం ఉత్సవ విగ్రహాలను భారీ పోలీస్ బందోబస్తు మధ్య ప్రధాన ఆలయానికి తరలించారు. కల్యాణోత్సవ వేదిక వద్ద కళ్యాణానికి ముందు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.



వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో శ్రీరామ నవమి పర్వదిన వేడుకల్లో సజ్జల, కోన తదితరులు

## వైసిపి కేంద్ర కార్యాలయంలో...

విజయవాడ, మార్చి 27 ప్రభాతవార్త ప్రతినిధి: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో శ్రీరామ నవమి పర్వదిన వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు వైయస్సార్ సిపి స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఇంకా ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, కల్పలతా రెడ్డి, మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి, మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, తదితరులు హాజరయ్యారు. శ్రీ సీతారాముల కల్యాణం, పూజా కార్యక్రమాల అనంతరం కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో నేతలు పాల్గొని భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేశారు. పానకం, వడపప్పు వంటి ప్రసాదాలను కూడా పార్టీ నేతలు భక్తులతో పంచుకున్నారు.





అనంతపురంలో శ్రీరామ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక ఆకర్షణగా అయోధ్యరాముడు, బైక్ ర్యాలీ

## శ్రీరామస్మరణతో ప్రతిధ్వనించిన అనంత నగర వీధులు

అనంతపురం (వైద్యం), మార్చి 27 ప్రభాతవార్త: జై శ్రీరామ్ అంటూ వేలాదిగా తరలి వచ్చిన యువకుల శ్రీరామ శరణు ఘోష అనంతపుర వీధులలో ప్రతిధ్వనించింది. కాషాయ ధ్వజాలను చేతబూని హిందు సంస్థల ప్రతినిధులు శుక్రవారం నగర వీధుల్లో కదం తొక్కుతూ నిర్వహించిన బైక్ ర్యాలీ శ్రీరామ నవమి వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శ్రీరామ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సర్వాంగ సుందరంగా అయోధ్య రాముడి ప్రతిమలతో ముస్తాబైన వాహనాలతో భారీ ఎత్తున ర్యాలీ జరిగింది. నగర వీధుల్లో కులమతాలకతీతంగా అధిక సంఖ్యలో బైకులు, ఇతర వాహనాలు నగరమంతటా ఆనందోత్సాహాలతో హిందుత్వ నినాదాలు చేస్తూ అందరిలో హుషారెక్కించారు.

రాముడే జాతికి ఆదర్శం: అంతకు ముందు హిందూ" ఐక్యతే లక్ష్యంగా సాగిన ర్యాలీని స్థానిక కొత్తూరు జూనియర్ కాలేజ్ వద్ద ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆధ్యాత్మిక ప్రచారకుడు రాధామనోహరదాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆత్మీయ అతిథులుగా విచ్చేసిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ శ్రీరామనవమి సందర్భంగా బైక్ ర్యాలీ ఏర్పాటు చేసిన నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు, ఎంఎస్ రాజు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు నిలువెత్తు దర్పణమైన శ్రీరామ నవమి పడుకలు అందరిలో ఐక్యతను తెచ్చి పటిష్ట భారతదేశాన్ని నిర్మించాలని ఆకాంక్షించారు. శ్రీరాముడే హైందవజాతికి ఆదర్శపురుషుడని రామాయణ ప్రాశస్త్యాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆహూడా చైర్మన్ వరుణ్. వీరశైవజంగమ కార్పోరేషన్ చైర్మన్ స్వప్నశంకర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ వడ్డే వెంకట్, రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ పత్తి చంద్రశేఖర్, బిజెపి జిల్లా అధ్యక్షుడు కొనకండ్ల రాజేష్, ఉత్సవ కమిటీ కన్వీనర్ దూపకుంట్ల శబరీ వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి పరచూరి భవాని రవికుమార్, కోశాధికారి హితేన్ జైన్, ఉపాధ్యక్షులు గల్లా హర్ష, తదితరులు పాల్గొన్నారు.

## ఇంద్రకీలాద్రిపై వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

### చూడముచ్చటగా శ్రీ సీతారాముల కల్యాణోత్సవం





ఇంద్రకీలాద్రి, మార్చి 27 ప్రభాతవార్త: శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వారి దేవస్థానం ఇంద్రకీలాద్రిపై శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు అభిజిత్ లగ్నంలో శ్రీ సీతారాముల కల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక కళావేదికపై జరిగిన శ్రీ సీతారాముల కల్యాణోత్సవంలో ఆలయ ఇఓ శీనా నాయక్ దంపతులు, స్థానాచార్య విష్ణుభట్ల శివప్రసాద్ శర్మ దంపతులు పాల్గొని పట్టువస్త్రాలు సమర్పించారు. అర్చకులు కోట ప్రసాద్, ఆర్. శ్రీనివాసశాస్త్రి, వేద పండితుల బృందం కల్యాణ క్రతువును జరిపించారు.

**దుర్గమ్మవారికి వైభవంగా పుష్పార్చన:** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో వసంతోత్సవ పుష్పార్చనలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలకు శనివారం నాడు పూర్ణాహుతితో స్వస్తివచనం పలకనున్నారు. తొమ్మిదవ రోజైన శుక్రవారం అమ్మవారికి లిల్లీలు, తులసి దళాలు, నీలి తామరలు మరియు తెలుపు, పసుపు వర్ణాల చామంతి, ఎర్ర గులాబీలు, కనకాంబరాలు, మల్లెపువ్వులతో శోభాయమానంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఇఓ వికె శీనా నాయక్, పాలక మండలి సభ్యులు పాల్గొని శ్రీ అమ్మవారిని సేవించడానికి కావాల్సిన పుష్పాలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. శనివారం ఉదయం 9 గంటలకు నవరాత్రుల పూర్ణా హుతి, ఉదయం 11 గంటలకు శ్రీరాములవారి పట్టాభిషేకం మహోత్సవం నిర్వహించనున్నామని, భక్తులు విశేషంగా పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఇఓ తెలిపారు.

**నిత్య అన్నదానమునకు విరాళం:** దుర్గమ్మవారి ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన శివరామ ప్రసాద్, రమాదేవి దంపతులు రూ. 1,01,116లు, విజయవాడకు చెందిన డా రాజీవ్, ప్రశాంతి దంపతులు రూ.1,00,000 విరాళంగా ఆలయ అధికారులకు విరాళముగా అందించినారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాటు చేసిన అనంతరం దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

**శ్రీరాముని ధర్మానికి దుర్గమ్మ వారి శక్తి కారణం:** సకలగుణాభిరాముని ధర్మనిరతికి దుర్గమ్మవారి శక్తి ప్రధాన కారణమంటూ ప్రముఖ భాషా ప్రవీణ, సంస్కృత భాషా ప్రచారకులు మైలవరపు లక్ష్మీనరసింహం ప్రవచించారు. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న వసంత నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని, శ్రీరామనవమి పర్వదినాన శుక్రవారం సాయంత్రం రాజగోపురం వద్ద ఉన్న కళావేదికపై ప్రత్యేక ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన "త్రిశక్తి వైభవం", "శ్రీరామనవమి విశిష్టత" గురించి భక్తులకు వివరించారు. దుర్గామల్లేశ్వరుల సన్నిధిలో రామకథను వినడం భక్తులకు కనువిందుగా నిలిచింది. అమ్మవారి శక్తికి, రాముని ధర్మానికి ఉన్న అవినాభావ సంబంధాన్ని వారు తమ ప్రసంగంలో చక్కగా విశ్లేషించారు. కార్యక్రమం అనంతరం ఆలయ చైర్మన్, ఇఓ శీనా నాయక్‌లు లక్ష్మీనరసింహంను శాలువాతో ఘనంగా సత్కరించి, అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు.

**దుర్గమ్మను దర్శించుకున్న తాప్సీ ఉపాధ్యాయ:** బెజవాడ దుర్గమ్మవారిని ఒబెసిటీ ముక్త్ భారత్ మిషన్ హెల్దీ భారత్ లక్ష్యంతో దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక చింతనతో పాటు ఆరోగ్యవంతమైన సమాజ స్థాపన కోసం "ఒబెసిటీ ముక్త్ భారత్ మిషన్ హెల్దీ భారత్" నినాదంతో రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్‌పై భారత్ యాత్ర చేస్తున్న యువ బైకర్ తాప్సీ ఉపాధ్యాయ దర్శించుకున్నారు. తన యాత్రలో భాగంగా దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను సందర్శిస్తూ, ఆధ్యాత్మికతతో పాటు సామాజిక స్పృహను పెంపొందించడం తన లక్ష్యమని తాప్సీ తెలిపారు.



## పెంచలకోనలో...

### రామావతారంలో స్వర్ణ హనుమంత వాహనంపై శ్రీవారు

రాపూరు (నెల్లూరు), మార్చి 27 ప్రభాతవార్త: నెల్లూరు జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామి వారి సన్నిధిలో శ్రీరామనవమి పర్వదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 8.30లకు శ్రీ సీతారామ లక్ష్మణులకు పలురకాలైన పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలు, పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచదార వంటి పంచామృతాలతో ప్రత్యేకంగా స్నపన తిరుమంజనం (అభిషేకం) నిర్వహించారు. అనంతరం ఉదయం 10.30లకు స్వామి వారి కల్యాణం ఆలయ వేదపండితుల వేదమంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా నిర్వహించారు. తదుపరి సాయంత్రం 6 గంటలకు శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహ స్వామి వారిని రామాలంకరణలో బంగారు హనుమంత వాహనంపై వుంచి వైభవంగా కోనలో క్షేత్రోత్సవం నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసులరెడ్డి, ఆలయ సూపరింటెండెంట్ పాలవల్లి లక్ష్మీనారాయణ, ఎఇ వినోద్, పులగల నరసింహ, వెంకట సుబ్బయ్య, పెంచల స్వామి, కొండలరావు, హరీష్, తదితర అధికారులు, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.



## మానవత్వం చాటుకున్న మంత్రి నారాయణ

### - కూలిపోయిన ఇంటిని అతి తక్కువ కాలంలోనే పునర్నిర్మించి ఇచ్చిన మంత్రి

నెల్లూరు, మార్చి 27, ప్రభాతవార్త-వైద్యం: మంత్రి నారాయణ మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. ప్రమాదంలో కూలిపోయిన ఇంటిని సొంత నిధులతో పునర్నిర్మించి ఇచ్చి పేద మైనారిటీ కుటుంబానికి అండగా నిలిచారు. మానవత్వాన్ని చాటుకున్నారు. నెల్లూరు నగరంలోని 53వ డివిజన్ వారధి సెంటర్ వద్ద గతనెలలో ప్రమాదవశాత్తు డ్రైనేజీ ట్యాంకర్ ఢీకొని ఇల్లు కోల్పోయిన మోలాలి కుటుంబానికి మంత్రి అండగా నిలిచారు. నెల రోజుల్లోనే కొత్త ఇంటిని నిర్మించి శుక్రవారం గృహప్రవేశం చేయించారు. మంత్రి నారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన పి4 ద్వారా సమాజంలో ఉన్నత స్థాయిలో ఉన్న 10 శాతం మంది అట్టడుగున ఉన్న 20 శాతం మందిని ఆదుకోవాలని పిలుపునిచ్చారు. పేదరికం నుండి విముక్తి పొందాలంటే నాణ్యమైన విద్యే మార్గమని, అందుకే నెల్లూరులోని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయి కంటే మిన్నగా తీర్చిదిద్దుతున్నామని ఆయన స్పష్టం చేశారు. నిరుపేద కుటుంబాలకు అండగా నిలవడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ మానవత్వం ఉన్న గొప్ప నాయకుడు మంత్రి నారాయణ అని, ఆయన మాట ఇస్తే తప్పరని కొనియాడారు. నెల రోజుల క్రితం 53వ డివిజన్ వారధి సెంటర్ షుగర్ ఫ్యాక్టరీ ప్రాంతంలో లారీ దూసుకెళ్లి ఇల్లు కోల్పోయిన పేద ముస్లిం మైనారిటీ కుటుంబానికి, మంత్రి తన సొంత నిధులతో కేవలం నెల రోజుల్లోనే పక్కా ఇల్లు నిర్మించి ఇచ్చి తన దాతృత్వాన్ని చాటుకున్నారని తెలిపారు. రాజకీయాల్లో ఇలాంటి నిబద్ధత గల నాయకులు అరుదుగా ఉంటారని, ఆపదలో ఉన్న పేదవాడికి నీడ కల్పించిన మంత్రి నారాయణని నెల్లూరు ప్రజలందరూ ఆశీర్వదించాలని రూప్ కుమార్ యాదవ్ విజ్ఞప్తి చేశారు. కమిషనర్ నందన్, మేయర్ సుజాత అశోక్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షురాలు విజేతా రెడ్డి, నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, టిడిపి పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు కపిర రేవతి, స్థానిక టిడిపి ముఖ్య నేతలు, తదితరులు పాల్గొన్నారు.

### బాలికకు ఇన్‌స్టాలో వేధింపులు...

## పోక్సో, కిడ్నాప్ కేసు నమోదు



విజయవాడ, మార్చి 27 ప్రభాతవార్త ప్రతినిధి: ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం కోణమాత్కూరు గ్రామానికి చెందిన 16 ఏళ్ల మైనర్ బాలికకు కడప జిల్లా నందలూరు రాజ్‌కుమార్‌తో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచడం ఏర్పడింది. అనంతరం ఆమె ప్రేమించమని ఒత్తిడి చేస్తూ ఫొటోలు మార్ఫింగ్ చేస్తానని బెదిరిస్తూ వేధింపులకు పాల్పడినట్లు సమాచారం. ఈ ఘటనపై బాధితురాలి కుటుంబ సభ్యులు నందిగామ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు రాజ్‌కుమార్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇక ఈ నెల 15వ తేదీన మైనర్ బాలికను మాయమాటలు చెప్పి నందిగామ నుండి బైక్‌పై తీసుకెళ్లాడు రాజ్‌కుమార్. బాలిక కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు నందిగామ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాలిక తనతోపాటు తీసుకెళ్లిన ట్యాబ్ ద్వారా లొకేషన్ ఆధారంగా పోలీసులు రాజంపేట సమీపంలోని చిట్వేల్ వద్ద ఉన్నట్లు గుర్తించారు. దీంతో బాలిక బంధువులు వెళ్లి రాజ్ కుమార్‌ను, బాలికను తీసుకుని నందిగామ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. అనంతరం పోలీసులు రాజ్‌కుమార్ తల్లిదండ్రులను పిలిపించి అతన్ని పంపించినట్లు సమాచారం.

కానీ, ఇటీవల మళ్లీ రెండు రోజులుగా రాజ్‌కుమార్ బాలికకు ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడుతూ, ఫొటోలు మార్ఫింగ్ చేస్తానని హెచ్చరిస్తున్నట్లు బాలిక తండ్రి మరోసారి ఫిర్యాదు చేశారు. దాంతో అతనిపై పోక్సో, కిడ్నాప్ కేసు పోలీసులు నమోదు చేసారు.

## అధిరా అప్పా బ్రాండ్ అంబాసిడర్లుగా శృతిహాసన్, మురళి శర్మ

విజయవాడ, మార్చి 27 ప్రభాతవార్త ప్రతినిధి: భరణీయత, ప్రామాణికత అనే తాత్వికత ఆధారంగా నిర్మితమై, ఇబిజి గ్రూప్‌లో భాగమైన అధిర, అప్పా కాఫీ, ప్రముఖ నటులు శృతిహాసన్, మురళీ శర్మలను తన బ్రాండ్ అంబాసిడర్లుగా నియమించుకుంది. భరణీయత, సాంప్రదాయంలో వేళ్ళూనుకుని వుంటూనే, రూపుదిద్దు కుంటున్న క్యుఎస్ఆర్, పానీయాల రంగంలో దేశవ్యాప్తంగా విస్తరించాలని ఈ గ్రూప్ చూస్తోంది. అసలు సిసలైన దక్షిణ భారత ఫిల్టర్ కాఫీని దేశవ్యాప్తంగా అన్ని పట్టణాల్లోనూ అందించాలని, 2027 నాటికల్లా భారతదేశంలో ప్రధాన మెట్రోపాలిటన్, టు టైర్ పట్టణాల్లో 400 అవుట్లెట్లు తెరవాలని ప్రణాళిక వేసుకుంది.

## పైపులు దగ్ధం... కాపలాదారుడి పనే!

### - నిర్ధారణకు వచ్చిన పోలీసులు

విజయవాడ, మార్చి 27 ప్రభాతవార్త ప్రతినిధి: రాజధాని అమరావతిలోని రాయపూడి సమీపంలో పైపులు దగ్ధమైన ఘటనకు కాపలాదారుడే కారణం అని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ఘటనా స్థలంలో పని చేస్తున్న సెక్యూరిటీ గార్డు రాము నిప్పు పెట్టినట్లు తేల్చారు. ఇందుకు కారణాలేంటి? ప్రోత్సహించిన వారెవరైనా ఉన్నారా? అన్న కోణంలో ఆరా తీస్తున్నారు. రాజధాని ప్రాంతంలో వరుసగా 3 అగ్నిప్రమాద ఘటనలు చోటు చేసుకున్నాయి. కోట్ల రూపాయల విలువైన పైపులు ధ్వంసం కావడం వల్ల ఈ వ్యవహారాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. వరుస అగ్ని ప్రమాదాల వెనుక గల కారణాలు అన్వేషించి బాధ్యుల్ని గుర్తించడానికి పోలీసు యంత్రాంగం ప్రత్యేక దర్యాప్తు చేసింది. గుంటూరు అదనపు ఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో 4 బృందాలు పలు కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. ఘటనా స్థలిలో సాక్షులను పోలీసులు విచారించారు. పక్కనే క్యాంపుల్లో ఉంటున్న కార్మికుల వివరాలు సేకరించారు. ఫోన్ కాల్స్ డేటా, అనుమానాస్పద వ్యక్తుల విచారణ ఘటనాస్థలిలో ప్రత్యేక పరిస్థితులు ఏమైనా ఉన్నాయా? వంటి వాటి పై దృష్టి పెట్టారు. క్లూస్ టీం, ఫోరెన్సిక్ బృందం ఇచ్చిన సమాచారాన్ని ఒక బృందం విశ్లేషించింది. పైపులు దగ్ధమైన సమయంలో సెల్ టవర్ సిగ్నల్స్ ఆధారంగా ఆ సమయంలో ఏ ఫోన్ కాల్స్ వెళ్లాయి? ఎంతమంది మాట్లాడుకున్నారు? ఎవరెవరితో సంభాషించారనే విషయాలపై ఆరా తీసి విశ్లేషించారు. అదే సమయంలో ఎవరెవరు ఆ ప్రాంతంలో సంచరించారనే కోణంలో గాలించారు. కొంత సమాచారం సేకరించిన తర్వాతా సెక్యూరిటీ గార్డు రామును ఘటనాస్థలికి తీసుకెళ్లారు. ఆరోజు ఏం జరిగిందన్న అన్న విషయాన్ని అతడ్ని క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. మంటలు ఏ సమయంలో ఎప్పుడు గుర్తించారు? ఏ ప్రాంతంలో గుర్తించారు? తొలుత ఎవరికీ సమాచారం ఇచ్చారు? మంటలు అదుపుచేయడానికి చేసిన ప్రయత్నాలేమిటి? ఎంత సమయంలో మంటలు విస్తరించాయి? వంటి అంశాలపై ప్రశ్నించారు. పైపులకు కాపలాగా ఉన్న సెక్యూరిటీ గార్డు రాము నుంచి వివరాలు సేకరించారు. ఈ క్రమంలో పొంతన లేని సమాధానాలు చెప్పడంతో పోలీసులకు అతనిపై అనుమానం కలిగింది. అతడిని 2 రోజుల పాటు అదుపులోకి తీసుకుని ప్రశ్నించి పలు వివరాలు రాబట్టారు. ఘటనాస్థలిలో ఆధారాలు, సాంకేతిక డేటా విశ్లేషణ, పలు మార్గాల్లో సేకరించిన సమాచారం మేరకు కాపలాదారే నిప్పు పెట్టినట్లు పోలీసులు నిర్ధరణకు వచ్చారు.

సిట్ అధికారి రవికుమార్, తుళ్లూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, సిట్ బృందంతో భేటీ అయ్యి జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అగ్ని ప్రమాద ఘటన దర్యాప్తు పై చర్చించారు. గురువారం ఘటనాస్థలికి సెక్యూరిటీ గార్డు రామును తీసుకెళ్లారు. ఈనెల 23 రాత్రి ఏం జరిగింది అన్న విషయాన్ని మరోసారి సీన్ రీకనస్ట్రక్షన్ చేసి కొన్ని విషయాలు నిర్ధారించుకున్నారు. కాపలాదారుడే నిప్పు పెట్టడానికి కారణాలు ఏంటి? అందుకు ఎవరైనా ప్రోత్సహించారా? దీని వెనుక ఏదైనా కుట్ర దాగి ఉందా? అన్న కోణంలో ఆరా తీస్తున్నారు.

# 'పోలవరం'పై రాజీలేదు

- నిర్దేశిత సమయానికి ప్రాజెక్టు పూర్తి చేయాలి
- ఈ నెలాఖరులోగా డయాఫ్రం వాల్ నిర్మాణం
- అధికారులకు సిఎం చంద్రబాబు కీలక సూచనలు

విజయవాడ, మార్చి 27 ప్రభాతవార్త ప్రతినిధి: పోలవరం నిర్మాణం విషయంలో కేంద్రంతో నిరంతరం అందుబాటులో ఉంటూ సమన్వయం చేసుకోవాలని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు. పోలవరం నిర్మాణానికి సంబంధించిన ప్రతి అప్డేట్ కేంద్రంలోని సంబంధిత వ్యవస్థలకు ఎప్పటికప్పుడు చేర్చాల్సిందేనన్నారు. ప్రమాణాలు, నాణ్యత పాటించే విషయం సహా నివేదికల పరంగా, సాంకేతికాంశాల పరంగా, డాక్యుమెంటేషన్ పరంగా ఎలాంటి లోపాలు ఉండకూడదన్నారు. ఎటువంటి తేడాలు రాకూడదన్నారు.. రాష్ట్రంలో ప్రాధాన్యత క్రమంలో చేపట్టాల్సిన ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణంపై ఆయన జలవనరుల శాఖాధికారులకు కీలక మార్గదర్శనం చేసారు.

వివిధ ప్రాజెక్టులకు చేపట్టాల్సిన పునరావాస పనులపై పలు సూచనలు చేసారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ "పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో కేంద్రం సహా ఎవ్వరూ వేలెత్తి చూపే పరిస్థితి రాకూడదు. పోలవరం ప్రాజెక్టు పరిశీలనకు అంతర్జాతీయ స్థాయి నిపుణులు తరుచూ సందర్శనకు వచ్చేలా చూడాలి. వీలు కాకుంటే వీడియో కాన్ఫరెన్సుల ద్వారానైనా వారి సలహాలను స్వీకరించండి. చారిత్రాత్మక నిర్మాణాలు చేపడుతున్నప్పుడు.. జీవనాడి లాంటి ప్రాజెక్టులను చేపడుతున్నప్పుడు అదే స్థాయిలో జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రాజెక్టుల నిర్మాణంలో ప్రమాణాలు పాటించే విషయంలో చాలా కచ్చితంగా ఉంటాను. రాష్ట్ర ప్రభుత్వం టైం బౌండ్ పెట్టుకుని పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపడుతోందనే విషయాన్ని కేంద్రంలోని అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి. ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణాల్లో నాణత్య పాటించే అంశంపై రాజీ పడే ప్రసక్తే ఉండకూడదు. ప్రాజెక్టుల నిర్మాణాలు చేసే క్రమంలో ప్రజా భద్రత ముఖ్యమనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలి" అని ఆదేశించారు. "రాష్ట్ర ప్రభుత్వం ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణానికి ఎంతో ప్రాధాన్యమిస్తోంది. రకరకాల కారణాలతో రాష్ట్రంలో కొన్ని ఇరిగేషన్ ప్రాజెక్టులు సుదీర్ఘ కాలంపాటు ఎన్నికల హామీలుగా మిగిలిపోతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు శంకుస్థాపనలు చేసిన ప్రాజెక్టులు ఇంకా పూర్తి కాకపోవడం సరికాదు.

ఇలాంటి వాటికి చెక్ పెట్టాలి. ప్రాజెక్టులు కట్టాలనే డిమాండ్లు ఎన్నికల హామీలుగా మిగిలిపోకూడదు. ప్రజల అవసరాలను తీర్చేలా ప్రాజెక్టుల నిర్మాణాలను పూర్తి చేయాలి. అందుకే ప్రణాళికాబద్ధంగా... ప్రాధాన్యతలను సిద్ధం చేసుకుని ప్రాజెక్టుల నిర్మాణం చేపడుతున్నాం. పోలవరం సహా రాయలసీమ, పల్నాడు, ఉత్తరాంధ్ర ప్రాజెక్టులను ఓ క్రమపద్ధతిలో పూర్తి చేసేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకున్నాం. ఇరిగేషన్ రంగానికి గతంలోనూ... ఇప్పుడు పెద్ద పీట వేసి అవి పూర్తి అయ్యేలా చేసింది, చేస్తోంది అన్నారు. కూటమి ప్రభుత్వమే.

ఇదే సమయంలో ప్రాజెక్టుల నిర్మాణాల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడే ప్రసక్తే ఉండకూడదు. ఈ విషయంలో చాలా కఠినంగా వ్యవహరిస్తాను.

ఉన్నతాధికారులు మొదలుకుని.. క్షేత్ర స్థాయిలో ఉన్న సిబ్బంది ఏ ఒక్కరూ అలక్ష్యం వహించినా చర్యలు తీసుకుంటాను. నాణ్యత విషయంలో, ప్రజా భద్రత విషయంలో రాజీ పడకూడదనే ఉద్దేశ్యంతోనే కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించాం."అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

ఇకపై పోలవరం ప్రాజెక్టుపై ప్రతి నెలా సమీక్షిస్తా. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం విషయంలో అధికారులు, కాంట్రాక్టర్లు రిలాక్స్ కావడానికి వీల్లేదు. పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ పనులు మేఘాద్రిగడ్డ వరకు పూర్తి కావాలి. రైట్ మెయిన్ కెనాల్ లో ఇంకా రూ. 200 కోట్ల మేర పనులు పూర్తి చేయాల్సి ఉంది. వీటిని కూడా ఈ సీజన్లో పూర్తి చేయాలి. డయాఫ్రం వాల్ నిర్మాణం ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలి. 41.15 మీటర్ల వరకు నీళ్లను నిలిపేందుకు అవసరమైన నిర్మాణ, పునరావాస పనులు కంప్లీట్ కావాలి. పునరావాసం విషయంలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే... వెంటనే పరిష్కరించుకోవాలి. దీనికి అవసరమైన నిధులు, పరిపాలనా అనుమతుల విషయంలో జాప్యం చేయవద్దు. పునరావాసం విషయంలో నిర్వాసితులతో నిరంతరం సంప్రదింపులు జరిపి సాఫీగా ఆర్ అండ్ ఆర్ పనులు చేపట్టేలా జాగ్రత్తలు తీసుకోవాలి" అని ముఖ్యమంత్రి ఆదేశించారు.

# మిషన్ కర్మయోగిలో ఎపి ఆదర్శం

## జాతీయస్థాయిలో మోడల్‌గా నిలవడం గర్వకారణం: సిఎం చంద్రబాబు



విజయవాడ, మార్చి 27 ప్రభాతవార్త ప్రతినిధి: దేశవ్యాప్తంగా అమలవుతున్న మిషన్ కర్మయోగిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం జాతీయ స్థాయిలో ఆదర్శంగా నిలవడం గర్వకారణంగా ఉందని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. సాంకేతికత ఆధారిత శిక్షణ ద్వారా ప్రభుత్వ ఉద్యోగుల పని తీరు మెరుగు పడుతోందని, తద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతు న్నాయని ప్రశంసించారు. ఐజిఓటిలో ఎపి తరపున కోటికిపైగా కోర్సులు పూర్తి చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు కర్మయోగి భారత్ చేసిన ట్వీట్‌ను ఎక్స్ వేదికగా సిఎం చంద్రబాబు రీట్వీట్ చేశారు. ఈ విజయాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు మరో ముఖ్యమైన కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. ఏప్రిల్ 2 నుంచి 8 వరకు 'సాధన సప్తాహ' జాతీయ లెర్నింగ్ వీక్‌ను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వారం రోజులపాటు అన్ని శాఖల ప్రభుత్వ ఉద్యోగులు చురుకుగా పాల్గొని నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) కోర్సును పూర్తి చేయడం తప్పనిసరి చేయడం జరిగిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ వ్యవస్థను ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా మార్చి ప్రజలకు సమర్థవంతమైన పాలన అందించాలనే లక్ష్యాన్ని కూటమి ప్రభుత్వం పెట్టుకుందని ఆయన చెప్పుకొచ్చారు. ఈ అవకాశాన్ని ప్రభుత్వ ఉద్యోగులందరూ సద్వినియోగం చేసుకోవాలని, సామర్థ్యాలను పెంచుకోవాలని కోరారు. ప్రభుత్వ సంస్థలను బలోపేతం చేయడం, మెరుగైన సేవలు అందించడమే 'సాధన సప్తాహ' ఉద్దేశమని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు.



## డిఎన్‌యే పరీక్షల ఫలితాల ఆధారంగా

# మృతదేహాల గుర్తింపు

## - వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

విజయవాడ, మార్చి 27 ప్రభాతవార్త ప్రతినిధి: మార్కాపురం జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో సజీవ దహనమై గుర్తుపట్టలేని విధంగా ఉన్న 14 మంది మృతదేహాలను తోబుట్టువుల డీఎన్ఏలతో గుర్తించారు. ఈ మేరకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శుక్రవారం రాత్రి ఓ ప్రకటన జారీ చేశారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో ఫోన్ ద్వారా మంత్రి సమీక్ష జరిపారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లా మార్కాపురం శివారులో టిప్పర్ను ట్రావెల్స్ బస్సు గురువారం వేకువజామున ఢీకొట్టిన ఘటనలో 14 మంది సజీవ దహనమయ్యారు మృతదేహాలను మార్కాపురం జిజిహెచ్‌లోని మార్చురీకి తరలించారు. వీటికి పోస్టుమార్టం నిర్వహించినప్పటికీ మృతదేహాలు ఎవరివో గుర్తించలేని విధంగా ఉండడంతో గురువారం రాత్రి తోబుట్టువుల (మొత్తం 22 మంది) నుంచి గుంటూరు రీజినల్ పోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (ఆర్ఎస్ఎస్ఎల్) నిపుణులు రక్త నమూనాలు సేకరించారు గుంటూరు నుంచి వచ్చిన వారికి ఒంగోలు జీజీహెచ్లోని ఫోరెన్సిక్ డిపార్టుమెంటు వారు సహకరించారు. ప్రకాశం జిల్లా. కలెక్టర్ పి. రాజాబాబు నిపుణులతో సంప్రదింపులు జరిపారు వారికి అవసరమైన సదుపాయాలు కల్పించారు. తోబుట్టువుల నుంచి సేకరించిన నమూనాలను గుంటూరులోని ల్యాబ్‌లో పరీక్షించారు. సమష్టి కృషివల్ల ఫలితాలు శుక్రవారం రాత్రి వెలువడ్డాయి. వీటి ఆధారంగా మృతదేహాల గుర్తింపు కార్డులోని వివరాలతో అనుసంధానం చేస్తున్నారు. శనివారం ఉదయం నుంచి తోబుట్టవులకు మృతదేహాలను అప్పగిస్తారు. అంతేకాకుండా ప్రభుత్వం ఏర్పాటుచేసే అంబులెన్సుల ద్వారా స్వస్థలాలకు మృతదేహాలను ఎస్కార్ట్ సాయంతో పంపనున్నారు. కందుకూరు. కనిగిరి, ఒంగోలు, నెల్లూరు జిల్లా బుచ్చి వరకు మృతదేహాల తరలింపు జరగనుంది.

డిఎన్ఏ పరీక్షల నిర్వహణలో అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. చనిపోయిన వారి తోబుట్టవుల (రక్త సంబంధీకులు) నుంచి నమూనాలు సేకరించారు ఒక కేసు విషయంలో తండ్రి, బిడ్డ చనిపోయ్యారు తండ్రిని ఆయన తల్లిదండ్రుల నుంచి సేకరించిన రక్త నమూనాలు, బిడ్డను తల్లి నుంచి సేకరించిన నమూనాను పరీక్షించడం ద్వారా మృతదేహాల గుర్తింపు సాధ్యమైంది. బస్సు ప్రమాదంలో గాయపడిన 20 మంది ఒంగోలు, మార్కాపురం అసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఒంగోలు జిజిహెచ్‌లో 16 మంది, మార్కాపురం జిజిహెచ్‌లో 12 మంది, ప్రైవేటు ఆసుపత్రిలో ఒకరు చొప్పున చికిత్స పొందుతున్నారని అధికారులు మంత్రికి వివరించారు. ఒంగోలు జిజిహెచ్‌లో చికిత్స పొందుతున్న వారిలో ఇద్దరి కాళ్లకు శుక్రవారం శస్త్రచికిత్స చేశారు అందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ పద్మావతి, ప్రకాశం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి టి వెంకటేశ్వర్లు, మార్కాపురం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వాణిశ్రీ వెల్లడించారు. వైద్యుల వైద్యుల సూచనలు అనుసరించి కోలుకున్న వారిని డిశ్చార్జ్ చేస్తామని చెప్పారు.

# తగ్గిన విద్యుత్ టారిఫ్‌తో వినియోగదారులకు ఊరట

## - విద్యుత్ రెవిన్యూ లోటు భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం - ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్



తిరుపతి, మార్చి 27 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్ర విద్యుత్ నియంత్రణా మండలి (ఎపిఇఆర్‌సి) 2026 -27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇటీవల విడుదల చేసిన విద్యుత్ టారిఫ్ ఆర్డర్ ద్వారా ఎస్‌పిడిసిఎల్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు భారీ ఉపశమనం లభిస్తోందని ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి వెల్లడించారు. విద్యుత్ వినియోగదారుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం విద్యుత్ పంపిణీ సంస్థల రెవిన్యూ లోటును భర్తీ చేసేందుకు వీలుగా ఈ ఏడాది మార్చి 12వతేదీ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో వినియోగదారులకు విద్యుత్ బిల్లుల్లో ఆదా చేసేందుకు అవకాశం ఏర్పడింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 8,238 కోట్ల రూపాయల రెవిన్యూ లోటుతో ఎస్పిడిసిఎల్ తన ప్రతిపాదనల్ని ఎపిఇఆర్సికి సమర్పించింది. ఈ పరిస్థితుల్లో విద్యుత్ సంస్థల రెవిన్యూ లోటును భర్తీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలపడంతో విద్యుత్ టారిఫ్‌ను పెంచాల్సిన అవసరం లేకుండా ఎపిఇఆర్‌సి టారిఫ్ ఉత్తర్వులను జారీ చేసింది.

రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం, ఎపిఇఆర్సి ఉత్తర్వుల ద్వారా ఎపిఎస్‌పిడిసిఎల్ పరిధిలో 53.84 లక్షల గృహ వినియోగదారులకు విద్యుత్ చార్జీల పెంపు నుంచి ఉపశమనం లభించడంతోపాటు 12.15 లక్షల వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు ఉచితంగా విద్యుత్తును సరఫరాను కొనసాగించడం జరుగుతోంది. అదేవిధంగా సంస్థ పరిధిలో 8 లక్షల ఎస్సీ, ఎస్టీ గృహ విద్యుత్ వినియోగదారులకు, క్షురకులకు, దోబీ ఘాట్లకు ఉచిత విద్యుత్తు సరఫరా కొనసాగుతోంది.

సంస్థ పరిధిలో వాణిజ్య విద్యుత్ వినియోగదారులకు యూనిట్ ధరను రూ.12.25 నుంచి రూ.9.95పైసలకు అంటే ఒక్కో యూనిట్టుకు 2.30రూపాయలు తగ్గించడంతో వాణిజ్య వినియోగదారులకు విద్యుత్ బిల్లుల నుంచి భారీ ఉపశమనం లభిస్తోంది. అదేవిధంగా మర మగ్గాలకు సంబంధించి లోడ్ లిమిట్‌ను 10 హెచ్‌పి నుంచి 20 హెచ్‌పికి పెంచడంతో సంస్థ పరిధిలో సుమారు 18 వేల మంది నేతన్నలకు లబ్ధి చేకూరుతోంది.

రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా సోలార్ విద్యుత్ పరికరాల తయారీ సంస్థలకు ప్రత్యేక సబ్ కేటగిరీని అమలు చేయడం ద్వారా సంప్రదాయేతర ఇంధన వనరుల ఏర్పాటుకు తోడ్పాటునందించేందుకు అవకాశం ఏర్పడుతోంది. అదేవిధంగా నీటి శుద్ధి కేంద్రాలు, ముద్రణా కేంద్రాలను వాణిజ్య కేటగిరీ నుంచి పారిశ్రామిక కేటగిరీకి మార్పు చేయడంతో వారికి కూడా లబ్ధి చేకూరుతుంది. జాతీయ రహదారుల వెంట విద్యుద్దీపాలకు సరఫరా చేసే విద్యుత్తును కేటిగిరి (వాణిజ్య) నుంచి కేటగిరీ4 (ఎ) యుటిలిటీస్‌గా వర్గీకరణను మార్పు చేశారు. ఇక ఈము పక్షుల కేంద్రాలను కూడా సీజనల్ ప్రాసెసింగ్ యూనిట్ కిందకు మార్చడంతోపాటు కోళ్ళఫారంలలో ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్లకు ప్రత్యేకంగా సబ్ మీటరును ఏర్పాటు చేసుకునే వెసులుబాటు అందుబాటులోకి రావడంతో కోళ్ళఫారాల యాజమానులకు ఊరట లభిస్తోంది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి విద్యుత్ టారిఫ్‌నకు సంబంధించి ఎపిఇఆర్సి ఈనెల 25వతేదీన విడుదల చేసిన టారిఫ్ ఆర్డర్ ద్వారా ఎపిఎస్పిడిసిఎల్ పరిధిలో నెలకు 500 యూనిట్ల వినియోగం పైన వున్న 41,510 మంది వాణిజ్య వినియోగదారులకు, 883 మంది ప్రకటనల హోర్డింగ్ వినియోగదారులకు, 2,307 మంది ఎల్‌టి/ హెచ్‌టి ఫంక్షన్ హాల్స్ వినియోగదారులకు, 52 మంది గ్రీన్ పవర్ వినియోగదారులకు, 423 మంది ప్రారంభ దశ హెచ్‌టి వినియోగదారులకు విద్యుత్ బిల్లుల నుంచి భారీ ఉపశమనం లభిస్తోంది.

# భర్తను చంపేసి... ఇంటి ముందే పాతిపెట్టేసింది!

- అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో ఘటన
- నాలుగు నెలల కిందటే కిరాతక హత్య
- అదృశమయ్యాడంటూ నాటకం
- కుమార్తె ప్రేమ వ్యవహారంతో వెలుగులోకి
- పోలీసులకు లొంగిపోయిన నిందితురాలు



అనంతపురం (క్రైమ్), మార్చి 27 ప్రభాతవార్త: మానవత్వం మంటగలిసింది... అగ్నిసాక్షిగా పెళ్లాడిన భర్తను సుమారు నాలుగు నెలల కిందట హత్య చేసింది. ఆపై గుట్టు చప్పుడు కాకుండా ఇంటి ఆవరణలోనే భర్త డెడ్ బాడీని పాతి పెట్టింది. ఆపై ఏమీ తెలియని అమాయకంగా జీవనం కొనసాగించింది. ఏ ఒక్కరికీ తనపై అను మానం రాకుండా జాగ్రత్తలు తీసుకుంది. అయితే తాజాగా తన కుమార్తె ప్రేమ వ్యవహారంలో తల్లీ కూతురు ఇద్దరూ గొడవపడ్డారు. ఆమె ప్రేమ వ్యవహారంలో అడ్డు తగలడంతో హత్య ఉదంతం వెలుగు చూసింది. ఈ హృదయ విదారక సంఘ టనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. అనంతపురం జిల్లా, కళ్యాణదుర్గం మండలం పాతచెరువు గ్రామంలో ఘటన చోటుచేసుకుంది. భర్తను హత్య చేసి ఇంటి ముందే పాతిపెట్టిన ఘటన శుక్రవారం బయటపడింది. గ్రామస్తులు, పోలీసుల వివరాల ప్రకారం మృతుడు హనుమంతు (35)కు సుకన్యతో 2009లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. హనుమంతు స్వస్థలం బెలుగుప్ప మండలంలోని హనుమరెడ్డి పల్లి. ఇదిలావుండగా వివాహానంతరం పాతచెరువులో నివసిస్తోంది. నాలుగు నెలల క్రితం హనుమంతు అదృష్టమయ్యాడని కథ అల్లింది. భర్త కనిపించడం లేదంటూ సుకన్య కళ్యాణదుర్గం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సుకన్య ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. అప్పటినుండి పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అయితే గురువారం సుకన్య, ఆమె కుమార్తె అమృత మధ్య జరిగిన గొడవతో అసలు విషయం బయటపడింది. కూతురు ప్రేమ వ్యవహారంపై తల్లి అడ్డుపడటంతో జరిగిన వాగ్వా దంలో, తండ్రిని తల్లే హత్య చేసిందని కుమార్తె వెల్లడించినట్లు గ్రామస్తులు చెప్పుకుంటున్నారు. దీంతో విషయం బయటకు వచ్చి తన బండారం బయటపడిందని తెలుసుకున్న నిందితురాలు సుకన్య శుక్రవారం పోలీస్ స్టేషన్‌కు వచ్చి పోలీసులకు లొంగిపోయింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే హత్యకు దారితీసిన కారణాలపై నిందితురాలు నుండి పోలీసులు సమాచారాన్ని రాబడుతున్నారు.




సిఐ రామసుబ్బయ్య, కానిస్టేబుల్ వెంకటేష్ చేతులకు గాయాలు

## బాలుడి హత్య సీన్ రీకన్‌స్ట్రక్షన్‌లో

# పోలీసులపై నిందితుడి దాడి

- సిఐ, కానిస్టేబుల్‌కు తీవ్ర గాయాలు
- నిందితుడిపై పోలీసుల కాల్పులు
- ముగ్గురిని ఆస్పత్రికి తరలింపు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ జగదీష్



గాయపడిన సిబ్బందిని పరామర్శిస్తున్న ఎస్పీ



కాల్పుల్లో గాయపడిన నిందితుడు

యాడికి(తాడిపత్రి), మార్చి 27 ప్రభాతవార్త: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృషించిన కోనుప్పల పాడు బాలుడి అపహరణ, హత్యోదంతానికి సంబంధించిన కేసులో నిందితుడు సర్వేష్ పోలీసుల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేశాడు. ఇందులో భాగంగా శుక్రవారం హత్య ఘటనా స్థలంలో సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేస్తుండగా, నిందితుడు పోలీసులపై దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో సిఐ శ్రీనివాసులు, కానిస్టేబుల్ వెంకటేష్ నాయక్‌కు గాయాలయ్యాయి. ఆత్మరక్షణలో భాగంగా పోలీసులు నిందితుడి కాళ్లపై కాల్పులు జరిపి, అదుపులోకి తీసుకున్నారు. ఆస్పత్రికి తరలించి, వైద్య చికిత్సలు చేయించారు. ఈ ఘటనకు సంబంధించి పోలసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. యాడికి మండలం కోనుప్పలపాడుకు చెందిన చిన్నారి వేంచంద్రను అడవిలోకి తీసుకెళ్లి అతి కిరాతకంగా చంపాడని పోలీసులు భావిస్తున్న నిందితుడు సర్వేష్ మరోసారి పోలీసుల నుంచి తప్పించుకునే యత్నంలో వారిపై దాడికి దిగడంతో వారు కాల్పులు జరపాల్సి వచ్చింది. సంఘటన జరిగిన తీరును పున:సమీక్షించడంలో భాగంగా శుక్రవారం తెల్లవారు జామున సర్వేష్‌ను వెంట తీసుకొని నాలుగు వాహనల్లో పోలీసు సిబ్బందితో కలసి సీఐలు శ్రీనివాసులు, రామసుబ్బయ్యలు, సిబ్బంది కోనుప్పలపాడు, కుందనకోట గ్రామాల మీదుగా చిన్నారి మృతదేహం లభ్యమైన ప్రాంతం వరకు వెళ్లారు. అక్కడ సంఘటన జరిగిన తీరును విచారిస్తుండగా నిందితుడు సర్వేష్ అక్కడే పడి ఉన్న ఖాళీ బీరు సీసా తీసుకొని కానిస్టేబుల్ వెంకటేష్ నాయక్‌పై దాడిచేసి గాయపరిచాడు. అడ్డుకోబోయిన సిఐ రామసుబ్బయ్య ఎడమ చేతిని కూడా గాయపరచి పోరిపోయే ప్రయత్నం చేశాడు. పోలీసులు మూడు రౌండ్లు గాలిలోకి కాల్పులు జరిపి నిలువరించే ప్రయత్నం చేశారు. అయినా ఆగకపోవడంతో నిందితుడి రెండు కాళ్లకు మూడు రౌండ్లు కాల్పులు జరిపి నిలువరించారు. తీవ్రంగా గాయపడిన నిందితుడితో పాటు సిఐ, కానిస్టేబుల్‌ను చికిత్సకై తాడిపత్రి ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం నిందితుడు సర్వేష్‌ను అనంతపురానికి తరలించారు. సమాచారమందుకున్న ఎస్పీ జగదీష్ తాడిపత్రి ఆసుపత్రికి చేరుకొని సిబ్బందిని పరామర్శించారు. సంఘటన జరిగిన తీరును, అనంతర పరిణామాలను ఆయన మీడియాకు వివరించారు.

# నూతన వడ్డెర సొసైటీల ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్

- వడ్డెర్లను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలన్నదే లక్ష్యం
- మాది మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం
- రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత స్పష్టీకరణ
- చంద్రబాబు, పవన్, లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం



విజయవాడ,మార్చి 27,ప్రభాతవార్తప్రతినిధి: వెనుబాటు తనం అనేది ఏ సామాజిక వర్గానికి ఉండకూడదనే లక్ష్యంతో సిఎం చంద్రబాబు ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తోందని రాష్ట్ర బిసి, ఇడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. తమది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని అన్నారు. ఎన్నికల ముందు మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు వడ్డెర సొసైటీలకు మైనింగ్ లీజుల్లో 15శాతం కేటాయించనున్నామని, మినరల్ లీజులో 50శాతం మినహాయింపు ఇవ్వనున్నామని వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వడ్డెర్లందరికీ ఆర్థికంగా మేలు కలిగేలా నూతన వడ్డెర్ల సొసైటీలు ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను వడ్డెర కార్పొరేషన్ మల్లె ఈశ్వరరావు ఆధ్వర్యంలో వడ్డెర సామాజిక వర్గీయులు శుక్రవారం కలిసి ధన్యవాదాలు తెలియజేశారు. తమకు ఆర్థిక భరోసా కలిగించేలా మైనింగ్ లీజులు కేటాయింపులతో పాటు సినరేజీ మినహాయింపు ఇచ్చినందుకు ఆనందం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, ఎన్నికల ముందు బిసిలకు ఇచ్చిన ప్రతి హామీనీ కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోందన్నారు. గీత కార్మికులకు మద్యం షాపుల్లో 10 శాతం కేటాయించామన్నారు. సముద్రంలో చేపల వేట నిషేధ కాలంలో మత్స్యకారులకు ఇచ్చే ఆర్థిక సాయం రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచామన్నారు. మత్స్యకారులకు నష్టం కలిగిస్తున్న వివాదాస్పద 217 జీవోను కూటమి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. చేనేతలకు ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఉచిత విద్యుత్ అమలు చేయబోతున్నామన్నారు. నాయీ బ్రాహ్మణుల ఆధ్వర్యలో నడిచే సెలూన్లకు ఉచిత విద్యుత్ ను 150 యూనిట్ల నుంచి 200 యూనిట్లకు పెంచామన్నారు. దేవాలయాల్లో పనిచేసే నాయీబ్రాహ్మణులకు ఇచ్చే గౌరవ వేతనం రూ.20 వేల నుంచి రూ.25 వేలకు పెంచామన్నారు. బడ్జెట్ బీసీలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ, రూ.51 వేల కోట్లుకు పైగా వారి అభ్యున్నతికి కేటాయించామన్నారు. ఇంత పెద్ద ఎత్తున నిధులు గతంలో ఎప్పుడూ కేటాయించలేదని మంత్రి సవిత గుర్తు చేశారు.

**నూతన వడ్డెర సొసైటీల ఏర్పాటుకు ఓకే:** వడ్డెర్లకు ఆర్థిక, సామాజిక గుర్తింపు కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని మంత్రి సవిత స్పష్టంచేశారు. ఎన్నికల ముందు నిర్వహించిన యువగళం పాదయాత్రలో వడ్డెర్ల కష్టాలను మంత్రి నారా లోకేశ్ స్వయంగా చూశారన్నారు. ఆనాడే వారి సంక్షేమానికి, ఆర్థిక ఉన్నతికి పలు హామీలిచ్చారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, మైనింగ్ లీజుల్లో వడ్డెర సొసైటీలకు 15 శాతం కేటాయింపు, సీనరేజీలో 50 శాతం మినహాయింపు ఇస్తూ మంత్రిమండలి సమావేశంలో తీర్మానం చేశామన్నారు. వడ్డెర స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డే ఓబన్న జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని కూటమి ప్రభుత్వం శాశ్వత జీవో తీసుకొచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వమన్నారు. వడ్డెర్లను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమని మంత్రి సవిత తెలిపారు.

**చంద్రబాబు, పవన్, లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం:** అంతకుముందు మంత్రి సవితను కలిసి వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వరరావు, డైరెక్టర్లు, ఆ సామాజిక వర్గీయులు ఆమెను ఘనంగా సత్కరించారు. ఆర్థిక భరోసా కలిగించేలా మైనింగ్ లీజులు కేటాయింపులతో పాటు సినరేజీ మినహాయింపు ఇచ్చినందుకు ఆనందం వ్యక్తంచేశారు. సిఎం చంద్రబాబుకు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌కు, మంత్రి నారా లోకేశ్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం మంత్రి సమక్షంలో చంద్రబాబు, పవన్, లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేషన్ చైర్మన్లు వీరంకి వెంకట గురుమూర్తి, పేరేపి ఈశ్వర్, డైరెక్టర్లు దుర్గారావు, దుర్గా మహాలక్ష్మి, వెంకటేశ్వరరావు, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాలకు చెందిన వడ్డెర సామాజిక ప్రతినిధులు కుంచాల సావిత్రి, మణికుమారి, శ్రీరామ్, ఉప్పు శ్రీను, వేముల బాబు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటీ స్పీకర్‌పై దాడిని ఖండించిన సిఎం చంద్రబాబు

విజయవాడ, మార్చి 27 ప్రభాతవార్తప్రతినిధి: ఉండి నియోవర్గం ఆకివీడు మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరామనవమి సందర్భంగా అక్కడ ఉన్న పురాతన ఆలయానికి పూజకు వెళ్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజుపై, కూటమి నాయకులపై కొందరు దాడి చేయడాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు శక్రవారం రాత్రి సీఎంవో ఒక ప్రకటన విడుదల చేసింది"దశాబ్దాలుగా నిరాదరణకు గురైన రామాలయ పునరుద్ధరణకు పూనుకున్న డిప్యూటీ స్పీకర్ పూజలకు వెళ్లిన సమయంలో, బయటి వ్యక్తులతో కలిసి కొంతమంది ఆయుధాలతో దాడికి తెగబడటం గర్హనీయం. భక్తిశ్రద్ధలతో పండుగ జరుపుకోవాల్సిన పవిత్ర సమయంలో ఇటువంటి సామాజిక విద్వేషాలను రెచ్చగొట్టేలా వ్యవహరించడం సరికాదు. ఈ రోజు జరిగిన దాడిలో కొందరు గాయపడి ఆసుపత్రి పాలవ్వడం దురదృష్టకరం. రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరు వ్యహరించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం" అని సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు.

# ఎస్-400 క్షిపణి వ్యవస్థలను భారత్ మరిన్ని కొనుగోలు

**న్యూఢిల్లీ, మార్చి 27:** ఆపరేషన్ సిందూర్‌లో గగనతల రక్షణ వ్యవస్థ ఎస్-400 సత్తా చాటిన విషయం తెలిసిందే. దీంతో వీటిని మరిన్ని కొనుగోలు చేసేందుకు భారత్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు నేడు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగే సమావే శంలో కీలక ప్రతి పాదనలను సమీ క్షించి, పలు పెద్ద ప్రాజెక్టు లకు క్లియరెన్స్ ఇచ్చే అవకాశం ఉంది. వీటిలో అయిదు ఎస్-400 క్షిపణి వ్యవస్థలతో పాటు 60 మధ్యశ్రేణి రవాణా విమానాలు కూడా ఉన్నాయి. త్రివిధ దళాల్లో ఆయుధ సామర్థ్యాలను మరింత బలోపేతం చేయడానికి ఈ చర్యలు తీసుకుం టున్నట్లు తెలుస్తోంది. భారత వైమానిక దళం కోసం నాలుగు స్క్వాడ్రన్ల రిమోట్లీ పైలట్ స్ట్రైక్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు, 800 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను చేధించగలిగే బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణులను కొనుగోలు చేయాలన్న ప్రతిపాదనను సమీక్షించనున్నట్లు రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన రక్షణ సేకరణ మండలి వెల్లడించింది. ఆధునిక యుద్ధంలో విరివిగా డ్రోన్లు వినియోగిస్తుండడంతో భారత పదాతిదళ విభాగాలలో ప్రత్యేక డ్రోన్ రెజిమెంట్లు, ప్రత్యేక క్షిపణి దళాల ఏర్పాటు గురించి కూడా చర్చించనున్నారు.

ధనాధన్ బ్యాటింగ్

సిక్స్‌లు, బౌండరీల మోత

# నేటి నుంచే ఐపీఎల్ జాతర

సాయంత్రం 7.30గం.

ఆర్సీబి X సన్‌రైజర్స్

*కాసుల క్రికెట్ ఇండియన్ ప్రీమియర్ లీగ్‌కు నేటితో తెరలేవనుంది. చిన్నస్వామి వేదికగా డిపెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూర్, సన్ రైజర్స్ హైదరాబాద్ మధ్య జరిగే ఆరంభ మ్యాచ్‌లో ఐపీఎల్ జాతర మొదలుకానుంది. ఏప్రిల్ నెల, మే నెల మొత్తం నిండు వేసవిలో మొదలయ్యే సిక్సర్లు, బౌండరీల జడివాన కురిపించనుంది. పరుగుల వరదతో స్టేడియాలు హోరెత్తనున్నాయి. అలాగే యంగ్ టాలెంట్.. టీమిండియాలోకి దూసుకెళ్లడానికి ఐపీఎల్ దగ్గరిదారిగా మారింది. దీంతో రాత్రికి రాత్రే సార్లు డమ్ తెచ్చిపెట్టే ఐపీఎల్‌లో సత్తా చాటేందుకు యువ ప్లేయర్లు సిద్ధమయ్యారు. పది జట్లు తలపడుతున్న 2026 ఐపీఎల్‌లో ఎవరికి విజయా వకాశాలున్నాయి?జట్టులో మ్యాచ్ ఫినిషర్లు ఎవరు? అనే అంశం ఉత్కంఠ రేపుతోంది.*




(వార్త క్రీడా విభాగం)

2008 నుంచి ఐపీఎల్ హాట్ ఫేవరెట్‌ట్లలో ఒకటిగా ఉన్న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూర్...2009, 2011, 2016లో ఫైనల్ వచ్చినా చివరి మెట్టుపై బోల్తాపడింది. ఎట్టకేలకు గత ఏడాది ఐపీఎల్ ట్రోఫీ అందుకుంది. ఈసారి డిపెండింగ్ ఛాంపియన్‌గా రజత్ పాటిదార్ నేతృత్వంలో బరిలోకి దిగుతోంది. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో ఐపీఎల్ పోరును ఆరంభించనుంది.విరాట్ కోహ్లీ, దేవ్‌దత్ పడిక్కల్, విహాన్ మల్హోత్రా, పిల్ సాల్ట్, టిమ్ డేవిడ్, జితేష్ శర్మ వంటి మ్యాచ్ విన్నింగ్ ప్లేయర్లతో పటిష్ఠంగా ఉంది. రెండో ఏడాది ట్రోఫీ నిలబెట్టుకోవడంపై ఫోకస్ పెట్టింది.

**చెన్నై సూపర్ కింగ్స్ ఏడో ట్రోఫీ వేట**

ఐపీఎల్‌లో విజయవంతమైన జట్లలో చెన్నై సూపర్ కింగ్స్‌ది అగ్రస్థానం. ఏకంగా అయిదు సార్లు ఛాంపియన్‌గా, మరో అయిదు సార్లు రన్నరప్‌గా నిలిచిన ఏకైక జట్టు. ఎక్కువసార్లు ప్లే ఆఫ్ ఆడిన జట్టుకూడా. గత ఏడాది సీఎస్‌కే ఫ్లాప్ షో చేసింది. 14 మ్యాచ్‌ల్లో నాలుగింటిలో మాత్రమే నెగ్గి పాయింట్ల పట్టికలోఅట్టడుగున నిలిచింది.రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్సీలో సారి సీఎస్‌కే భారీ ఆశలతో బరిలోకి దిగుతోంది. సంజూ శాంసన్, ధోనీ, శివమ్ దూబే, జేమీ ఓవర్టన్, మాథ్యూ షార్ట్, ఆయుష్ మాత్రే వంటి టాప్ క్లాస్ ప్లేయర్లు జట్టులో ఉన్నారు. 30న గౌహతీ వేదికగా రాజస్థాన్ రాయల్స్‌తో ఐపీఎల్ పోరు ఆరంభించనుంది.

**ముంబై ఇండియన్స్‌లో సగం టీమిండియా**

చెన్నై సూపర్ కింగ్స్‌తో పాటు 5సార్లు ఐపీఎల్ ఛాంపియన్‌గా ముంబై ఇండియన్స్ నిలిచింది. 2013, 2015, 2017, 2019, 2020లలో ఐపీఎల్ ట్రోఫీ అందుకుంది. మొత్తంగా ఆరుసార్లు ఫైనల్‌కు వచ్చింది. గత ఆరేళ్లుగా ఐపీఎల్ ట్రోఫీ అందుకోవడంలో విఫలమవుతోంది. 2025లో 16 మ్యాచ్‌ల్లో 9విజయాలతో ప్లే ఆఫ్ వరకు వచ్చింది. హార్దిక్ పాండ్యా నేతృత్వంలోని ముంబై ఇండియన్స్.. సగం టీమిండియాగా ఉంది. రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, శార్దూల్ ఠాకూర్, హార్దిక్ పాండ్యా, జస్‌ప్రీత్ బుమ్రా వంటి స్టార్ ప్లేయర్లతో నిండివుంది. 29న వాంఖడే వేదికగా కేకేఆర్‌తో తొలి మ్యాచ్ ఆడనుంది.

**ఐపీఎల్ నైట్ రైడర్స్**

సీఎస్‌కే, ఎంఐ తర్వాత 3సార్లు ఛాంపియన్‌గా నిలిచిన జట్టు కోల్‌కతా నైట్‌రైడర్స్.2012, 2014, 2024లో ట్రోఫీ అందుకుంది. 2021లో రన్నరప్‌గా నిలిచింది. గత ఏడాది స్థిరమైన ఆటతీరు కనబరచడంలో విఫలమైంది. ఈసారి అజింక్యా రహానే కెప్టెన్‌గా, రింకూ సింగ్ వైస్ కెప్టెన్‌గా బరిలోకి దిగుతున్న కేకేఆర్ జట్టు మనీష్ పాండే, రాహుల్ త్రిపాఠి, ఫిన్ అలెన్ , టిమ్ సీఫర్ట్, రోవ్‌మన్ పావెల్ లాంటి ప్లేయర్లతో పటిష్టంగా ఉంది.

**టాప్ ఆర్డర్ రైజింగ్**

సన్‌రైజర్స్ హైదరాబాద్ 2013లో ఐపీఎల్‌లోకి ఎంట్రీ ఇచ్చిన సన్ రైజర్స్ హైదరాబాద్ మూడుసార్లు ఫైనల్‌కు వచ్చింది. 2016లో ఛాంపియన్‌గా నిలిచింది. 2018, 2024లో రన్నరప్‌తోనే సరిపెట్టింది. గత ఏడాది ఆరో స్థానంతో లీగ్ స్టేజ్‌లోనే వెనుదిరిగింది. ఇషాన్ కిషన్ కెప్టెన్సీలో ఈసారి హాట్ పెవరేట్‌గా బరిలోకి దిగుతోంది. అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, హెన్రిక్ క్లాసెన్, నితీష్ కుఆర్ రెడ్డి, లివింగ్ స్టోన్ వంటి క్లాస్ ప్లేయర్లు ఉన్నారు.

**పంజాబ్ కింగ్స్ ఫైనల్ ఫోబియా**

గత ఏడాది ఐపీఎల్ లో అదరగొట్టిన పంజాబ్ కింగ్స్.. లీగ్ స్టేజ్‌లో టాప్ పొజిషన్‌లో నిలిచింది. ఫైనల్ మెట్టుపై నిరాశపరుస్తూ రన్నరప్‌తో సరిపెట్టింది. 2014లోనూ ఒక సారి రన్నరప్‌గా నిలిచింది. 2008 నుంచి ఉన్న పంజాబ్ కింగ్స్‌కు... ట్రోఫీ అందని ద్రాక్షగా మారింది. శ్రేయాస్ అయ్యర్ నేతృత్వంలోని పంజాబ్ కింగ్స్... ఈసారి ఆ కొరత తీర్చుకోవాలన్న పట్టుదలతో బరిలోకి దిగుతోంది. నేహల్ వధేరా, ప్రభ్ సిమ్రాన్ సింగ్ లాంటి లోకల్ టాలెంట్ ప్లేయర్లతో పాటు మార్కస్ స్టోయినిస్, అజ్మతుల్లా ఒమర్జాయ్, మార్కో జాన్సెస్, ఫార్గుసన్ లాంటి విదేశీ ప్లేయర్లతో సమతూకంగా ఉంది. 31న న్యూఛండీఘర్ వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో తొలి మ్యాచ్ ఆడనుంది.

**ఢిల్లీ క్యాపిటల్స్ కథ మారేనా?**

ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఐపీఎల్ ట్రోఫీ కొరత వెంటాడుతోంది. 2020లో ఫైనల్‌కు వచ్చినా రన్నరప్‌తోనే సరిపెట్టింది. 2008, 2009లో సెమీఫైనల్లో ఓడింది. 2022 నుంచి వరుసగా నాలుగు ఐపీఎల్‌ల్లో లీగ్ స్టేజ్‌లోనే వెనుదిరిగి నిరాశపరిచింది. ఈసారి అక్షర్ పేట్ కెప్టెన్‌గా, కేఎల్ రాహుల్ వైఎస్ కెప్టెన్‌గా బరిలోకి దిగుతోంది. డేవిడ్ మిల్లర్, నితీస్ రాణా, పథూమ్ నిస్సాంక, పృథ్వీషా, ట్రిస్టన్ స్టబ్స్.. ఢిల్లీ జట్టులో కీలక ఆటగాళ్లు.

**గుజరాత్ టైటాన్స్ అదరహో**

2022లో ఐపీఎల్ ఎంట్రీ ఇచ్చిన గుజరాత్ టైటాన్స్ తొలి ఏడాది ఛాంపియన్‌గా నిలిచి సర్‌ప్రైజ్ చేసింది. 2023లోనూ కూడా అదరగొడుతూ ఫైనల్‌కు వచ్చినా ట్రోఫీ నిలబెట్టుకోలేక పోయింది. గత ఏడాది ప్లే ఆఫ్ ఆడింది. టీమిండియా టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని గుజరాత్ టైటాన్స్ ఈసారి ట్రోఫీ అందుకోవడంపై ఫోకస్ పెట్టింది. తెవాటియా, సాయి సుదర్శన్, బట్లర్, హోల్డర్, గ్లేన్ ఫిలిప్స్, రషీద్ ఖాన్ లాంటి టాప్ క్లాస్ ప్లేయర్లు ఉన్నారు.

**రాయల్స్‌కు 2008 రిపీట్ అవుతుందా?**

అండర్ డాగ్స్‌గా బరిలోక దిగి తొలిసారే ఐపీఎల్ ఛాంపియన్‌గా నిలిచిన రాజస్థాన్ రాయల్స్ మళ్లీ ట్రోఫీ అందుకోలేకపోయింది. 2022లో ఫైనల్‌కు వచ్చినా రన్నరప్‌గానే నిలిచింది. గత సీజన్‌లో ఫ్లాప్ షోతో చివరి నుంచి రెండో స్థానంలో నిలిచింది. రియాన్ పరాగ్ కెప్టెన్సీలో జడేజా, జైస్వాల్, వైభవ్ సూర్యవంశీ,ధృవ్ జురెల్ లాంటి క్లాస్ ప్లేయర్లతో రాజస్థాన్ రాయల్స్ నిండి ఉంది.

**లక్నో సూపర్ జెయింట్స్:** 2024, 2025లలో లీగ్ స్టేజ్‌లోనే ఇంటిదారి పట్టింది. రిషబ్ పంత్ నేతృత్వంలో లక్నో... ఈసారి కప్‌పై దృష్టి సారించింది. మార్క్‌రమ్, జోష్ ఇంగ్లీష్, నికోలస్, పూరన్, మిచెల్ మార్ష్ లాంటి విదేశీ ఆటగాళ్ల ఆటతీరుపై భారీ ఆశలు పెట్టుకుది.



## ఆరంభ మ్యాచ్‌కు ఆరెంజ్ ఆర్మీ సై

**హైదరాబాద్, మార్చి 27(వార్త క్రీడా ప్రతినిధి) :** ఐపీఎల్2026 సీజన్‌లో తొలి మ్యాచ్ ఆడేందుకు సన్‌రైజర్స్ హైదరాబాద్ సిద్ధమైంది. మార్చి 28న టోర్నీ ఆరంభ మ్యాచ్‌లో చిన్నస్వామి స్టేడియం వేదికగా డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును ఎస్ఆర్‌హెచ్ ఢీకొట్టనుంది. ఈ హైవోల్టేజ్ మ్యాచ్ కోసం ఆరెంజ్ ఆర్మీ అన్ని విధాల సిద్ధమైంది. రెగ్యులర్ కెప్టెన్ పాట్ కమ్మిన్స్ అందుబాటులో లేకపోవడంతో ఇషాన్ కిషన్ సారథ్యంలో ఎస్ఆర్‌హెచ్ బరిలోకి దిగనుంది.

ఓపెనర్లుగా విధ్వంసకర ప్లేయర్లు ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మలు బరిలోకి దిగనున్నారు. వరుసగా మూడు, నాలుగు స్థానాల్లో ఇషాన్ కిషన్, నితీశ్ కుమార్ రెడ్డి బ్యాటింగ్ వచ్చే అవకాశం ఉంది. కిషన్ గత సీజన్‌లో మూడోస్థానంలోనే బ్యాటింగ్‌కు వచ్చి అద్భుతమైన సెంచరీ సాధించాడు. ఇక ఐదో స్థానంలో హెన్రిచ్ క్లాసన్ బ్యాటింగ్‌కు వచ్చే ఛాన్స్ ఉంది. అదేవిధంగా జట్టులోకి కొత్తగా వచ్చిన ఆల్‌రౌండర్ లివింగ్‌స్టోన్, అనికేత్ వర్మలు ఫినిషర్ పాత్రను పోషించనున్నారు. బౌలింగ్ విభాగానికి వస్తే ప్యాట్ కమ్మిన్స్ స్థానాన్ని ఇంగ్లీష్ ఆల్‌రౌండర్ బ్రైడన్ కార్స్‌తో భర్తీ చేసే అవకాశం ఉంది. కార్స్ బంతితో పాటు బ్యాట్‌తో కూడా రాణించగలడు. హర్షల్ పటేల్, శివమ్ మావి, జయదేవ్ ఉనద్కత్ పేస్ బాధ్యతలు పంచుకోనున్నారు. అదేవిధంగా విదర్భ స్పిన్నర్ హర్ష్ దూబె ఈ మ్యాచ్‌లో అరంగేట్రం చేసే అవకాశముంది. అయితే గత సీజన్‌లో ఆకట్టుకున్న జీషాన్ అన్సారీ కూడా తుది జట్టు రేసులో ఉన్నాడు. అలాగే రంజీ సీజన్‌లో అత్యధిక వికెట్లు(69) వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా చరిత్ర సృష్టించాడు. దీంతో గతేడాది జరిగిన మినీ వేలంలో రూ.30 లక్షల బేస్‌ప్రైస్‌కు అతడిని ఎస్ఆర్‌హెచ్ సొంతం చేసుకుంది.

**ఎస్ఆర్‌హెచ్ జట్టు(అంచనా):** ట్రావిస్ హెడ్, అభిషేక్, ఇషాన్ కిషన్, హెన్రిచ్ క్లాసెన్, నితీష్ కుమార్, లివింగ్‌స్టోన్, అనికేత్, వర్మ, బ్రైడన్ కార్స్, హర్ష్ దూబె,హర్షల్ పటేల్, శివమ్ మావి.

## నైషిక్‌కు సింగిల్స్ టైటిల్

**హైదరాబాద్, మార్చి 27(వార్త క్రీడా ప్రతినిధి)**

హైదరాబాద్‌లో జరిగిన ఏఐటీఏ జాతీయ ర్యాంకింగ్ టెన్నిస్ టోర్నీలో తెలంగాణకు చెందిన నైషిక్ టైటిల్ సాధించాడు. పురుషుల సింగిల్స్‌లో తెలంగాణకే చెందిన తీర్థ శశాంక్‌పై గెలుపొందాడు. నైషిక్ తొలి సెట్‌ను 6-4తో సులువుగా గెలుపొందగా, రెండో సెట్‌లో పుంజుకు తీర్థ శశాంక్ గట్టి పోటీ ఇచ్చాడు. రెండో సెట్‌ను శశాంక్ 7-6తో నెగ్గి సమవుజ్జీగా నిలిచాడు. ఫలితం తేల్చే కీలక సెట్‌లో నైషిక్ పుంజుకుని 6-2తో సెట్‌ను, మ్యాచ్‌ను ముగించాడు. అంతకుముందు నైషిక్ సెమీఫైనల్లో తమిళనాడుకు చెందిన రెండో సీడ్ విక్రమ్‌పై, క్వార్టర్ ఫైనల్లో కర్ణాటక ప్లేయర్ మనీష్ గణేష్‌పై గెలుపొందాడు. డబుల్స్ ఫైనల్లో ప్రణవ్ మహేష్, కృష్ణ తేజ జోడీ 7-6, 6-5తో నెగ్గి విజేతలుగా నిలిచారు. నైషిక్ రెడ్డి, పఱ్రణవ్ కొరాడే...మాజీ డేవిస్ కప్ ప్లేయర్ విష్ణువర్ధన్ శిక్షణలో రాటుదేలారు.



## 9 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరి



వాణిజ్యం

### వారాంతంలో ఈక్విటీల భారీ పతనం

### నష్టాల్లోనే ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, మార్చి 27:** దేశీయ స్టాక్ మార్కెట్లు వారాంతంలో భారీ నష్టాలు చవిచూసాయి. రెండు రోజుల లాభాల జోరుకు బ్రేక్ పడింది. పశ్చిమాసియాలో యుద్ధం ముగింపుపై అనిశ్చితులు నెలకొనడంతో చమురు ధరలు మళ్లీ భగ్గుమన్నాయి. దీంతో శుక్రవారం స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. సెన్సెక్స్ దాదాపు 1700 పాయింట్లు కోల్పోయింది. నిఫ్టీ 50 ఇండెక్స్ మళ్లీ 23 వేల మార్క్ కోల్పోయింది. రిలయన్స్ ఇండస్ట్రీస్, టాటా మోటార్స్ పీవీ వంటి స్టాక్స్ 5 శాతం మేర నష్టపోయాయి. ఈ క్రమంలో బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ. 422 లక్షల కోట్లకు తగ్గింది. ఒక్కరోజే ఇన్వెస్టర్లకు దాదాపు రూ.9 లక్షల కోట్ల మేర ఆవిరైంది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలతో ఈరోజు స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌లో సూచీలు నష్టాలతోనే ప్రారంభమయ్యాయ.ఉదయం 74,883పాయింట్లవద్ద మొదలైన సెన్సెక్స్ అంతకంతకూ దిగజారుతూ వచ్చింది. ఇంట్రాడేలో 73,534 కనిష్ఠ స్థాయిని తాకిన సూచీ చివరకు 1690.23 పాయింట్ల నష్టంతో 73,583 వద్ద ముగిసింది.

అటు నిఫ్టీ 50 సూచీ 486 పాయింట్లు పడిపోయి 22,819 వద్ద స్థిరపడింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీలో శ్రీరామ్ ఫైనాన్స్,టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్, ఇండిగో, రిలయన్స్ ఇండస్ట్రీస్, బజాజ్ ఫైనాన్స్ వంటి షేర్లు 5 శాతం మేర పడిపోయాయి. కీలక రంగాల్లోని స్టాక్స్ అన్నీ నష్టాల్లోకి జారుకోవడంతో సూచీలపై తీవ్ర ప్రభావం పడింది. ఓఎన్జీసీ, టీసీఎస్, విప్రో, భారతీ ఎయిర్ టెల్, కోల్ ఇండియా వంటి సూచీలు స్వల్పంగా లాభపడ్డాయి. ప్రభుత్వరంగ బ్యాంకులు, రియల్ ఎస్టేట్ షేర్లు 3 శాతం మేర పతనమయ్యాయి. యుద్ధం నేపథ్యంలో గ్లోబల్ మార్కెట్లో చమురు ధరలు మళ్లీ భారీగా పెరిగాయి. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్ కు 107 డాలర్లు పలుకుతోంది. అంతర్జాతీయ ఈక్విటీల్లోనూ అమ్మకాలు వెల్లువెత్తాయి. రూపాయి విలువ అంతకంతకూ క్షీణిస్తోంది. శుక్రవారం ట్రేడింగ్ లో డాలరుతో పోలిస్తే భారత కరెన్సీ రూపాయి మారకం విలువ 86 పైసలు పడిపోయి 94.82 వద్ద సరికొత్త జీవనకాల కనిష్ఠాన్ని నమోదు చేసింది. కొంత కాలంగా వరుసగా నష్టాల్లో ఉన్న స్టాక్ మార్కెట్లు గత రెండు సెషన్లలో లాభపడిన సంగతి తెలిసిందే. చివరి రోజు ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు దిగడం మార్కెట్ల పతనానికి మూల కారణంగా మారింది. బీఎస్ఇలోకేవలం 822 కంపెనీల షేర్లుమాత్రమే పెరిగితే 3544 షేర్లు భారీగా క్షీణించాయి. 145 షేర్లుమాత్రమే నిలకడగా కొనసాగాయి. బీఎస్ఇ 150 మిడ్‌క్యాప్ 2.18శాతం, స్మాల్‌క్యాప్ 250 సూచీ 1.82శాతం చొప్పున క్షీణించాయి.

ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు ఏప్రిల్‌రెండునాటి సెటిల్‌మెంట్లు 1.64శాతంపెరిగి రూ.1,41,813గా కొనసాగింది. కమొడిటీ మార్కెట్లలో బ్రెంట్‌ముడిచమురు 2.15 డాలర్లుపెరిగి 110.16 డాలర్లుగా కొనసాగింది. గ్లోబల్‌మార్కెట్లలో డౌజోన్స్ ఫ్యూచర్స్‌కూడా 144 పాయింట్లు దిగజారింది. యూరోపియన్‌షేర్లుకూడా వారాంతంలో నష్టాలే చవిచూసాయి. ఆసియా సూచీలుమాత్రం మిశ్రమంగా ముగిసాయి. వాల్‌స్ట్రీట్‌లో ఎస్అండ్‌పి 500 క్షీణించింది. నాస్‌డాక్ కాంపోజిట్ 2.38శాతం పతనం అయింది. డౌజోన్స్ పారిశ్రామిక సగటు కూడా 469.38 పాయింట్లు క్షీణించింది.




### ఏప్రిల్1 నుంచి వస్తున్న

## మార్పులివే

**ముంబయి, మార్చి 27:** ఆర్థికసంవత్సరం మారుతోంది. ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి కొత్త ఆర్తికసంవత్సరం ప్రారంభం కాబోతోంది. ఈతరుణంలో కొన్ని మార్పులు, సవరణలు అనివార్యంగా అమలవుతాయి. అలాగే ప్రతి నెలా ముగిసే సమయంలో కొత్త నిబంధనలు కూడా వస్తుంటాయి. వచ్చే ఏప్రిల్ ఒకటినుంచి కొత్త ఆదాయపు పన్ను చట్టం అమలుతో, పన్ను మరియు జీతానికి సంబంధించిన మార్పులు రాబోతున్నాయి. పాన్ కార్డుకు సంబంధించిన నిబంధనలు కూడా మారుతున్నాయి. ప్రతి నెలా మొదటి తేదీలాగే, 2026 ఏప్రిల్ 1వ తేదీ ప్రారంభం కూడా ఎల్‌పీజీ సిలిండర్ల ధరలలో మార్పుతో కనిపించవచ్చు. మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న యుద్ధం ప్రారంభమైన తర్వాత, తీవ్రమైన ఎల్‌పీజీ కొరత మధ్య, చమురు కంపెనీలు ఇప్పటికే ధరలను పెంచి షాక్ ఇచ్చాయి. చమురు సంక్షోభం మధ్య, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ఏటిఎఫ్, సీఎన్‌జీపీఎన్‌జీ రేట్లలో మార్పును చూడవచ్చు. 1961 నుండి అమల్లో ఉన్న ప్రస్తుత చట్టం స్థానంలో 2025 ఆదాయపు పన్ను చట్టం రానుంది. ప్రభుత్వం ప్రకారం, పన్ను చెల్లింపుదారులపై నిబంధనల పాటింపు భారాన్ని తగ్గించడానికి చట్టాన్ని ఆధునికంగా, సులభంగా చేయడానికి అనేక మార్పులు చేయబడ్డాయి. పన్నుకు సంబంధించిన కొన్ని మార్పుల గురించి చెప్పాలంటే, ఏప్రిల్ 1 నుండి, ఐటీఆర్ దాఖలు చేయడానికి అవసరమైన ఫారం 16 మీకు ఇకపై లభించదు. దానికి బదులుగా, దాని స్థానంలో మరొక ఫారం ఇవ్వబడుతుంది. కస్టమర్లు ఆ ఫారాన్ని ఆదాయపత్రంగా ఉపయోగించుకోవచ్చు. ఫారం 16ను టీడీఎస్ సర్టిఫికెట్‌గా పరిగణిస్తారు. ఇది జీతభత్యాల ఆదాయానికి సంబంధించిన టీడీఎస్ సర్టిఫికెట్ కూడా. ఫారం 16ఎ అనేది అద్దె, వడ్డీ, వ్యాపార, కన్సల్టెన్సీ ఫీజుల వంటి జీతమేతర ఆదాయాల కోసం ఉద్దేశించిన టీడీఎస్ సర్టిఫికెట్. ఏప్రిల్ 1 నుండి దీని పేరును కూడా ఫారం 131గా మార్చనున్నారు. ఏప్రిల్ 1 నుండి మీకు కూడా ఎటిఎం నిబంధనలు మారబోతున్నాయి. ప్రధాన మార్పులను పరిశీలిస్తే, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ఇప్పుడు ఉచిత ఎటిఎంవిత్‌డ్రాయల్స్‌లో యుపిఐ విత్‌డ్రాయల్స్‌ను కూడా లెక్కిస్తుంది. ప్రతి లావాదేవీకి విత్‌డ్రాయల్స్‌పై రూ. 23 రుసుముతో ఈ బ్యాంక్ నెలకు ఎటిఎం నుండి 5 ఉచిత విత్‌డ్రాయల్స్ సౌకర్యాన్ని అందిస్తోంది. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌తో పాటు, పంజాబ్ నేషనల్ బ్యాంక్ కూడా తన కొన్ని డెబిట్ కార్డుల రోజువారీ లావాదేవీల పరిమితులలో మార్పులను ప్రకటించింది. వినియోగదారులు ఇప్పుడు తమ కార్డ్ కేటగిరీని బట్టి రోజుకు రూ.50,000 నుండి రూ.75,000 వరకు విత్‌డ్రా చేసుకోగలరు. గతంలో రోజువారీ పరిమితి రూ.1 లక్ష వరకు ఉన్న కార్డ్ హోల్డర్లకు ఈ పరిమితి ఇప్పుడు తక్కువగా ఉంది.

ఏప్రిల్ 1, 2026 నుండి అమలులోకి రానున్న ప్రధాన మార్పులలో పాన్ కార్డులకు సంబంధించినవి కూడా ఉన్నాయి. పాన్ దరఖాస్తుల కోసం కేవలం ఆధార్ కార్డులు మాత్రమే ఇకపై సరిపోవు, దరఖాస్తుదారులు ఇతర పత్రాలను కూడా సమర్పించాల్సి ఉంటుంది. కొత్త నిబంధనలు అమల్లోకి రాకముందే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేయబడ్డాయి.రైల్వే టిక్కెట్లను రద్దు చేయడం ఖరీదైనదిగా ఉంటుంది. ఏప్రిల్ 1వ తేదీ నుండి వర్తించే నిబంధనల ప్రకారం, ఇప్పుడు ధృవీకరించబడిన రైల్వే టిక్కెట్లను రద్దు చేయడానికి ప్రయాణికులు ఎక్కువ డబ్బు చెల్లించాల్సి ఉంటుంది.ఇప్పుడు రైలు బయలుదేరడానికి 8 గంటల ముందు వరకు ఎలాంటి రీఫండ్ ఇవ్వబడదు. 8 నుండి 24 గంటల ముందు రద్దు చేసిన టిక్కెట్లపై 50 శాతం రీఫండ్, 24 నుండి 72 గంటల ముందు రద్దు చేసిన టిక్కెట్లపై 25 శాతం తగ్గింపు ఇవ్వబడుతుంది 72 గంటల ముందు రద్దు చేసిన టిక్కెట్లపై గరిష్ట రీఫండ్ ఇవ్వబడుతుంది.



### భారత్ విదేశీ కరెన్సీ ఖజానాకు

## 11.413 బిలియన్ డాలర్లు లోటు

**ముంబయి,మార్చి 27:** భారత్ విదేశీ కరెన్సీ రిజర్వులు 20వ తేదీతో ముగిసిన వారంలో రూ.11.413 బిలియన్ డాలర్లు క్షీణించాయి. మొత్తం కరెన్సీ నిల్వలు 698. 346బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు రిజర్వుబ్యాంకు ప్రకటించింది. పసిడి నిల్వల్లోనే భారీ తగ్గుదల నమోదు చేసినట్లు బ్యాంకు తెలిపింది. మొత్తం రిజర్వులు అంతకుముందు వారంలో కూడా 7.052 బిలియన్ డాలర్లు క్షీణించి 709.759 బిలియన్ డాలర్లకు చేరిన సంగతి తెలిసిందే. గతనెల 27వ తేదీతో ముగిసిన వారంలో 728.494 బిలియన్ డాలర్లు మేర గరిష్టస్థాయికి చేరినసంగతి తెలిసిందే.

ఇక మార్చి 20వ తేదీతోముగిసిన వారంలో విదేశీ కరెన్సీ ఆస్తులు 2.127 బిలియన్ డాలర్లుపెరిగి 557.695 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు ఆర్బీఐ డేటా సూచిస్తోంది. విదేశీ కరెన్సీ ఆస్తులపరిధిలోకి యూరో, పౌండ్; యెన్ వంటి కరెన్సీల హెచ్చుతగ్గులు కూడా నమోదవుతాయి. పసిడి నిల్వలు 13.495 బిలియన్ డాలర్లమేర క్షీణించి 117.186 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇక స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ 65 మిఇయన్ డాలర్లు దిగజారాయి. 18.632 బిలియన్ డాలరకు చేరాయి. ఇక ఐఎంఎఫ్‌వద్ద భారత్ రిజర్వుస్థాయి 19 మిలియన్ డాలర్లుపెరిగి 4.833 బిలియన్ డాలర్లుగా ఉందని రిజర్వుబ్యాంకు వెల్లడించింది.

## భవిష్యత్తు వృద్ధికి ఎఐ

**న్యూఢిల్లీ, మార్చి 27:** కృత్రిమమేథ కార్యాచరణతో మేజర్ కంపెనీలన్నీ లే ఆఫ్‌లు ప్రకటిస్తుంటే ఈ ప్రభావం కొందరు సిఇఒలపైనా చూపిస్తోంది. కృత్రిమ మేధ వినియోగం పెరగడం కారణంగానే తాము పనిచేసే సంస్థలను వీడాలని భావించినట్లు ఇద్దరు సిఇఒలు చెపుతున్నారు. కోకోకోలా, వాల్‌మార్ట్ సిఇఒలు ఇదే విషయం స్పష్టంచేసారు. పనితీరులో కొత్తపరివర్తనం చోటుచేసుకుందని, భవిష్యత్తు వృద్ధి అంతా ఎఐ మీదనే ఆధారపడి ఉంటున్నదని, అంతేకాకుండా కొత్త నాయకత్వం కూడా యాజమాన్యంకోరుకుంటున్నందున మార్పులు అనివార్యం అవుతున్నాయని పేర్కొన్నారు.అందువల్లనే కొన్ని కంపెనీల్లో ఉన్నతస్థాయి ఎగ్జిక్యూటివ్‌లు భావితరం సాంకేతిక మార్పులు కూడా అలవరుచుకోవాల్సిన అవసరం ఉందని వారన్నారు. కోకోకోలా సిఇఒ జేమ్స్ క్విన్సీ మాట్లాడుతూ సంస్థాగతంగా వచ్చిన మార్పులే తాను వైదొలిగేందుకు కారణం అవుతున్నాయన్నారు.భావితరం మార్పులతో ముందుకు దూసుకునివెళ్లే టీమ్ అవసరం అవుతున్నదని, భవిష్యత్తు వృద్ధికోసం టెక్ ఆధారిత ఎఐ నైపుణ్యాలున్న వ్యక్తి అవసరం అవుతున్నందున తాను వైదొలగాలని భావించినట్లు చెప్పారు. సంస్థలో సిఒఒగా ఉన్న హెన్రిక్ బ్రాన్ ఈనెల 31నుంచి సిఇఒ బాధ్యతలుచేపట్టనున్నారు. కృత్రిమమేథకు ముందు, జెన్ ఎఐమోడ్‌కు ముందు ఎంతో ప్రగతిని సాధించామని, అయితే ఇపుడు కొత్తమార్పులు అనివార్యం అవుతున్నాయన్నారు. వాల్‌మార్ట్ సిఇఒ మెక్ మిల్లన్ మాట్లాడుతూ శరవేగంతో దూసుకుపోయే వ్యక్తికి ఛాన్స్ ఇవ్వాలనే తాను తప్పుకున్నట్లు తెలిపారు.




గతనెల ఒకటవ తేదీనుంచే జాన్ ఫర్నర్ వాల్‌మార్ట్ సిఇఒగా బాధ్యతలు స్వీకరించారు. ఏడాది క్రితం భావితరం ఏజెంటిక్ కామర్స్ ఎలా ఉంటుందో, ఎఐ షాపింగ్ విజన్ ఎలా ఉంటుందో చూడొచ్చని భావించామని రానున్న కొన్నేళ్లలో జరగాల్సిన అన్ని అంశాలపైనా ఆలోచించానని మెక్‌మిలన్ పేర్కొన్నారు. మెక్‌మిలన్ హయాంలోనే వాల్‌మార్ట్‌ను నాస్‌డాక్‌లో లిస్టింగ్‌చేయాలన్న లక్ష్యంతో పనిచేసారు.

## మార్కెట్లకు వస్తున్న నాలుగు ఐపిఒలు

**న్యూఢిల్లీ, మార్చి 27:** మార్కెట్ల నియంత్రణ పర్యవేక్షణ సంస్థ సెబీ సింబయోటిక్ ఫార్మాలాబ్, విశ్వరాజ్ ఎన్విరాన్‌మెంట్, ఎస్ఎఐఎల్ ఇంక్ట్రీస్ సంస్థలకు సంబంధించిన ఐపిఒలకు పరిశీలన లేఖలు జారీచేసింది. అంటే సెబీ తుది ఆమోదం పొందేవరకూ ఈ అబ్జర్వేషన్ లేఖ నిబంధనలు కొనసాగుతాయి. ఈనెల 27వ తేదీవరకూ ఈ నిబంధనలు అమలులో ఉంటాయని తెలిపింది. ఇదిలా ఉంటే జిందాల్ సుప్రీం ఇండియా తన ఐపిఒ ప్లాన్‌ను ఉపసంహరించుకుంది. షా ఇన్వెస్టర్స్ హోం, ప్రాసోల్ కెమికల్స్, నోపేపర్ ఫామ్స్ సొల్యూషన్స్ ఐపిఒలకు మాత్రం సెబీ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం సెబీ వద్ద 26 ముసాయిదా ఐపిఒల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో ఎస్‌బిఐ ఫండ్స్‌మేనేజ్‌మెంట్, దీపా జ్యూయెలర్స్, మనీవ్యూ సంస్థల దరఖాస్తులు కూడా ఉన్నాయి. ఇక సింబయోటెక్ ఫార్మాలాబ్ రూ.2180 కోట్ల నిధులు మీకరణకోసం ఐపిఒకు దరఖాస్తుచేసింది. తాజా ఇష్యూ




150కోట్లవరకూ ఉంటుంది. ఆఫర్‌ఫర్‌సేల్‌కింద 2030 కోట్లు నిధులసమీకరణ ఉంటుంది. అంటే ప్రమోటర్లు, ప్రుత ఇన్వెస్టర్లు వాటాలను విక్రయిస్తారు. ఈ మొత్తాలను రుణాల తిరిగిచెల్లింపు కోసం కార్పొరేట్ అవసరాలకు వినియోగిస్తారు. ఇక విశ్వరాజ్ ఎన్విరో జలవనరుల వినియోగం, నీటియాజమాన్య ప్రాజెక్టుల నిర్వహణ సంస్థ రూ.2250 కోట్ల నిధుల సమీకరణకు ఐపిఒకు వస్తోంది. కంపెనీ ఐపిఒ తాజాగా రూ.1250 కోట్ల వరకూ ఉంది. ఆఫర్‌ఫర్‌సేల్‌కింద మరో 1000కోట్లు సమీకరిస్తుంది. ఈ నిధులను అనుబంధ సంస్థల రుణాల చెల్లింపులకు రూ.545 కోట్లు వ్యయంచేస్తుంది. మరో మూడు ప్రాజెక్టులకు మూలధన వ్యయంగా కూడా వాడుకుంటుంది. యుఎఫ్ ఆర్ టెక్నాలజీ ఆధారిత నీటిశుద్ధి ప్లాంట్‌కు ఈ నిధులు వినియోగిస్తుంది. వ్యవసాయ వృధానుంచి స్వచ్ఛ విద్యుత్ తయారీ సంస్థ ఎస్ఎఐఎల్ ఇండస్ట్రీస్ రూ.4575 కోట్లు సమీకరించేందుకు ఐపిఒకు వస్తోంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

# శ్రీరామనవమి మహోత్సవ వేడుకలు



మొగల్తూరు మార్చి 27 (ప్రభాతవార్త) పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలంలో శుక్రవారం శ్రీరామనవమి మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు, మండలంలోని ముత్యాలపల్లి మొగల్తూరు వారతిప్ప కోమటి తిప్ప కొత్తట కాళీపట్నం వెస్ట్ కాళీపట్నం ఈస్ట్ పాతపాడు రామన్నపాలెం పాత శేరేపాలెం కొత్తపాలెం కెపి పాలెం నార్త్ కేపీ పాలెం సౌత్ పేరుపాలెం సౌత్ పేరుపాలెం నార్త్అన్ని గ్రామాలలో రామాలయాలు భక్తులతో కిక్కిరి శాయి, ఉదయం నుంచి భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు తరలివచ్చి శ్రీరామచంద్రమూర్తి స్వామివారి కళ్యాణాన్ని భక్తిశ్రద్ధలతో వీక్షించారు, ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు హోమాలు భజనలు నిర్వహించగా గ్రామాలు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి, భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రసాదాలను పంపిణీ చేశారు, మహిళలు యువతులు సంప్రదాయ వేషధారణలో పాల్గొని వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు, మండలంలోని ప్రజలు భక్తి భావంతో శ్రీరాముని ఆశీస్సులు కోరుకుంటూ పూజలో పాల్గొన్నారు, భక్తులకు ఎటువంటి అంతరాయం లేకుండా సజావుగా కొనసాగేందుకు ఆలయ కమిటీలు గ్రామ పెద్దలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు

## కె.ఎస్.రామవరంలో 'పల్లె నిద్ర'




కామవరపుకోట,మార్చి 27(ప్రభాత వార్త): ప్రజలకు చేరువ కావడమే లక్ష్యంగా గురువారం రాత్రి కె.ఎస్.రామవరం గ్రామంలో తడికలపూడి ఎస్సై చెన్నారావు 'పల్లె నిద్ర' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశమైన ఆయన, కొత్త చట్టాలు మరియు పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా సెల్ ఫోన్ల ద్వారా జరిగే మోసాల గురించి వివరిస్తూ.. అపరిచిత వ్యక్తులు పంపే లింకులను క్లిక్ చేయవద్దని, ఓటీపీ వివరాలను ఎవరికీ షేర్ చేయకూడదని అవగాహన కల్పించారు.

పశ్చిమగోదావరి,ఏలూరు
వార్త

# నేడు జిల్లాలోని విభిన్న ప్రతిభావంతుల గ్రీవెన్స్ డే

## - జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి



భీమవరం మర్చి 27 ప్రభాతవార్త : విభిన్న ప్రతిభావంతుల కోసం ప్రత్యేకంగా గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని మార్చి 28వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, ముఖ్యంగా ఉపాధి, విద్య, ఆరోగ్యం, పింఛన్లు, సౌకర్యాల కొరత, ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలకు సంబంధించి అర్జీలను స్వీకరించి, వాటికి తక్షణ పరిష్కార చర్యలు చేపట్టడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ఈ ప్రత్యేక గ్రీవెన్స్ డే కార్యక్రమం జిల్లా కేంద్రంలోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో మార్చి 28వ తేదీ ఉదయం 10.00 గంటల నుండి నిర్వహించబడుతుందన్నారు. కార్యక్రమానికి సంబంధిత శాఖల అధికారులు హాజరై, వచ్చిన అర్జీలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. విభిన్న ప్రతిభావంతులు తమ సమస్యలకు సంబంధించిన అవసరమైన పత్రాలతో హాజరై, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు. ప్రభుత్వ సేవలు అందరికీ సులభంగా చేరేలా చేయడం, ప్రత్యేక వర్గాల సమస్యలను వేగంగా పరిష్కరించడం జిల్లా యంత్రాంగం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు ఈ కార్యక్రమంలో పాల్గొని, తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందాలని విజ్ఞప్తి చేశారు.

# రఘురామ కృష్ణరాజుపై దాడికి యత్నం..

# ఆకివీడులో ఉద్రిక్తత



ఆకివీడు, మార్చి 27 ( ప్రభాత వార్త) :పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులో శ్రీరామనవమి పర్వదినాన చోటుచేసుకున్న ఉద్రిక్తతలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు లక్ష్యంగా జరిగిన ఈ దాడి స్థానికంగా కలకలం రేపుతోంది. రాజకీయ విభేదాలకు తోడు ఆలయ భూవివాదం తోడవడంతో ఈ ఘటన ఒక్కసారిగా హింసాత్మక రూపం దాల్చింది. ఆకివీడు పట్టణంలోని స్థానిక రామాలయానికి చెందిన భూమి విషయంలో గత కొంతకాలంగా రెండు వర్గాల మధ్య తీవ్ర స్థాయిలో వివాదం నడుస్తోంది. ఈ భూమిపై యాజమాన్య హక్కులు, వినియోగం విషయంలో ఇరు వర్గాలు పట్టుదలతో ఉన్నాయి. ఈ క్రమంలోనే శ్రీరామనవమి వేడుకల సందర్భంగా ఆలయాన్ని సందర్శించి, స్వామివారిని దర్శించుకోవాలని స్థానికులు ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజును ఆహ్వానించారు. ఈ ఆహ్వానం మేరకు ఆయన ఆకివీడు పర్యటనకు సిద్ధమయ్యారు. అయితే, ఆయన రాకను వ్యతిరేకిస్తున్న ఒక వర్గం ముందుగానే నిరసనకు ప్రణాళికలు రచించినట్లు తెలుస్తోంది. రఘురామకృష్ణరాజు ఆలయ పరిసరాలకు చేరుకోగానే పరిస్థితి ఒక్కసారిగా అదుపు తప్పింది. ఆయన రాకను నిరసిస్తూ ఒక వర్గానికి చెందిన వ్యక్తులు పెద్ద పెట్టున నినాదాలు చేయడం ప్రారంభించారు. నిరసన కాస్తా హింసకు దారితీసింది. ఆందోళనకారులు ఒక్కసారిగా ఎమ్మెల్యే కాన్వాయ్‌పైకి రాళ్లు రువ్వారు. కేవలం రాళ్లతోనే ఆగకుండా, పక్కా ప్రణాళికతో మేకులతో దాడి చేశారు. దీంతో అక్కడ ఉన్న కూటమి నేతలు, కార్యకర్తలు రఘురామరాజుకు రక్షణ కవచంలా నిలిచారు. ఆందోళనకారులు విచక్షణారహితంగా దాడి చేయడంతో, రక్షణగా నిలిచిన పలువురు కూటమి నాయకులకు గాయాలయ్యాయి. మేకులు తగలడం, రాళ్ల దెబ్బల కారణంగా కొందరు కార్యకర్తలు తీవ్రంగా గాయపడ్డారు. పరిస్థితి విషమిస్తోందని గమనించిన ఎమ్మెల్యే భద్రతా సిబ్బంది, స్థానిక పోలీసులు తక్షణమే రఘురామరాజును అక్కడి నుండి తరలించారు. ఈ ఘటన తర్వాత ఆకివీడు పట్టణం యుద్ధభూమిని తలపించింది. ఇరు వర్గాల మధ్య ఘర్షణ మరింత పెరగకుండా ఉండేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగం అదనపు బలగాలను రంగంలోకి దించింది. దాడికి పాల్పడిన వారిని గుర్తించేందుకు పోలీసులు సీసీటీవీ ఫుటేజీలను, స్థానికులు తీసిన వీడియోలను పరిశీలిస్తున్నారు. పట్టణంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆంక్షలను అమలు చేస్తున్నారు. ప్రజలు గుంపులుగా చేరకుండా హెచ్చరికలు జారీ చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే, ఎంతటి వారైనా సరే ఉపేక్షించేది లేదని, కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. డిప్యూటీ స్పీకర్ హోదాలో ఉన్న వ్యక్తిపై, అది కూడా పవిత్రమైన పండుగ రోజున దాడి జరగడాన్ని కూటమి ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. ఇది ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా నేతలు అభివర్ణిస్తున్నారు. ఆలయ భూవివాదాన్ని అడ్డం పెట్టుకుని రాజకీయ ప్రత్యర్థులు కావాలనే ఈ కుట్రకు పాల్పడ్డారని కూటమి నాయకులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతానికి ఆకివీడులో పరిస్థితి అదుపులోనే ఉన్నప్పటికీ, నివురుగప్పిన నిప్పులా ఉంది. గాయపడిన నేతలకు స్థానిక ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. పోలీసులు నమోదు చేసిన కేసుల ఆధారంగా విచారణ వేగవంతమైంది.

# బురుగుగూడెం లో కళ్యాణ మహోత్సవం

## -వైభవంగా నిర్వహించిన దేశ రెడ్డి దంపతులు



చాట్రాయి, మార్చి 27, ప్రభాతవార్త : మండలంలోని బూరుగుగూడెం గ్రామంలో సీతారాముల కళ్యాణ మహోత్సవం రంగ రంగ వైభవంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార యూనియన్ మాజీ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, సర్పంచ్ హైమావతి దంపతులు సీతారాములకు తలంబ్రాలు పోశారు. బురుగు గూడెం గ్రామంలో గత 28 సంవత్సరాల నుండి దేశిరెడ్డి దంపతులు ఆలయ పరిరక్షణతో పాటు ప్రతి ఏటా స్వామివారికి స్వయంగా తలంబ్రాలు పోయటం ఆనవాయితీగా వస్తోంది. భక్తులు జైశ్రీరామ్, జై హనుమాన్ అంటూ నినాదాలు చేస్తుండగా తలంబ్రాలు కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు విరివిగా పాల్గొన్నారు.

# శ్రీరాముని ఆశీస్సులతో రాష్ట్రంలో సుపరిపాలన

## - తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

## - సీతారామ కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

తణుకు, మార్చి 27 ( ప్రభాత వార్త): అధర్మం నుంచి ధర్మాన్ని రక్షించడానికి పోరాటం చేసిన యోధుడు శ్రీరాముడు అని ఎన్ని కష్టాలు వచ్చినా ఆరోజు ధర్మం వైపు నిలబడి ఆదర్శప్రాయుడిగా నిలిచారని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. తణుకు సీతారామాంజనేయ స్వామి వారి ఆలయంలో శుక్రవారం నిర్వహించిన సీతారాముని కళ్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే రాధాకృష్ణ, కృష్ణతులసి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే రాధాకృష్ణ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అటు అయోధ్యలో ఇటు భద్రాచలంలో ఎంత విభవంగా జరిగిందో అంతే వైభవంగా తణుకులో నిర్వహించుకోవడం అదృష్టంగా భావిస్తున్నామని చెప్పారు. శ్రీరాముని ఆశీస్సులతో రామరాజ్యంలో సర్వ భోగాలు, సుఖశాంతులు వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ ఆశీస్సులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో రాష్ట్రంలో ప్రజా రంజకమైన పరిపాలన రామ రాజ్య స్థాపన జరిగిందని అన్నారు. రాష్ట్రంలో ప్రజల జీవన ప్రమాణాలు పెరిగే విధంగా, యువతకు ఉపాధి అవకాశాలు మెరుగయ్యే విధంగా రాష్ట్రంలో గ్రామాలు అభివృద్ధి చేసుకునేలా మంచి పరిపాలన కొనసాగుతోందని చెప్పారు. శ్రీరాముని ఆశీస్సులతో రాష్ట్రంలో జరుగుతున్న సుపరిపాలన తణుకు నియోజవర్గంలో సైతం జరుగుతోందని ఇందుకు ప్రజలంతా సహకరించాలని ఎమ్మెల్యే రాధాకృష్ణ కోరారు. ఈ



కార్యక్రమంలో భక్తులు కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మతం మారిన ఎస్టీలపై అసత్య ప్రచారాలు మానుకోవాలి

## పాస్టర్ ఎజ్రా శాస్త్రి



జీలుగుమిల్లి, మార్చి-27, (ప్రభాతవార్త) : ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల మత మార్పిడి అంశంపై అసత్య ప్రచారాలు చేస్తూ సమాజంలో విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలవరం నియోజకవర్గ క్రిస్టియన్ జేఏసీ అధ్యక్షుడు బరగటి ఎజ్రా శాస్త్రి అన్నారు. శుక్రవారం మండల కేంద్రం జీలుగుమిల్లి గ్రేస్ మందిర్‌లో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎస్టీ వర్గాలకు చెందిన వారు క్రైస్తవ మతంలోకి మారితే వారి రిజర్వేషన్లు రద్దవుతాయనే ప్రచారం పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. ఇలాంటి ప్రచారాలు గిరిజన సమాజాన్ని తప్పుదోవ పట్టించడమే కాకుండా, వారి మధ్య అనవసరమైన భయాందోళనలు సృష్టిస్తున్నాయని అన్నారు. చట్టాలపై సరైన అవగాహన లేకుండా కొందరు ఉద్దేశపూర్వకంగా మతపరమైన విభేదాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇది సామాజిక సమైక్యతకు విఘాతం కలిగించే చర్యగా పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పులను ఉదహరిస్తూ, గిరిజనులు ఏ మతంలోకి మారినా వారి ఎస్టీ హక్కులు మరియు రిజర్వేషన్లు కొనసాగుతాయని ఆయన వివరించారు. ఈ విషయంపై ప్రజల్లో సరైన అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలు కొనసాగితే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామన్నారు. న్యాయవాది జువ్వాల బాపూజీ మాట్లాడుతూ, రాజ్యాంగం ప్రతి పౌరుడికి మత స్వేచ్ఛను కల్పించిందని, దానిని ఎవ్వరూ దెబ్బతీయకూడదని అన్నారు. యూపీఎఫ్ అధ్యక్షుడు సురేష్, యూపీఏ కార్యదర్శి సియోన్ కుమార్ మాట్లాడుతూ అసత్య ప్రచారాలను ఖండిస్తూ, గిరిజనుల హక్కులను కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఆదివాసీ క్రైస్తవ ఐక్య వేదిక అధ్యక్షుడు నిరీక్షణరావు, కూరం వెంకటేశ్వరరావు, అఖిల్, ఐజయ్య, ఫిలిప్, రవి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు ఇబ్బంది కలిగించే ఆక్రమణలను వెంటనే గుర్తించి తొలగించాలి

## జేసి టి. రాహుల్ కుమార్ రెడ్డి



పెనుమంట్ర, మార్చి 27, (ప్రభాతవార్త) :జిల్లాలో గ్రామాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజా సౌకర్యాల విస్తరణపై జిల్లా యంత్రాంగం దృష్టి సాధించిందని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. పెనుగొండ గ్రామ పంచాయతీ పరిధిలోని చెరుకువాడలో చిల్డ్రన్ పార్క్ మరియు రైతు బజార్ నిర్మాణాల కోసం అనువైన స్థలాలను శుక్రవారం ఆయన సంబంధిత శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామంలో ప్రజలకు ఇబ్బంది కలిగించే ఆక్రమణలను వెంటనే గుర్తించి తొలగించాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన భూములు, రహదారులు, చెరువులు, శ్మశానాలు మరియు ఇతర ప్రభుత్వ స్థలాలపై ఎవరైనా అక్రమంగా ఆక్రమణలు జరిపితే వాటిని కఠినంగా తొలగించాలని సూచించారు. గ్రామ అభివృద్ధి పనులకు ఎటువంటి ఆటంకం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో పార్కుల ఏర్పాటు వల్ల ప్రజలకు స్వచ్ఛమైన వాతావరణం, విశ్రాంతి మరియు వినోదం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా పిల్లలకు ఆటలు ఆడేందుకు, శారీరక వ్యాయామం చేసేందుకు అనువైన స్థలం లభించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవన విధానం అలవడుతుందని తెలిపారు. అలాగే పిల్లలలో సామాజిక పరస్పర చర్యలు పెరిగి, సమాజంలో బంధాలు మరింత బలపడతాయని పేర్కొన్నారు. రైతు బజార్ల ప్రాముఖ్యతను వివరిస్తూ, రైతులు తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించే అవకాశం రైతు బజార్ల ద్వారా లభిస్తుందని తెలిపారు. దీని ద్వారా మధ్యవర్తుల ప్రభావం తగ్గి, రైతులకు సరైన ధర లభిస్తుందని చెప్పారు. వినియోగదారులకు తాజా కూరగాయలు, పండ్లు సరసమైన ధరలకు అందుబాటులోకి వస్తాయని, తద్వారా రైతుల ఆదాయం పెరగడంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని ఆయన వివరించారు.

**రామేశ్వర స్వామి దేవస్థానం దర్శించుకున్న జాయింట్ కలెక్టర్:**

తొలుత ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఆచంట రామేశ్వర స్వామి దేవస్థానం ను జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి, దర్శించుకున్నారు. పూజారులు ఆలయ మర్యాదలతో జిల్లా జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అనిత కుమారి, పంచాయతీ కార్యదర్శి కృష్ణారెడ్డి, గ్రామ సర్పంచ్ నక్క శ్యామల సోనీ, సొసైటీ అధ్యక్షులు నక్క వేదవ్యాస్ శాస్త్రి, కటికిరెడ్డి నానాజీ, ఆర్.సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# కన్నుల పండగగా రామయ్య కళ్యాణం

## -కళ్యాణం వీక్షించి పులకించిన మండల ప్రజలు



వేలేరుపాడు, మార్చి 27 (ప్రభాత వార్త ) : వేలేరుపాడు మండలంలోని శివకాశీపురం ఎర్రబోరు జగన్నాధపురం భూదేవిపేట తదితర దేవాలయాల్లో శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేలేరుపాడు మండలం నుండి భద్రాచలంలోని సీతారాముల కళ్యాణం తిలకించడానికి భక్తులు తరలి వెళ్లారు. మరికొందరు భక్తులు గోదావరి నదిని దాటి శ్రీరామగిరిలోని దేవాలయాన్ని చేరి సీతారాముల కళ్యాణాన్ని వీక్షించారు. తెల్లవారుజాము నుండె భక్తులతో దేవాలయాలు కిక్కిరిసిపోయాయి. శుక్రవారం ఎక్కడ చూసినా సీతారాముల కళ్యాణం సందడే కనిపించింది. భక్తులు వారికి ఇష్టమైన దేవాలయాల్లో కళ్యాణాన్ని వీక్షించి తమ జన్మ ధన్యమయినట్లు భావించినట్లు తెలియజేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవాలయాల కమిటీలు తగు జాగ్రత్తలు తీసుకున్నారు.గత సంవత్సరం కంటే ఈ యేడు సీతారాముల కళ్యాణం ఘనంగా జరిగిందని చెప్పవచ్చు.

# వైభవంగా చందనోత్సవం



ఆగిరిపల్లి మార్చి 27 ప్రభాతవార్త.: సింగన్నగూడెం బస్ స్టాప్ వద్దగల శ్రీ సర్వ కార్యసిద్ధి షిరిడి సాయిబాబా వారి ఆలయంలో శ్రీరామనవమిని పురస్కరించుకొని శుక్రవారం సాయంత్రం చందనోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ముందుగా బాబా వారి హారతి అనంతరం సాయిబాబా వారి పల్లకి సేవ డబ్బు వాయిద్యాలతో నిర్వహించిన తదుపరి చందన ఉత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాలు ఆలయ ప్రధాన సేవకులు దేవులపల్లి నరసింహమూర్తి నిర్వహించగా ఆలయ కమిటీ సభ్యులు కంభంపాటి శ్రీనివాసరావు సునీత దంపతులు ఉభయ దాతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కానుల్ల కోటేశ్వరరావు, పోతుకూరి కోటేశ్వరరావు, చిమట రాజేష్, పలువురు భక్తులు పాల్గొన్నారు.

# మండలవ్యాప్తంగా వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

## ఆలయాలవద్ద అన్న ప్రసాద వితరణలు

ఆగిరిపల్లి, మార్చి 27 ప్రభాతవార్త మండలంలో శ్రీరామనవమి వేడుకలు భక్తి శ్రద్ధల మధ్య అంగరంగ శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆగిరిపల్లిలోని పొగడచెట్ల మండపంలో వేద మంత్రోచ్చరణల నడుమ సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో కొలువై ఉన్న సీతారామచంద్ర స్వామిని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రధాన వీధులలో గ్రామోత్సవం నిర్వహించి పొగడచెట్ల మండపానికి తీసుకువచ్చారు. అనంతరం ఆలయ అర్చకులు వేదాంతం శేషుబాబు సీతారాముల కళ్యాణాన్ని శాస్త్రోక్తంగా వైభవంగా నిర్వహించారు. ఆగిరిపల్లి విజయవాడ రోడ్డులోని శ్రీ కోదండరామాలయంలో జరిగిన సీతారాముల కల్యాణం భక్తులను మంత్రముగ్ధులను చేసింది. కార్యక్రమం అనంతరం ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ నిర్వహించారు. మండల కేంద్రంలో, వెంకటాచల మండపం, చిన్నగిరిపల్లి, చొప్పరమెట్ల, తాడేపల్లి, గోపాలపురం, వట్టిగుడిపాడు, నెక్కలం అడ్డరోడ్డు, వడ్లమాను ఎస్‌ఏ పేట, సూరవరం, ఈదులగూడెం, సీతారాంపురం, శోభనాపురం, కొత్త ఈదర, తోటపల్లి తదితర గ్రామాల్లోని రామాలయాల వద్ద కళ్యాణోత్సవాలు నిర్వహించి భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.



# మట్టి మాఫియా దాటికి కనుమరుగు అవుతున్న మురుగుకాలువ



మొగల్తూరు మార్చి27 (ప్రభాతవార్త) పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం పేరుపాలెం నార్త్ పంచాయతీ ఆడబాలవారి మెరక సమీపంలో అక్రమ మట్టి తవ్వకాలు తారస్థాయికి చేరాయి. అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు లేకపోయినా అక్రమ మట్టితవకాలు ఏద్దేచ్ఛగా సాగుతునయని దీని వల్ల స్థానిక ప్రజల ఇళ్లలోకి దుమ్ము చేరుతుందని స్థానిక ప్రజలు ఆవేదన చెందుతున్నారు. మట్టి మాఫియా దారులు ప్రజాప్రతినిధుల అనుచరులు కావడంతో సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడట్లేదని ప్రజలు చెబుతున్నారు. ఆక్రమణదారులు పక్కనే ఉన్న మురుగు కాలువను సైతం కబ్జా చేసేస్తున్నారని మురుకు కాలువ అక్రమాలకు గురవ్వడం వల్ల కాలువపై ఆధారపడిన రైతులు పూర్తి స్థాయిలో నష్టపోయే అవకాశం ఉందని ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి ఈ ప్రాంతాన్ని సందర్శించి అక్రమ మట్టి రవాణా తవ్వకాలను ఆపాలని ప్రజలు వేడుకుంటున్నారు.

## నియోజకవర్గ ప్రజలందరికీ
# శ్రీరామ నవమి శుభాకాంక్షలు

లింగపాలెం మండలం మార్చి 27 ప్రభాత వార్త : లోకాన్ని కాపాడేందుకు జీవితాన్నే త్యాగం చేసిన మహోపకారి,మహోన్నత ప్రజా పాలకుడు శ్రీరాముడు లోక కళ్యాణం కోసం ఎన్నో త్యాగాలకోర్చిన సీతారాముల పవిత్ర బంధం అజరామరమైనది... భవిష్యత్ తరాలకు ఆదర్శనీయమైనదని మీూా రోషన్ కుమార్ పేర్కొన్నారుశ్రీరాముని ఆశీస్సులతో నియోజవర్గంలో అభివృద్ధి సంక్షేమం కలగలసి ప్రజలు సుఖశాంతులతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ తన స్వగ్రామమైన ధర్మాజీగూడెంలో మీూా రోషన్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు కోదండరామాలయం నకు పట్టు వస్త్రాలు సమర్పించిన చింతలపూడి ఎమ్మెల్యే రోషన్ కుమార్ సమర్పించారు.శ్రీరామనవమి కళ్యాణ మహోత్సవం సందర్భంగా ధర్మాజీగూడెం గ్రామంలో హైస్కూల్ రోడ్డులో శ్రీ సీతారామాంజనేయ ఆలయం, తూర్పువీధిలో సీతారామాలయం, వడమట వీధిలో కోదండ సీతారామాలయం, కాటమ రెడ్డిపల్లిలో రామాలయంలను చింతలపూడి శాసన సభ్యులు సొంగ రోషన్ కుమార్



స్వామివారిని దర్శించుకున్నారు. వేడుకలను జరుపుకుంటాం. శ్రీరాముడు అంటేనే ప్రజారంజక పాలన. అలాంటి రామరాజ్యాన్ని స్థాపించుకోవడానికి మన వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాలి. శ్రీరామచంద్రమూర్తి సుగుణాలతో ప్రతి ఒక్కరూ ఆదర్శ జీవితం గడపాలని, మీకు, మీ కుటుంబానికి ఆ శ్రీరాముడి కృపాకటాక్షం ఉండాలని తెలియజేసారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## వాడవాడలో సీతారాముల కళ్యాణం మహోత్సవం

చాట్రాయి, మార్చి 27,ప్రభాతవార్త : చాట్రాయి మండలంలో వాడవాడలా సీతారాముల కళ్యాణం రంగ రంగ వైభవంగా నిర్వహించారు.శుక్రవారం శ్రీరామనవమి కావడంతో మండలంలో అన్ని గ్రామాలలో సీతారాముల కళ్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు. మండలంలోని చనుబండ గ్రామంలో అపర భద్రాద్రిగా పిలవబడే శ్రీ కోదండ రామాలయం భక్తులతో కిటకిటలాడింది. తెలంగాణ ప్రాంతం నుండి కూడా విరివిగా భక్తులు రావడంతో కళ్యాణ మహోత్సవం రంగ రంగ వైభవంగా జరిగింది. ఆలయ చైర్మన్ పుచ్చకాయల చెన్నకేశవరెడ్డి దంపతులతో పాటు నూజివీడు డీఎస్పీ ప్రసాద్ దంపతులు, సర్కిల్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ దంపతులు పలువురు కళ్యాణ మహోత్సవంలో పాల్గొని తలంబ్రాలు పోశారు. చాట్రాయి ఎస్సై రామకృష్ణ బందోబస్తు ఏర్పాటు చేశారు. మండలంలో ఆరుగొలను పేట గ్రామంలో కళ్యాణం వైభవంగా నిర్వహించగా సర్పంచ్ పుచ్చకాయల అప్పిరెడ్డి దంపతులు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఇజ్జిగాని వెంకటేశ్వరరావు దంపతులతో పాటు మరో 10 మంది దంపతులు తలంబ్రాల కార్యక్రమంలో పాల్గొనగా అన్నదానం కార్యక్రమం నిర్వహించగా భక్తులు విరివిగా



పాల్గొన్నారు.జనార్ధనవరం గ్రామంలో కళ్యాణం వైభోగంగా నిర్వహించారు. అదే గ్రామంలో మాల పల్లెలో నిర్మించిన రామాలయంలో భక్తులు భక్తులతో కళ్యాణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయగా భక్తులు భారీగా తరలివచ్చారు.మండల కేంద్రమైన చాట్రాయిలో కళ్యాణం ఘనంగా నిర్వహించగా భక్తులతో ఆలయం పోటెత్తింది. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించగా వేలమంది భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు.మండలంలో అన్ని గ్రామాలలో కళ్యాణం నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

## కోదండరామాలయం నకు పట్టు వస్త్రాలు సమర్పించిన
## ఎమ్మెల్యే రోషన్ కుమార్.

చింతలపూడిమార్చి 27 ప్రభాతవార్త :శ్రీరామనవమి కళ్యాణ మహోత్సవం సందర్భంగా ధర్మాజీగూడెం గ్రామంలో హైస్కూల్ రోడ్డులో శ్రీ సీతారామాంజనేయ ఆలయం, తూర్పువీధిలో సీతారామాలయం, వడమట వీధిలో కోదండ సీతారామాలయం, కాటమ రెడ్డిపల్లిలో రామాలయంలను చింతలపూడి శాసన సభ్యులు సొంగ రోషన్ కుమార్ స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధర్మానికి, సుపరిపాలనకు ప్రతీకగా నిలిచిన ఆదర్శ పురుషుడు, కర్తవ్య పరాయణుడు శ్రీరాముడు అని అన్నారు. ఆయన అవతరించిన రోజు, ఆయన కళ్యాణం జరిగిన రోజు మనం శ్రీరామనవమి వేడుకలను జరుపుకుంటాం. శ్రీరాముడు అంటేనే ప్రజారంజక పాలన. అలాంటి రామరాజ్యాన్ని స్థాపించుకోవడానికి మన వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాలి. శ్రీరామచంద్రమూర్తి సుగుణాలతో ప్రతి ఒక్కరూ ఆదర్శ జీవితం గడపాలని, మీకు మీ



కుటుంబానికి ఆ శ్రీరాముడి కృపాకటాక్షం ఉండాలని తెలియజేసారు. కార్యక్రమంలో కూటమి నాయకులు గారపాటి నాగ బుద్ధ సొసైటీ అధ్యక్షులు నిమ్మగడ్డ సుధాకర్. వరప్రసాద్ గారపాటి సాయి. మోరంపూడి ప్రసాద్. కుర్ర వెంకట సుబ్రహ్మణ్యం వరప్రసాద్. చెరువుగట్టు రామ్మోహన్రావు. గజ్జ వెంకటేశ్వరరావు. గ్రామ పార్టీ అధ్యక్షులు శ్రీనివాసరావు. కూటమి నాయకులు అభిమానులు కార్యకర్తలు భక్తులు పాల్గొన్నారు.

## సీతారాముల కళ్యాణ మహోత్సవానికి పట్టు వస్త్రాలు

భీమవరం మార్చి 27 ప్రభాతవార్త : శ్రీరామ నవమి సందర్భంగా రైల్వే కాలనీలోని రామాలయంలో జరుగుతున్న సీతారాముల కళ్యాణ మహోత్సవానికి భీమవరం హౌసింగ్ బోర్డ్ కాలనీ శ్రీపద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి వారి ఆలయం తరుపున ఆలయ అధ్యక్షులు కంతేటి వెంకటరాజు పట్టు వస్త్రాలను అందించారు. బొల్లా శివప్రసాద్, బాల వాణి దంపతులు, చారుగళ్ళ చక్రవర్తి, యామిని సృజన దంపతులు, పెన్నమరెడ్డి సాయి మోహన్, నవ్య వెంకట అనూష దంపతులచే ఆలయ అర్చకులు శ్రీనివాసుల పార్ధసారథి బ్రహ్మ, ఈమని పవన్ కుమార్ శర్మలకు శ్రీవారి శేష వస్త్రాలను అందజేశారు. అనంతరం స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పాణింగిపల్లి శ్రీనివాసాచార్యులు, కార్యదర్శి కుక్కల బాల వెంకటరత్నం, కెవిఎస్ భాస్కరరావు, కదలి



వెంకటేశ్వరరావు, అల్లూరి బంగార్రాజు, గొన్నాబత్తుల మల్లేశ్వరరావు, సయ్యపరాజు సూర్యనారాయణ రాజు, మారిశెట్టి రాంప్రసాద్, కదలి ఫణి కుమార్, గంధం వెంకటేశ్వరరావు, పద్మావతి మహిళా పారాయణం బృందం, శ్రీవారి భక్తులు, రామ భక్తులు రైల్వే అధికారులు పాల్గొన్నారు.

## రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్నవారు ప్రజలందరినీ సమాన దృష్టితో చూడాలి

భీమవరం టౌన్, మార్చి 27 : ప్రభాత వార్త :ఆకివీడు పట్టణం పెదపేటలో ఉన్న స్థలం విషయంలో పేటవాసులకు ఇతరులకు వివాదంలో డిప్యూటీస్పీకర్ కె.రఘు రామకృష్ణంరాజు వ్యవహరిస్తున్న తీరుని సిపిఎం జిల్లా కమిటీ ఖండించింది. ఈ మేరకు సిపిఎం జిల్లా కార్యదర్శి జె.ఎన్.వి.గోపాలన్ ఒక ప్రకటన



విడుదల చేశారు. ఆకివీడు పట్టణ పెదపేటలో ఒక స్థలంలో దేవుని పూజింపు విషయంలో గతకొంత కాలంగా పేటవాసులకు ఇతరులకు వివాదం తలెత్తిందని ఆయన తెలిపారు. ప్రజలమధ్య మతపరమైన బావోద్వేగాలు ఏర్పడినపుడు రాజ్యాంగ బద్ధమైన పదవుల్లో ఉ న్నవారు వాటిపై సామరస్యంగా చర్చలు జరిపి ఉద్రిక్తతలు నివారించే పనిచేయాలి తప్ప ఆజ్యంపోసే విధంగా వ్యవహరించరాదని ఆయన అన్నారు. రాజ్యాంగబద్ద పదవులలో ఉ న్నవారు ఏ మతంలో, ఏ కులంలో పుట్టినా వాటితో నిమిత్తంలేకుండా ప్రజలందరని సమాన దృష్టిలో లో చూడాలి తప్ప ఒకరిపైకి మరొకర్ని ఉసికొల్పడం సరైంది కాదని ఆయన అన్నారు. జిల్లాలో గాని, నియోజకర్గంలో గాని ఎప్పుడూ కనీవినీ ఎరుగని విధంగా ప్రజల్ని చీల్చే సంఘటనలు జరగడం పట్ల ఆందోళన, విచారం వ్యక్తం చేశారు. సమస్యాత్మకంగా ఉన్న ప్రాంతంలోకి ఎం.ఎల్.ఎ ని పోలీసులు ఎలా అనుమతించారని ఇది పక్షపాత వైఖరి కాదా అని ప్రశ్నించారు. ప్రశాంతంగా ఉండే జిల్లాలో మత పరమైన ఉద్రిక్తతలకు తావు లేకుండా చూడాలని కోరారు. టిడిపి అధినా యకత్వం మత ఉద్రిక్తతలు, ప్రజల మధ్య ద్వేషాలు పెంచుతున్న రఘురామ కృష్ణం రాజుని కట్టడిచేయాలని కోరారు. ఉద్రేకా లకు లోను కాకుండా ప్రశాంతంగా ఉండా లని శాంతి సామరస్యాలను అందరూ కాపా డాలని ఆయనకోరారు. వివాద పూర్వప రాలను అధ్యయనం చేసి సమస్య పరిష్క రించేందుకు, ఉద్రిక్తతలు పెరగకుండా, ప్రశాంత, సామరస్య వాతావరణం ఏర్పడేలా జిల్లా అధికార యంత్రాంగం కృషి చేయాలని ఆయన కోరారు.

## తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో రామాలయాలకు బెల్లం వితరణ

వేలేరుపాడు, మార్చి 27(ప్రభాత వార్త ) : తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతా రామంజనేయ చౌదరి శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్నీ రామాలయాలకు శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా పానకం నిమిత్తం ప్రతి సంవత్సరం తపన ఫౌండేషన్ తరపున బెల్లాన్ని అదేవిధంగా శ్రీరాముని జండాలను కానుకగా ఇవ్వడం జరుగుతుంది.అందులో భాగంగా వేలేరుపాడులోని రామాలయాలకు సుమారు నూటా నలభై(140) కిలోల బెల్లాన్ని తపన ప్రతినిధి బి శివరామ్ ప్రసాద్ ద్వారా అందజేశారు.వేలేరుపాడు మండలంలోని యర్రబోరు, జగన్నాధపురం, కన్నాయిగుట్ట, మేడేపల్లి, కోయ మాదారం, కమ్మరిగూడెం, పెద్ద బుర్రతోగు,భూదేవిపేట, రుద్రమకోట మొదలైన గ్రామాల్లో సుమారు 140కిలోల బెల్లం పంపిణి కార్యక్రమం నిర్వహించారు.ఈ యొక్క కార్యక్రమంలో తపన ప్రతినిధి బి శివరామ్ ప్రసాద్ బీజేపీ మండల



అధ్యక్షులు ఓలేటి అనిల్(బాలకృష్ణ) గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.

### అంతర్జాతీయ సంక్షోభంలోనూ సామాన్యుడికి
### రక్షణ కవచంలా కేంద్ర ప్రభుత్వం

భీమవరం మార్చి 27 ప్రభాతవార్త : అంతర్జాతీయ పరిణామాలు, పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ మేఘాల వల్ల ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు ఆకాశాన్ని తాకుతున్నా, భారత్‌లో సామాన్య ప్రజలపై ఆ భారం పడకుండా కేంద్ర ప్రభుత్వం రక్షణ కవచంలా నిలుస్తోందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ హర్షం వ్యక్తం చేశారు. గౌరవ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ



దార్శనికత వల్లే ఇది సాధ్యమైందని ఆయన కొనియాడారు. ?ఈ సందర్భంగా కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు పెరిగినప్పటికీ, దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు అదుపులో ఉంచేందుకు కేంద్రం ఎక్సైజ్ సుంకాన్ని ఏకంగా 10 రూపాయల వరకు తగ్గించిందన్నారు. ఆ ఆర్థిక భారాన్ని ప్రభుత్వమే భరిస్తూ సామాన్యుడికి ఊరటనిచ్చింది అని పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం తమ అధికారాన్ని కాపాడుకోవడం కోసం ఆయిల్ బాండ్లు జారీ చేసి దేశ ఆర్థిక వ్యవస్థను, భవిష్యత్ తరాలను అప్పుల ఊబిలోకి నెట్టి తాకట్టు పెట్టిందని కేంద్రమంత్రి విమర్శించారు. మోదీ ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ క్లిష్ట పరిస్థితుల్లోనూ దేశ ప్రయోజనాల కోసం దృఢమైన నిర్ణయాలు తీసుకుంటోందని, దేశాన్ని ఆర్థికంగా బలోపేతం చేస్తూనే ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేయడం మోదీ గారి సమర్థ నాయకత్వానికి నిదర్శనమని శ్రీనివాస వర్మ కొనియాడారు. ?ప్రజల కష్టాలను స్వయంగా తెలిసిన నాయకుడిగా ప్రధాని మోదీ తీసుకున్న ఈ నిర్ణయాలు దేశాభివృద్ధికి, సామాన్యుడి సుస్థిరతకు ఎంతో దోహదపడతాయని శ్రీనివాస వర్మ ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు.

## తాగునీటి సమస్య పరిష్కారం



చాట్రాయి, మార్చి 27, ప్రభాతవార్త చాట్రాయి మండలం చనుబండ శివారు సూరంపాలెం బీసీ మరియు ఎస్సీ కాలనీలకు నీటి సమస్య పరిష్కారమైంది. గత మూడు రోజుల నుండి పంచాయతీ మోటార్ కాలిపోవడంతో తాగునీటి సమస్య ఉత్పన్నం కాగా తాగునీరు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని నూజివీడు నియోజకవర్గం ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నక్కా రాము తెలియజేయగా వెంటనే స్పందించిన ఎంపీడీవో రాజు మోటర్ మరమ్మతులు చేయించి కొత్త ప్యానెల్ బోర్డు మరియు వైరు వేయించి మోటర్ బాగు చేయటంతో సమస్య పరిష్కారమైంది. తక్షణమే స్పందించిన ఎండిఓ కు గ్రామస్తులు ధన్యవాదాలు తెలియజేశారు.

## వాడవాడలా
## రాములోరి కళ్యాణాలు



అత్తిలి,మార్చి 27( ప్రభాతవార్త) అత్తిలి మండలంలో వాడవాడలా సీతారాముల కళ్యాణోత్సవాలు ఘనంగా నిర్వహించారు. దేవాలయాల వద్ద పందిళ్లు నిర్మించి విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. అత్తిలి సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద గల కోదండరామ స్వామి వారి ఆల యం వద్ద ఆలమూరి నాగ వెంకట మణికంఠరాజు దంపతులు కళ్యాణాన్ని నిర్వహించారు. భక్తులకు ప్రసాదం, పానక వితరణ జరిపారు. ఆలయ కమిటీ నిర్వాహకులు అల్లబాని అప్పారావు, అర్చకుడు వాడపల్లి రామాచార్యులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అత్తిలి ఆంజనేయస్వామి దేవాలయంలో సీతారాముల కళ్యాణం ఘనంగా జరిపారు. ఆకుల ఆంజనేయులు దంపతులు కళ్యాణం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ తోట అయ్యప్ప,రాపాక ప్రసాద్ తదితరుల ఆధ్వర్యంలో అఖండ అన్న సమారాధన జరిపారు. ఆలయ అర్చకులు చేబోలు భీమేష్ తదితరుల ఆధ్వర్యంలో కళ్యాణం జరిగింది. అత్తిలి రైల్వే స్టేషన్ రోడ్ లో గల కోదండ రామాలయం వద్ద సీతారాముల కళ్యాణం యడ్లపల్లి చౌదరయ్య దంపతులు నిర్వహించారు. ఆలయ అర్చకులు వాడపల్లి సత్యనారాయణాచార్యులు, వల్లి వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అత్తిలి రామన్నపేట వద్ద గల రామాలయంలో సీతారాముల కళ్యాణం అత్యంత ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. గోగులమ్మపేట పెద రామాలయం వద్ద సీతారాముల కళ్యాణం ఘనంగా జరిపారు.

## ఎస్సీ ప్రాంతాలకు
## నవమి కిట్లు పంపిణీ



అత్తిలి, మార్చి 27 ( ప్రభాత వార్త )చివటం శ్రీ హైందవి వారి సౌజన్యం తో అత్తిలి మండలం లో గల గ్రామాలలోని ఎస్ సి,ఎస్ టి కాలనీలలో ఉన్న దేవాలయాలకు పానకం కిట్ , ధూప దీప నైవేద్యం కిట్ లు హనుమాన్ శక్తి జాగరణ సమితి వారి ఆధ్వర్యం లో అందజేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో శ్రీరామనవమి ఉత్సవాలు నిర్వహించారు.

## వాడ వాడలా సీతారాముల కళ్యాణ్ మహోత్సవాలు

కాళ్ళ మార్చి 27 (ప్రభాతవార్త):శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో వాడ వాడలా శ్రీరామనవమి వైభవంగా నిర్వహించారు. సీతారాముల కళ్యాణం మహోత్సవం ఆయా దేవాలయాల్లో ఘనంగా జరిపారు. మండల కేంద్రమైన కాళ్లలో గనిశెట్టి ఆదినారాయణ దంపతులచే రంగ రంగ వైభవంగా సీతారాముల కళ్యాణం జరిపారు. వేంపాడు, జక్కరం, కోపల్లె, బొండాడ, బొండాడపేట, ఎల్. ఎన్.పురం, ఆనందపురం, మేకలదిబ్బ, కాళ్ళ, దొడ్డనపూడి, జువ్వలపాలెం, కలవపూడి, ఏలూరుపాడు, ఎస్ సి బోస్ కాలనీ, మాలవానితిప్ప, కాళ్ళకూరు, వెంకటాపురం, కొత్తచెరువు, పెదఅమిరం, గ్రామాల్లో పలుచోట్ల



అంగరంగ వైభవంగా రాముల కళ్యాణం నిర్వహించారు. తలంబ్రాలు పంచారు. పల్లకిలపై ఊరేగింపు నిర్వహించారు. వివిధ రకాల వేషాలు, మేళ తాళాలతో, ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కాళ్ళకూరు వెంకన్నను దర్శించుకున్న భరత్

కాళ్ళ, మార్చి 27 (ప్రభాతవార్త) : మండలంలోని కాళ్ళకూరు స్వయంభూః శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో స్వామివారిని ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతి, స్థానిక శాసనసభ్యులు కనుమూరి రఘురామకృష్ణం రాజు తనయుడు కనుమూరి భరత్ పుట్టినరోజు సందర్భాన్ని పురస్కరించుకుని శ్రీస్వామివారిని దర్శించుకున్నారు.



## 24 మంది నాటక, సంగీత, నృత్య కళాకారులకు సత్కారం

భీమవరం మార్చి 27 ప్రభాతవార్త : సమాజాన్ని పెనుమార్పుల నుంచి మంచి వైపు నడిపేలా ప్రభావితం చేయడానికి నాటక రంగం దోహదపడుతుందని పట్టణ కళాకారుల సంఘం కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, ప్రజా నాట్య మండలి జిల్లా కార్యదర్శి మల్లుల సీతారామ ప్రసాద్ అన్నారు. భీమవరం వెంకట్రామ థియేటర్ లో శుక్రవారం పట్టణ కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని పురస్కరించుకుని 24 మంది నాటక, సంగీత, నృత్య కళాకారులకు సత్కరించారు. వారు మాట్లాడుతూ నాటకాల ప్రాముఖ్యతను నేటి యువతరానికి తెలియజేయాలని, ప్రభుత్వాలు కూడా ఆదుకోవాలని అన్నారు. శ్రీవిజయ దుర్గ ఆర్ట్స్ థియేటర్ వైస్ ప్రెసిడెంట్ డా గాదిరాజు రంగరాజు, నాటక కళాకారులు పులగం నరసింహారావు, కొల్లాబత్తుల సూర్య కుమార్ మాట్లాడుతూ నాటకాలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం ముందడుగు వేయాలని,



తీర్దాలు, ఉత్సవాల్లో రంగస్థలానికి ప్రాముఖ్యత ఇవ్వాలని అన్నారు. అనంతరం 24 మంది నాటక, సంగీత, నృత్య కళాకారులకు సత్కరించారు. కార్యక్రమంలో కళాకారులు కాటి వెంకటరత్నం, షేక్ వల్లి, ఆదినారాయణ, దాశరధి శ్రీనివాస్, గొన్నాబత్తుల మల్లేశ్వరరావు, కలిగొట్ల గోపాల శర్మ, డా ఎస్ఎస్ రాజు, డా నాగేశ్వరరావు, కొత్తపల్లి త్రినాధ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## సీతారాముల కళ్యాణ మహోత్సవం
## ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం మార్చి 27 ప్రభాతవార్త : భీమవరం 14వ వార్డులోని ముత్యావారి తోటలో శ్రీరామబాల భక్త మణికంఠ యువజన సంఘం ఆధ్వర్యంలో శ్రీరామ నవమి వేడుకలను రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ప్రారంభించారు. వెలుగురి నాగ ధర్మతేజ, బేబీ మాధురి దంపతులచే సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని జరిపించారు. 50 ఏళ్లుగా ఎంతో సంప్రదాయ బద్ధంగా శ్రీరామ నవమి వేడుకలను నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ శ్రీరాముని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని కోరుకుంటున్నానని అన్నారు.

**మద్దుల రాము పుట్టినరోజు వేడుకలు**

స్నేహశీలి సౌమ్యుడు అందరితో కలిసి మెలిసి ఉండే మంచి మనసున్న వ్యక్తి మద్దుల రాము అని ఎమ్మెల్యే అంజిబాబు, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. టిడిపి పట్టణ అధ్యక్షులు మద్దుల రాము పుట్టినరోజు వేడుకలను వారి నివాసం వద్ద నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి రాము ను సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్ధసారధి, రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, కృష్ణ బలిజ



కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు, ఏఎంసీ వైస్ చైర్మన్ బండి రమేష్, వబిలిశెట్టి రామకృష్ణ, షబీనా బేగం, చెల్లబోయిన గోవింద్, చెరుకు తిరుపతిరావు, మైలబత్తుల ఐజాక్ బాబు, మదాసు కనకదుర్గ, చెల్లబోయిన సుబ్బారావు, ఎండి షాబు, మావుళ్ళయ్య, గనిరెడ్డి సూర్యనారాయణ, సియాద్రి వెంకన్న, నేదునూరి గంగాధర్ తిలక్, నక్క లక్ష్మీ, శ్రీను, ఫిరోజ్, యలమంచిలి శ్రీను, కోళ్ల నాగబాబు, వానపల్లి సూరిబాబు, పడమట సోమేశ్వరరావు, పడమటి నరసింహ మూర్తి, పాపోలు ఏడుకొండలు, గనిశెట్టి రాము, వడ్డీని వీరబాబు, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

## మద్దుల రాము పుట్టినరోజు వేడుకలు

భీమవరం మార్చి 27 ప్రభాతవార్త : స్నేహశీలి సౌమ్యుడు అందరితో కలిసి మెలిసి ఉండే మంచి మనసున్న వ్యక్తి మద్దుల రాము అని ఎమ్మెల్యే అంజిబాబు, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. టిడిపి పట్టణ అధ్యక్షులు మద్దుల రాము పుట్టినరోజు వేడుకలను వారి నివాసం వద్ద నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి రాము ను సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్ధసారధి, రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, కృష్ణ బలిజ కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు, ఏఎంసీ వైస్ చైర్మన్ బండి రమేష్, వబిలిశెట్టి రామకృష్ణ, షబీనా బేగం, చెల్లబోయిన గోవింద్, చెరుకు తిరుపతిరావు, మైలబత్తుల ఐజాక్ బాబు, మదాసు కనకదుర్గ, చెల్లబోయిన సుబ్బారావు, ఎండి షాబు, మావుళ్ళయ్య, గనిరెడ్డి సూర్యనారాయణ, సియాద్రి వెంకన్న, నేదునూరి గంగాధర్ తిలక్, నక్క లక్ష్మీ, శ్రీను, ఫిరోజ్, యలమంచిలి



శ్రీను, కోళ్ల నాగబాబు, వానపల్లి సూరిబాబు, పడమట సోమేశ్వరరావు, పడమటి నరసింహ మూర్తి, పాపోలు ఏడుకొండలు, గనిశెట్టి రాము, వడ్డీని వీరబాబు, చిన్ని తదితరులు పాల్గొన్నారు.

## భీమవరంలో రామ్ చరణ్ పుట్టినరోజు వేడుకల
## -దివ్యాంగులకు నిత్యవసర సరుకులు, రక్తదాన శిబిరం

భీమవరం మార్చి 27 ప్రభాతవార్త సామాజిక స్పృహతో మెగాభిమానులు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పద్మాలయ థియేటర్ ప్రొప్రైటర్ దాట్ల రామకృష్ణంరాజు అన్నారు. సినీనటులు మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా మెగా ఫ్యాన్స్ ఆధ్వర్యంలో పద్మాలయ థియేటర్ వద్ద శుక్రవారం కేక్ కటింగ్, దివ్యాంగులకు నిత్యవసర సరుకులు అందించారు. అనంతరం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రాంచరణ్ మగధీర, రంగస్థలం వంటి సినిమాల్లో తనదైన నటనతో అలరించారని, చిరంజీవి తనయుడిగా సినీ అరంగేట్రం చేసిన రాంచరణ్ సమాజ సేవ గుర్తు చేసేలా ప్రతి సినిమాలో ఓ మెసేజ్ ఇస్తూ వస్తున్నారన్నారు. టౌన్ వైడ్ మెగా ఫాన్స్ అధ్యక్షుడు చల్లా రాము మాట్లాడుతూ రామ్ చరణ్ తన నటన తో దక్షిణాది రాష్ట్రాల్లో తండ్రికి తగ్గ తనయుడిగా పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నారని, భవిష్యత్తులో మరిన్ని మంచి చిత్రాల విజయాలతో ముందుకు వెళ్లాలన్నారు. ఆర్ఆర్ఆర్ సినిమాలో రాంచరణ్ నటన కారణంగా విదేశాల్లో సైతం అభిమానులను సంపాదించుకున్నారని, పెద్ది సినిమాతో మరోమారు



ప్రేక్షకులను అలరించబోతున్నారని అన్నారు. అనంతరం 25 మంది మెగా అభిమానులు రక్తదానం చేశారు. 20 మంది దివ్యాంగులకు నిత్యవసర సరుకులను అందించారు. కార్యక్రమంలో థియేటర్ మేనేజర్ రామకృష్ణ, ప్రభాకర్, యాసా అనిల్, కొప్పినీడి బాబి, కొప్పర్తి కోటి, పితాని కృష్ణ, దూసనపూడి గోపాలకృష్ణ, ములగపాటి అరుణ్ కుమార్, యాతం స్వామి, తోట శేషు, యడ్లపల్లి రాంబాబు, గొంతు శ్రీను, దూది రాము, కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

## సిలిండర్ పొదుపు చిట్కాలు: గ్యాస్ కష్టాల నుంచి గట్టెక్కండిలా!

కామవరపుకోట,మార్చి 27(ప్రభాత వార్త): వంటింట్లో చిన్నపాటి మెలకువలు పాటిస్తే గ్యాస్ సిలిండర్‌ను గణనీయంగా ఆదా చేసుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వంట చేసేటప్పుడు ప్రెషర్ కుక్కర్ల వాడకం వల్ల 50 శాతం వరకు ఇంధనం ఆదా అవుతుంది. పప్పులు, బియ్యం వంటి వాటిని వండటానికి గంట ముందే నానబెట్టడం వల్ల అవి త్వరగా ఉడికి గ్యాస్ వినియోగం తగ్గుతుంది.పప్పులు, బియ్యం వంటి వాటిని వండటానికి గంట ముందే నానబెట్టడం వల్ల అవి త్వరగా ఉడికి గ్యాస్ వినియోగం తగ్గుతుంది. ఫ్రిజ్‌లో ఉంచిన పాలు లేదా కూరగాయలను నేరుగా పొయ్యి మీద పెట్టకుండా, గది ఉష్ణోగ్రతకు వచ్చాకే వేడి చేయడం ఉత్తమం. వంటకు కావాల్సిన వస్తువులన్నీ ముందే సిద్ధం చేసుకుని స్టవ్ వెలిగించడం వల్ల అనవసరపు వృథాను అరికట్టవచ్చు.పాత్రలపై ఎప్పుడూ మూతలు ఉంచి వండటం వల్ల ఆవిరి బయటకు పోకుండా ఆహారం త్వరగా ఉడుకుతుంది. బర్నర్ల నుంచి మంట పాత్ర అంచులను దాటి రాకుండా 'సిమ్'లో ఉంచడం వల్ల ఇంధనం వృథా కాదు.మరికొన్ని ముఖ్యమైన జాగ్రత్తలుగా.. వంట పాత్రలను కడిగిన వెంటనే తడితో పొయ్యి మీద పెట్టకుండా పొడి గుడ్డతో తుడిచి పెడితే, ఆ తడి ఆవిరి కావడానికి అయ్యే గ్యాస్ ఆదా అవుతుంది. స్టవ్ బర్నర్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి; బర్నర్ రంధ్రాలు పూడుకుపోయి మంట పసుపు రంగులోకి మారితే గ్యాస్ ఎక్కువగా వృథా అవుతుంది.చిన్నపాటి వంటలకు పెద్ద బర్నర్‌కు బదులు చిన్న బర్నర్‌ను వాడటం శ్రేయస్కరం. వంట చేసేటప్పుడు పాత్రలకు తగినంత నీరు మాత్రమే వాడాలి, ఎందుకంటే ఎక్కువ నీటిని మరిగించడానికి ఎక్కువ గ్యాస్ ఖర్చవుతుంది. అలాగే, గ్యాస్ లీకేజీలు లేకుండా రెగ్యులేటర్, పైపులను తరచూ తనిఖీ చేసుకోవాలి. ప్రతి గృహిణి ఈ పొదుపు సూత్రాలను పాటించడం వల్ల గ్యాస్‌ను పొదుపు చేయడమే కాకుండా ఆర్థిక భారాన్ని తగ్గించుకోవచ్చని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.